171

సంపుటి : 15 సంచిక : 2

# మార్క్సిస్టు

MARXISTU

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

పెట్టుబడి నియంతృత్వం
ముసుగు తొలగిన బిజెపి ప్రభుత్వం
సింధు నాగరికత - పతనం
సిఎఎ వ్యతిరేక ఉద్యమకారులపై కుట్ర కేసులు
వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తున్న మోడి
ప్రమాదంలో ప్రజా పంపిణీ వ్యవస్థ
భారతదేశ ప్రజలపై కోవిడ్-19 ప్రభావం
బెంగాల్ కరువు - ప్రజా సేవలో కమ్యూనిస్టులు



epaper.prajasakti.com

## బెంగాల్ కరువు

# ప్రజా సేవలో కమ్యూనిస్టులు



**1946లో బొంబాయిలో జరిగిన రాయల్ ఇండియన్ ఆర్మీ తిరుగుబాటులో పాల్గొన్న నావికులు**

**1943**లో దేశ చరిత్రలోనే కని విని ఎరుగనంత తీవ్రమైన కరువు వచ్చింది. బెంగాల్, ఒరిస్సా, బీహార్, అస్సాంలలో పరిస్థితి దారుణంగా ఉండింది. ఆకలిచావులు, ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం ఆనాటి పరిస్థితులకు అద్దం పడుతుండేవి. ఆహారపదార్థాల ధరలు 300 నుండి 1,200 శాతం పెరిగాయి. సాధారణ ప్రజలు ఆహారం కొనుక్కోలేని పరిస్థితి. ఆహారం కోసం బారులుతీరిన జనం కనిపించే దృశ్యాలు సర్వసాధారణంగా మారాయి. వార్తాపత్రికల కథనాల ప్రకారం కనీసం 12.5 కోట్లమంది ప్రజలు ఆకలితో అలమటించారు. బతికి ఉండడానికి ఎంతో మంది కీటకాలు, ఆకులూ అలములు తిన్నారు. ఇటువంటి విషాదకర పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ గొప్పపాత్ర నిర్వహించింది.

1943లో స్వాతంత్రదినం (జనవరి 26వ తేది) సందర్భంగా వెలువరించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో దేశం కరువు కోరల్లో చిక్కుకుందని, దాని ప్రభావం దేశమంతటికి వ్యాపించిందని ప్రకటించారు. "బెంగాల్‌లో కరువు కారణంగా ఇప్పటికే 50 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాంగ్రెస్ గనుక మన ప్రజలందరినీ ఐక్యపరచక పోతే, దేశంలో ఉన్న ప్రతి హిందువు, ప్రతి ముస్లిం తన కుటుంబాన్ని, తన పిల్లలను ఆకలిదప్పుల నుండి రక్షించుకోడానికి నడుం కట్టేలా చేయకపోతే దేశం అంతటా ఇదే పరిస్థితి ఏర్పడుతుంది." కాంగ్రెస్, ముస్లింలీగు కలిసి ఐక్య వేదికగా ఏర్పడాలని కమ్యూనిస్టు పార్టీ చేసిన విజ్ఞప్తి, ఆ నాటి పార్టీ ప్రచారంలో ముఖ్యమైన అంశం. ఆ నాడు దేశంలో హిందు, ముస్లింల ఐక్యతను దెబ్బతీసే ప్రమాదం ఉండడం అందుకు కారణం. కాంగ్రెస్ కార్యకర్తలు ఆహారం కోసం ముందు వరుసలో ఉండి పోరాటాలు చేయటం జాతీయ నాయకులను విడిపించుకునేందుకు ముస్లింల మద్దతును సమీకరించుకోవటానికి వుపయోగ పడుతుందని, కాంగ్రెస్ ముస్లింలీగ్‌లు రెండూ కలిసి దేశసేవలో భాగస్వాములు కావటం ముస్లింలీగ్, ఆ పార్టీ డిమాండ్ల పట్ల కాంగ్రెస్‌లో ఉండే అపార్థాలు, అపోహలు తొలగిపోవటానికి తోడ్పడతాయని పార్టీ అభిప్రాయపడింది. ఆహారం కోసం చేసే పోరాటం వాస్తవంలో అధికారం కోసం, స్వేచ్ఛకోసం చేసే పోరాటంగా మారుతుంది. "ఆహారం కోసం, రక్షణ కోసం, దేశ నాయకుల విడుదల కోసం అవసరమైన ప్రజాఐక్యతను సాధించడానికి కాంగ్రెస్, లీగ్ రెండూ కలిసి ముందుకు సాగాలి"

యుద్ధం, యుద్ధం వలన ఏర్పడ్డ ఇతర సమస్యలు, ఆహార సమస్యల పట్ల ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీల అవగాహనకు భిన్నంగా పార్టీ దృక్పథం ఉన్నది. కార్మికులు, కర్షకులు ఇతర సాధారణ ప్రజల రోజువారీ సమస్యలతో ఈ సమస్యల పరిష్కారాన్ని పార్టీ అనుసంధానం చేసింది. ధరల అదుపుకు, ఆహారధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువుల పంపిణీకి ప్రభుత్వంతో పార్టీ సహకరించినా ఆహారధాన్యాల కొరత, విద్రోహ చర్యలకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించింది. అత్యవసర సరుకుల సేకరణ, పంపిణీల కార్యక్రమాలలో పాలు పంచుకోడానికి పార్టీ కొంతమంది సభ్యులతో ప్రత్యేక నిర్మాణాన్ని రూపొందించింది. పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులను పెంచాలని ఇచ్చిన పిలుపులను మరింత బలంగా నొక్కి చెప్పింది.

లాభాపేక్షే ధ్యేయంగా భూస్వాములు, టోకు వ్యాపారులు, స్వంత ప్రయోజనాలే ప్రధానమనుకునే వారందరిని కట్టడి చేయకుండా ధరలను అదుపుచేయలేమని, దుర్భిక్షాన్ని నిలవరించలేమని భారత కమ్యూనిస్టు పార్టీ నొక్కి చెప్పింది. బడా భూస్వాముల నుండి, ధనికుల నుండి ధాన్యం నిల్వలను చేజిక్కించుకుని ప్రజలకు పంచాలని, అలా పంచే విధానం అమలు చేయడానికి తగిన ఆచరణాత్మక సలహాలను కూడా ఇచ్చింది. కరువుతో అల్లాడుతున్న ప్రాంతాల నుండి ధాన్యం తరలింపులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూనే, ఆ పని అధికారులు చేయనిచోట పార్టీ కార్యకర్తలు చేసే విధంగా ప్రణాళికను రూపొందించింది. స్వచ్ఛంద సంస్థలు కూడా బడా భూస్వాములు, వ్యాపారుల అనధికార ఆహారానిల్వలను, ఇతర నిత్యావసర నిల్వలను పట్టుకునే వారు. దోపిడీకి పాల్పడే భూస్వాములకు, టోకు వ్యాపారులకు,ఈ దోపిడీ దారులకు అండగా ఉన్న బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ చురుకుగా కార్యక్రమాలు నిర్వహించేది. దేశవ్యాప్తంగా బెంగాల్ కరువును గూర్చి ప్రచారం చేయడం, కరువు నివారణ సహాయ కార్యకలాపాలలో పాల్గొనడం పార్టీ ప్రతిష్టను పెంచింది. బెంగాల్ కరువు కాలంలో ఎల్లవేళలా పార్టీ ప్రజలకు అండగా ఉండాలన్న వైఖరిని తీసుకుంది.

బెంగాల్‌లో సహాయక శిబిరాలు నిర్వహించి నడపడానికి పార్టీ ఆహారధాన్యాలు, నగదు, నిత్యవసర వస్తువులు సేకరించింది. పార్టీ డాక్టర్లతో సహా స్వచ్ఛంద సేవకులను ఈ సహాయక శిబిరాలు నిర్వహించడానికి సంఘటితం చేసింది. సహాయ కార్యక్రమాలలో పార్టీ జోక్యం చేసుకోవడం వలన ప్రజలతో సంబం

(మిగతా 32వ పేజీలో)



epaper.prajasakti.com

## ఈ సంచికలో...

1. బెంగాల్ కరువు
ప్రజా సేవలో కమ్యూనిస్టులు ................. 2

2. పెట్టుబడి నియంతృత్వం
ప్రొ. ఐజాజ్ అహ్మద్ ................... 4

3. ముసుగు తొలగిన బిజెపి ప్రభుత్వం
వెంకిటేష్ రామకృష్ణన్ ................... 7

4. సింధు నాగరికత - పతనం
ఎంవిఎస్ శర్మ........................ 10

5. సిఎఎ వ్యతిరేక ఉద్యమకారులపై కుట్ర కేసులు
అపూర్వానంద్ ........................ 12

6. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు
అప్పగిస్తున్న మోడి
ఎ కోటిరెడ్డి.......................... 15

7. ప్రమాదంలో ప్రజా పంపిణీ వ్యవస్థ
ఉత్సా పట్నాయక్..................... 20

8. భారతదేశ ప్రజలపై కోవిడ్-19 ప్రభావం
పి. సాయినాథ్....................... 26

సంపాదకుడు:
ఎస్. వెంకట్రావు

సంపాదక వర్గం:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి. రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి.,
14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
ఫోన్: ఎడిటర్ : 9490099333
మేనేజర్: కె.హరికిషోర్: 9490098977, 9494101091
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

# అమెరికా ఉచ్చులో పడొద్దు !

భారత్, చైనా సరిహద్దుల్లో దశాబ్దాలుగా నెలకొన్న శాంతి సామరస్యాలకు భంగం కలిగిస్తూ జూన్ 15న ఇరు దేశాల సైనికుల మధ్య జరిగిన దురదృష్టకరమైన ఘర్షణ రెండు ఆసియా అగ్ర దేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచింది. లడఖ్‌లోని పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఇరుసైనికుల మధ్య బలగాల ఉపసంహరణ జరగుతున్న తరుణంలో అకస్మాత్తుగాజరిగిన ఈ ఘర్షణలో 20 మంది భారతీయ సైనికులు మరణించగా 40 మంది చైనా సైనికులు మరణించడమో, గాయపడ్డమో జరిగినట్లు వార్తలు వచ్చాయి.

ఉద్రిక్తతలు ఏర్పడినప్పుడు శాంతి వచనాలకన్నా దుడుకుతనం వైపే మొగ్గుకనిపిస్తుంది. కానీ ఉద్రిక్తతలు చల్లారి, రెండు పక్షాలు వాస్తవ పరిస్థితులను ఆకళింపు చేసుకున్నప్పుడు సరిహద్దుల్లో శాంతి ప్రాధాన్యత అర్థమవుతుంది. ఒకవైపు ఆర్థిక మాంద్యం, మరోవైపు కరోనా మహమ్మారి మానవాళిని పట్టిపీడిస్తున్న తరుణంలో ప్రంచంలోనే జనాభాలో అతిపెద్ద దేశాలైన భారత్, చైనాలు ఉద్రిక్తతలు పెంచుకోవడం రెండు దేశాల ప్రజలకూ మంచిది కాదు. ఉన్న వనరులను కరోనాతో పోరాటానికి, ఉపాధి సృష్టికి సమీకరించాల్సిన తరుణంలో సరిహద్దులకు తరలించడం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతారు.

ఇదిలా ఉండగా ఈ ఉద్రిక్తతలను ఉపయోగించుకుని భారత్‌ను తన యుద్ధోన్మాద ఉచ్చులో పడేసుకోడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాల పట్ల మనం మరింత అప్రమత్తంగా ఉండాలి. భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో తమ దేశం దక్షిణ చైనా సముద్ర ప్రాంతానికి బలగాలను పంపిస్తుందని అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో జూన్ 25న చేసిన ప్రకటన ఇరు దేశాల మధ్య అగ్గి మరింతగా రాజేయడానికి చేసిన ప్రయత్నమే. బహుళధృవ ప్రపంచంపై ఆర్థికంగా, రాజకీయంగా పట్టుకోల్పోతున్న అమెరికా తిరిగి తన ఏకఛత్రాధిపత్యాన్ని నెలకొల్పడానికి ఆసియా కేంద్రంగా (ఆసియా పైవోట్) పావులు కదుపుతోంది. ఆసియాలో బలంగా ఎదుగుతున్న చైనా, భారత్‌లు ఈ శతాబ్దాన్ని ఆసియా శతాబ్దంగా మార్చేస్తున్నాయి. ఆర్థికాభివృద్ధిలో మొదటి అయిదు దేశాల్లో మూడు – చైనా, జపాన్, భారత్ ఆసియాలోనే ఉన్నాయి. అందువల్ల ఇక్కడ చిచ్చు పెట్టడానికి అమెరికా చాలా కాలంగా చాలా రకాల ప్రయత్నాలు చేస్తోంది. భారత పాలకులు అటువైపు మొగ్గడం కూడా ప్రారంభించారు. ఇప్పుడు రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను అది అవకాశంగా మార్చుకుని యుద్ధాన్ని రాజేయడానికి ప్రయత్నిస్తోంది.

దేశాల మధ్య యుద్ధాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం అమెరికాకు కొత్తేమీ కాదు. ఇజ్రాయిల్‌ను ఉపయోగించుకుని పశ్చిమాసియాను రణరంగంగా మార్చింది. పదేళ్ల పాటు ఇరాక్‌ను ఇరాన్‌పైకి ఎగదోసి, ఎదిగి వస్తున్న రెండు దేశాలను నాశనం చేసింది. తరువాత ఇరాక్‌పై యుద్ధానికి దిగి నేలమట్టం చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌లో సోవియట్‌కు వ్యతిరేకంగా తాలిబాన్లను ఎగదోసింది. తరువాత ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో తాలిబాన్ల పాలనలోని ఆఫ్ఘనిస్థాన్‌పై దాడులకు దిగింది. అందువల్ల అమెరికా చరిత్ర పరిశీలిస్తే దానిది స్నేహ హస్తం కాదు భస్మాసుర హస్తం అని తెలుస్తుంది. మన పాలకులు గత కొంత కాలంగా భారత విదేశాంగ విధాన స్వాతంత్ర్యాన్ని నీరుగారుస్తూ, అమెరికా వ్యూహంలో దేశాన్ని జూనియర్ భాగస్వామిగా మారుస్తూ వస్తున్నారు. ఇది మన దేశానికి ప్రమాదకరమని సిపిఐ(ఎం) హెచ్చరిస్తూ వచ్చింది. అమెరికా పంచన చేరడాన్ని సమర్థించుకోడానికి ఈనాడు చైనాతో వచ్చిన తాత్కాలిక ఉద్రిక్తతలను మోడీ ప్రభుత్వం ఉపయోగించుకుంటోంది. అమెరికాతో స్నేహం చేయడమంటే భస్మాసుర హస్తాన్ని నెత్తిన పెట్టుకోవడమే. అందువల్ల అమెరికా ఉచ్చులోకి దేశాన్ని తోయకుండా ప్రభుత్వంపై ప్రజలనుండి ఒత్తిడి పెంచాలి.

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా: **రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**



epaper.prajasakti.com



ఇంటర్వ్యూ

# పెట్టుబడి నియంతృత్వం

**ప్రొ. ఐజాజ్ అహ్మద్**

*మిన్నెపోలిస్‌లో జరిగిన జార్జి ఫ్లాయిడ్ హత్య అమెరికాతో పాటు ప్రపంచవ్యాపితంగా నిరసనలకు దారితీసింది. ప్రాణాంతకమైన కోవిడ్-19 మహమ్మారి ప్రమాదం పొంచివున్నప్పటికీ వేలాది మంది నిరసన ప్రదర్శనలలో పాల్గొంటున్నారు. ఇటువంటి ఆందోళనలను అణచటంలో పెట్టుబడిదారీ వ్యవస్థ విఫలం కావటం, ప్రజలు లొంగివుండేలా చేయటం కోసం ఏర్పాటు చేసిన అధికార వ్యవస్థ నిస్సహాయంగా ఉండటం తదితరాలను గురించి సామాజికాంశాలపై అధ్యయనం చేస్తున్న ట్రైకాం టినెంటల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మార్క్సిస్టు మేధావి **ప్రొఫెసర్ ఐజాజ్ అహ్మద్** లెఫ్ట్‌వర్డ్ ఎడిటర్ విజయప్రసాద్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలను మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.* **- సంపాదకుడు.**

**విజయప్రసాద్:** మిన్నెపోలిస్‌లో జార్జి ఫ్లాయిడ్ భయానక హత్య తర్వాత ప్రపంచంలో అగ్గిరాజుకున్నట్లైంది. తాము చూస్తున్న దానిపై అమెరికాలో మాత్రమే కాక ప్రపంచ వ్యాపితంగా ప్రజలు ఆగ్రహోదగ్రులైనారు. జార్జి ఫ్లాయిడ్ హత్య, అమెరికన్ సమాజంలో పోలీసుల పాత్రపై వెల్లువెత్తుతున్న నిరసనలపై వివరిస్తారా?

**ఐజాజ్ అహ్మద్:** ఈ సమస్య బాగా తీవ్రమౌతున్నట్లు అనిపిస్తున్నది. అమెరికన్ పోలీసులకు సగటున వారానికి ఒక నల్లజాతి వ్యక్తిని చంపటం అలవాటు. ఎక్కువగా మగవారినే చంపుతున్నప్పటికీ వారు మహిళలను కూడా చంపుతుంటారు. అది ఇపుడు పెరుగుతున్నది. ఇంతకు ముందటి ఉదాహరణ ఫెర్గుసన్. అక్కడ పెద్ద తిరుగుబాటు జరిగింది. ఇటువంటివన్నీ నల్లజాతి వారి ప్రాణాలూ విలువైనవి(బ్లాక్‌లైవ్స్ మేటర్) అన్న ఆందోళనకు దారితీశాయి. కాబట్టి ఇది ఈ మధ్యకాలంలోనే నిర్మాణమైంది. రెండవ అంశం అమెరికాలో ఇటువంటి సంఘటనలు నిరంతరం జరుగుతుంటాయి. 70వ దశాబ్దంలో నేను అక్కడ నివసిస్తున్నపుడు ఇదే విధమైన సంఘటన- పోలీసులు అత్యంత క్రూరత్వంగా ప్రవర్తించటం-లు జరిగాయి. కొన్ని సందర్భాలలో అవి పోలీసులు చేసినవి కాదనిపించే విధంగా రహస్యంగా చేసేవారు. వాటికి వ్యతిరేకంగా భారీస్థాయిలో నిరసనలు జరుగుతుండేవి. కాబట్టి ఇటువంటివి నిరంతరం జరుగుతుంటాయి.

అనేకమందిని బాధలకు గురిచేస్తున్న తెల్లజాతి ఆధిక్యతను గురించి ప్రతివారూ మాట్లాడటం దీనిని అర్థం చేసుకోవటంలో వున్న సంక్లిష్టమైన దానిలో మూడవ అంశమని నేను భావిస్తున్నాను. దాని అర్థమేమైనప్పటికీ అమెరికన్ ప్రజలలో 13 నుండి 15 శాతం ప్రజలు చెడ్డవారని జో బిడెన్ చెబుతున్నాడు. అది వాస్తవం కాదని మీకు తెలుసు. జాత్యహంకారం ఉన్న సమాజాలలో తెల్లజాతి ఆధిపత్యం కొనసాగుతున్నది. పోలీసులలో ఎక్కువ మంది తెల్లజాతి దురహంకారంతో తుపాకులు పట్టుకొని తిరుగుతుంటారు. ప్రజలను అదుపులో పెట్టటం కోసం చర్యలు తీసుకొంటున్న పోలీసులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తున్నది. వారు ఏమైనా తీసుకొనిపోవచ్చు. ఏమైనా చేయవచ్చు. అది తమహక్కుగా వారు భావిస్తుంటారు.

ప్రస్తుతం జరిగిన సంఘటనలలో ముఖ్యమైనది ఒక వీడియోలో ఒక తెల్లజాతి వ్యక్తి. అతను వృద్ధుడు, కార్యకర్త-ఆయన వృద్ధుడు- కాబట్టి పోలీసులకు కూడా తెలిసివుంటుంది. ఆయన ఈ కార్యకలాపాలను బఫెలోలో 30-40 సంవత్సరాల నుండి చేస్తున్నాడు. తప్పనిసరిగా ఆయన బాగా తెలిసిన వ్యక్తి అయివుంటాడు. వీడియోలో ఇద్దరు పోలీసులు ఆయనను నెడుతున్నారు. ఆయన కిందపడిపోయాడు. ఆయన తల నేలకు కొట్టుకుంది. చాలాకాలం వ్యతిరేకించిన తర్వాత చివరకు ఆ ఇద్దరు పోలీసులపై పోలీసు డిపార్ట్‌మెంటు చర్య తీసుకున్నది. దీనితో వారి సహచరులు 57 మంది వారికి సంఘీభావంగా రాజీనామా చేశారు. వారు చేస్తున్న ఈ చర్యకూడా వీడియోలో కనిపించింది.

కాబట్టి పోలీసులకు ఈ విధమైన ప్రత్యేక హక్కులను ఇవ్వటం, వారు ఆ విధంగా వ్యవహరించటం అమెరికన్ల నిత్య జీవితంలో భాగమైంది. అందువలన ప్రస్తుతం తమకు వ్యతిరేకంగా సంభవిస్తున్న పరిణామాలను చూసి ఆశ్చర్యపోతున్నారు. లాంగ్‌బీచ్‌లో నేనున్న ప్రదేశానికి సమీపంలోనే ఒక నల్లజాతి వ్యక్తి తన చిన్న కుమార్తెను భుజాలపై కూర్చోపెట్టుకున్నాడు- ఆ పిల్ల చాలా చిన్నది కాబట్టి భుజాలపై కూర్చోబెట్టుకున్నాడు- వారికి ఒక అడుగు దూరంలో ఒక తెల్లజాతి పోలీసు ఆ బాలికకు తన తుపాకిని గురిపెట్టాడు. ఇదంతా బహిరంగంగానే జరిగింది. ఒక ప్రదర్శన మధ్య ఇదంతా జరిగింది కాబట్టి పాల్గొన్నవారిలో ఎవరో ఒకరు ఫోటో లేదా వీడియో తీస్తారని వారికి తెలుసు.

ఈ విధంగా ఈ దేశంలో, అనేక పెట్టుబడిదారీ దేశాలలో పోలీసులకు అన్ని విధాలైన శిక్షల నుండి రక్షణ కల్పించారు. కాబట్టి వాస్తవంగా పెట్టుబడిదారీ సమాజాలు ఏ విధంగా పనిచేస్తున్నాయో పరిశీలన చేయాల్సిఉంది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న రెచ్చగొట్టే అధ్యక్షుడు -ఈ తెల్లజాతి దురహంకారులను, ఈ "మంచి మనుషుల"ను హింసను రెచ్చగొట్టే విధంగా- శాంతియుతంగా జరుగుతున్న ప్రదర్శనలకు వ్యతిరేకంగా రాజధాని వాషింగ్టన్ డి.సిలో సైన్యాన్ని మోహరించాడు. జాయింట్ ఛీఫ్ ఆఫ్ స్టాఫ్‌ను తన పక్కన పెట్టుకొనే సైన్యాన్ని మోహరించటానికి ఆదేశాలను జారీచేశాడు. 70వ దశాబ్దంలో జరిగిన వియత్నాం యుద్ధకాలం నుండి నేను అమెరికాను చూస్తున్నాను. అపుడు పెద్దసంఖ్యలో ప్రజలు నిరసన ప్రదర్శనలలో పాల్గొనేవారు. కాని ట్రంప్ చేస్తున్న విధంగా తెల్లజాతి దురహంకారులను బహిరంగంగా రెచ్చగొట్టటం, సైన్యాన్ని మోహరించటం, తెల్ల



epaper.prajasakti.com

జాతి సాయుధమూకలు చెలరేగిపోవటం ఇదే మొదటిసారి. కాబట్టి అమెరికాలో పరిస్థితు లను మరీ దిగజారుస్తున్న ప్రత్యేక పరిస్థితి ఇది. ట్రంప్ పరిస్థితిని తీవ్రం చేసేకొద్దీ ప్రజల ఆగ్రహం మరింత పెరుగుతున్నది.

డెమొక్రటిక్ పార్టీ తమ సమస్యలను పరిష్కరించలేదని, తమకు ప్రాతినిధ్యం వహించే పరిస్థితి లేదని అమెరికా ప్రజలు భావిస్తున్నారు కాబట్టి ఈ సమయంలో మరింత ఆందోళనతో ఉన్నారు. తమ ప్రతినిధులు ఎవరూ లేని, తమకు ప్రాతినిధ్యం వహించేవారు ఎవరూ లేని ప్రజలు ప్రజాస్వామిక సమాజం కేంద్రంలో ఉన్నారు. కాబట్టి మీరు చెబుతున్నట్లుగా ఈ దేశమంతా అట్టుడికిపోతున్నది.

**విజయప్రసాద్:** నాలుగింట మూడొంతుల పెట్టుబడిదారీ సమాజంలో పరిస్థితులు ఈ విధంగానే ఉన్నాయి. ప్రైవేటు ఆస్తి ఏ విధం గానూ అతిక్రమించలేనిదిగా ఉన్న సమాజంలో ప్రైవేటు ఆస్తిని రక్షించటం, తదితర ప్రత్యేక బాధ్యతలు పోలీసులకు ఉన్నాయని మీరు చెప్పారు. పెట్టుబడిదారీ దేశాలలోనే అమెరికా ప్రత్యేక తరహాకు చెందినది. ప్రపంచంలోనే అత్యధిక శాతం ప్రజలను జైళ్ళలో నిర్బంధించిన దేశం అమెరికా. వాస్తవంగా చెప్పుకోవాలంటే ఒక పోలీసు అధికారికి, సైనికాధికారికి మధ్య వ్యత్యాసం ఉంటుందని చెప్పలేం. ప్రస్తుతం వారందరూ ఒకేవిధంగా కనిపిస్తున్నారు.

**ఐజాజ్ అహ్మద్:** అవునవును

**విజయప్రసాద్:** పెట్టుబడిదారీ సమాజంలో పోలీసుల పాత్ర గురించి వివరించండి.

**ఐజాజ్ అహ్మద్:** నేను పెట్టుబడిదారీ సమాజాల గురించి సాధారణంగా చెప్పాను. అమెరికాను గురించి ఈ విషయాలు చెబుతున్నాను. అమెరికాలో అన్ని సమయాలలోనూ ఒక ప్రత్యేకమైన సిద్ధాంతం ముందుపీఠిన ఉంటుంది. తుపాకులతో కూడిన పురుషాధిక్యత, తుపాకులు కలిగివుండటంతో ముడిపడి ఉంటుంది. కాబట్టి అది కేవలం ఎక్కువ మంది ప్రజలను జైళ్ళలో నిర్బంధించిన దేశం మాత్రమే కాదు. వేలాది మంది ప్రజలను హత్య చేస్తున్న దేశం కూడా. ప్రతి సంవత్సరం ఎన్ని హత్యలు జరుగుతున్నాయో నేను ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోలేదు. కాని పక్కనున్న కెనడాతో పోల్చుకుంటే చాలా ఎక్కువగా జరుగుతున్నాయి.

అమెరికాలో వివాదాలను, వ్యక్తిగత వివాదాలను కూడా తుపాకులతో పరిష్కరించుకోవటం చాలా సాధారణ విషయంగా మారింది. పోలీసులకు అన్ని విధాలైన శిక్షల నుండి పూర్తి మినహాయింపు ఇవ్వబడింది కాబట్టి ఇది

**"ఉదాహరణకు భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశం. కాని దేశంలోని లక్షలాది మంది కార్మికులను వారుంటున్న నగరాల నుండి బయటికి నెడుతున్నారు. వారు నిరాధారులుగా తిరుగుతూ రైల్వేలైన్లపై చనిపోతున్నారు. మనదేశంలో గొప్ప ప్రజాస్వామ్యం కొనసాగుతున్నది. కాని వీటికి గానూ ఏ ఒక్కరినీ శిక్షించటం లేదు. ప్రభుత్వం, మంత్రులు, ఉన్నతాధికారులకు ఏమీ జరగటం లేదు. ఇదేమిటో నాకు అర్థం కావటం లేదు."**




జార్జిఫ్లాయిడ్ హత్య తర్వాత అమెరికాలో జరుగుతున్న ఆందోళనలలో పాల్గొంటున్న ప్రజలు

మరింత తీవ్రమౌతున్నది. ప్రజాస్వామిక సమాజం! మొదటి అంశం ప్రజాస్వామిక సమాజం అనేదానిని ఏ అర్థంలో చూస్తున్నామనే దానిపై నేను పూర్తి స్పష్టంగా లేను. దానిలో ఒక విధమైన వర్గీకరణ ఉన్నది. అమెరికా, భారతదేశంలో జరుగుతున్న విధంగా ఎన్నికలు జరుగుతుంటే మీరు ప్రజాస్వామిక సమాజంలో ఉన్నట్లే. దీని సారాంశం ఏమిటనేది నేను అర్థం చేసుకో లేక పోతున్నాను. ఉదాహరణకు భారత దేశం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశం. కాని దేశంలోని లక్షలాది మంది కార్మికులను వారుంటున్న నగరాల నుండి బయటికి నెడుతున్నారు. వారు నిరాధారులుగా తిరుగుతూ రైల్వేలైన్లపై చనిపోతున్నారు. మనదేశంలో గొప్ప ప్రజాస్వామ్యం కొనసాగుతున్నది. కాని వీటికి గానూ ఏ ఒక్కరినీ శిక్షించటం లేదు. ప్రభుత్వం, మంత్రులు, ఉన్నతాధికారులకు ఏమీ జరగటం లేదు. ఇదేమిటో నాకు అర్థం కావటం లేదు. కాని పెట్టుబడిదారీ విధానం అంటే ఏమిటి, పెట్టుబడిదారి విధానానికి ఇది ఎందుకు అవసరం అనే ప్రశ్నలపై ఇపుడు నేను మాట్లాడ తాను. లూయిస్ అల్తూసర్ అద్భుతమైన ఒక పెద్ద వ్యాసం రాశాడు. అది ఇపుడు పుస్తకంగా వచ్చింది. దానిలో ఆయన ప్రభుత్వ యంత్రాంగం యొక్క సైద్ధాంతిక స్వభావాన్ని గురించి చర్చించాడు. పూర్తిగా ఆర్థికతర్కంపైన మాత్రమే ఆధారపడితే పెట్టుబడిదారీ ఆర్థిక విధానం తనను తాను ఒక సంవత్సరం కూడా పునరుత్పత్తి చేసుకోలేదని దానిలో ఆయన పేర్కొన్నాడు. ఈ ఆర్థికతర్కం చుట్టూ బలప్రయోగం చేసే సాధనాలు, సైద్ధాంతిక ప్రచారం ఉండాలని పేర్కొన్నాడు. బలప్రయోగం చేసే నిర్మాణాన్ని, నిత్య జీవితంలో నీవుచేసే పనులన్నింటినీ రాజ్యం అదుపు చేసే విధంగా నిర్మించిన బల ప్రయోగ యంత్రాంగాన్ని సమర్థించే విధంగా సిద్ధాంతం ఉండాలి.

నీవు పరిమితిని దాటి కారు నడుపుకెళితే పోలీసులు వచ్చి చర్యలు తీసుకుంటారు. నీవు తెల్లజాతి వాడివైతే ఒక విధంగా, నల్లజాతి వాడివైతే మరోవిధంగా వ్యవహరిస్తారు. కాబట్టి వాస్తవంగా నీ జీవితం అంతా క్రమబద్ధీకరించబడుతుంది. మీరు కట్టాల్సిన పన్నులను చెల్లించటంలో 15 రోజులు ఆలస్యమైతే, దానిని అధికారులకు అందజేయటం మరిచిపోతే, ఇతర


epaper.prajasakti.com

**"వ్యక్తిగతంగా ట్రంప్‌కు సంబంధించిన అనేక సమస్య లతో పాటు జాతివివక్షకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ బలమైన పోరాటం గొప్ప తిరుగుబాటుగా మారుతుందని, అమెరికా కార్మికుల్లోని మూడిం ట ఒకవంతు మంది పడుతున్న బాధలతో మరింత తీవ్రమైన తిరుగుబాటుగా మారుతుందనే భయం ఉందని భావిస్తున్నాను. అదివారి భయం. దానిని నివారించటం కోసం ముందుగానే ఆ తిరుగుబాటుపై సాధ్యమై నంత కఠినంగా వ్యవహరిస్తున్నారు."**

చోట్ల నుండి 20 లేదా 100 డాలర్లు మీరు పొందినట్లైతే మీకు జరిమానా విధిస్తారు. ఈ సమాజాలు పూర్తిగా క్రమశిక్షణా చర్యలతో ఉన్నాయి. పెట్టుబడిదారి సమాజం, వర్గ సమాజం సమర్ధవంతంగా, శాంతియుతంగా పనిచేయాలంటే క్రమశిక్షణ, శిక్షలు, అనిశ్చితి తదితరాలు ఇవన్నీ మీ నిత్య జీవితంలో మీరు అనుభవిస్తుండాలి. అలవాట్లు, అణిగిమణిగి ఉండటం రూపంలో ఇవి వ్యక్తం అవుతాయి.

అలవాట్లు, అణిగిమణిగి ఉండటం తదితరాలలోకి ప్రజలను అలవాటు చేయకుండా వర్గ నిర్మాణాలను పునరుత్పత్తి చేయటం సాధ్యం కాదు. ప్రపంచంలో పెట్టుబడి అత్యంత నియంత్రుత్వంతో వ్యవహరిస్తున్నది. ప్రజాస్వామిక సమాజాలు, నియంతృత్వ సమాజాలన్నింటిలోనూ జరిగేది ఇదే. వీటికి వివిధరకాలైన పేర్లు పెడతారు. వైరస్ -కరోనా వైరస్-సోకిన పరిస్థితులు అమెరికాలో అత్యంత తీవ్రమైన ఆర్థిక విధ్వంసానికి దారితీశాయి. దీనితో 4.62 కోట్లమంది నిరుద్యోగభృతి ప్రయోజనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాని ప్రభుత్వం నిరుద్యోగ భృతిని విస్తరింపజేయటానికి తిరస్కరించటం అత్యంత నియంత్రుత్వంతో కూడిన విషయం. ఒకనెల రోజులలోనే 3.5 కోట్లమంది ప్రజలు వారి ఆరోగ్యబీమాను కోల్పోవటం లేదా కోల్పోయే పరిస్థితులలో ఉన్నారు. ఇవన్నీ జరుగుతున్న సమయంలోనే 0.1 శాతం మందిగా ఉన్న ధనికులకు ప్రభుత్వం కొన్ని లక్షల కోట్ల డాలర్లను కట్టబెట్టింది. ఇటువంటి స్థితిలో ప్రజల ఆగ్రహాన్ని ఏ విధంగా అదుపుచేయగలరు? నిత్య జీవితంలో, రోజులు, వారాలు, సంవత్సరాలు, జీవితకాలం ఇటువంటి హింసాత్మక ఘటనలను చూయించటం ద్వారా కాకుండా సమాజంలోని అస్థిరతను వారేవిధంగా అదుపు చేయగలరు?

'వారిని 10 సంవత్సరాలు పక్కన పెట్టండి, ఫలానాది చేయండి..' అని ప్రస్తుతం ట్రంప్ చెప్పటం సైనికబలాన్ని ప్రదర్శించటానికేనని,"గవర్నర్‌లు, నగర ప్రభుత్వాలు అదుపు చేయక పోతే సైన్యం ద్వారా అదుపుచేస్తానని" అందుకే చెబుతున్నాడని నేను భావిస్తున్నాను. వ్యక్తిగతంగా ట్రంప్‌కు సంబంధించిన అనేక సమస్యలతో పాటు జాతివివక్షకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ బలమైన పోరాటం గొప్ప తిరుగుబాటుగా మారుతుందని, అమెరికా కార్మికుల్లోని మూడింట ఒకవంతు మంది పడుతున్న బాధలతో మరింత తీవ్రమైన తిరుగుబాటుగా మారుతుందనే భయం ఉందని భావిస్తున్నాను. అదివారి భయం. దానిని నివారించటం కోసం ముందుగానే ఆ తిరుగుబాటుపై సాధ్యమైనంత కఠినంగా వ్యవహరిస్తున్నారు. దేశంలో ఎల్లప్పుడూ జరుగుతున్న నల్లజాతి వారిని చంపటంపై ఇపుడు తీవ్రమైన ఆగ్రహం వ్యక్తమౌతున్నది. కాబట్టి ఇది ఆగ్రహం వ్యక్తమౌతున్న ప్రత్యేకమైన సందర్భం.

ప్రజలు విధేయంగా ఉండరనే భయం అన్ని పెట్టుబడిదారీ సమాజాలలోనూ వ్యక్తమౌతుంటుంది. దోపిడీకి గురవుతున్నవారు తిరుగుబాట్లు చేస్తారని తదితర భయాలు ఉంటాయి. అందువలననే ఈ విధంగా ప్రజలను భయభ్రాంతులను చేయటం, అణచివేయటం జరుగుతుంది. పోలీసులు దానిలో ఒకభాగం మాత్రమే. వాస్తవంగా అర్ధ సైనిక, సైనిక బలగాలు, రక్షణ, న్యాయవ్యవస్థతో ముడిపడిన ఇతర సంస్థలు డజనుకుపైగానే ఉన్నాయి. ప్రస్తుతం అవన్నీ ఈ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నాయి. ఏ ప్రభుత్వ సంస్థలు ప్రజలను అణచివేసే కార్యక్రమాలలో పాల్గొంటున్నాయో ప్రభుత్వం తెలియజేయాలని ప్రస్తుతం కోర్టులలో కేసులు నడుస్తున్నాయి. వారు ఏ ఏజన్సీకి చెందుతారో తెలియజేసే గుర్తులు లేకుండా యూనిఫారంలలో బలగాలను వినియోగిస్తున్నారు.

వాస్తవంగా పెట్టుబడిదారీ సమాజానికి చెందిన చట్టాల ప్రకారం కూడా ఇది చట్టవ్యతిరేకమైనది. కాని అదేవారు చేస్తున్నారు. ఈ దేశ చట్టాలను అనుసరించి ప్రజలు తమకున్న హక్కు ప్రకారం 'మీ గుర్తింపును చూపమని' అడిగే అధికారం ఉంది. వారు అలా అడిగినపుడు 'నేను మీకు చెప్పను. నేను అమెరికా ప్రభుత్వం కోసం పనిచేస్తున్నాను. ప్రభుత్వాన్ని కాపాడటానికే నేను ఉన్నాను' అని చెబుతున్నారు.

ముందుగానే ఊహించిన ఉద్యమాలను అణచివేయటం కోసం అధికారాన్ని ప్రదర్శించటం, మరింత ఎక్కువగా హింసాకాండను కొనసాగించటం ఎల్లప్పుడూ జరుగుతూనే వుంటుంది. ఇంకా ఎక్కువగా హింసాకాండను కొనసాగించే సందర్భాలు కూడా వస్తుంటాయి.

**విజయప్రసాద్:** తమకెదురౌతున్న భౌతిక పరిస్థితులలో ప్రజలను అణచివుంచటానికి ప్రభుత్వం వివిధ సంస్థలను వినియోగిస్తున్నదని మీరు చెప్పిన అంశాలలో స్పష్టమౌతున్నది. ప్రజలలో మూడోవంతు మంది నిరుద్యోగులుగా ఉన్నారని మీరు చెప్పారు. కాని అమెరికా ప్రజలలో 40 శాతం మంది ఆహార సరఫరా(ఫుడ్ కిచెన్లు) కేంద్రాలను వినియోగించుకొంటున్నారని ఒక అధ్యయనంలో చెప్పిన విషయాన్ని నేను చదివాను. సంక్షోభం తీవ్రమౌతున్నది. భౌతిక పరిస్థితులను గురించిన మీ వివరణ ప్రకారం ప్రజల అవిధేయత కూడా పెరుగుతుందని స్పష్టమౌతున్నది.

**ఐజాజ్ అహ్మద్:** నిరంతరం హింసకాండ జరుగుతుండటం లేదా హింసాకాండ జరుగుతుందనే భయం లేకపోతే పెట్టుబడిదారీ వుత్పత్తి విధానాన్ని పునరుత్పత్తి చేయటం సాధ్యం కాదని నేను చెబుతున్నాను. నిరుద్యోగం 3-4 శాతానికి చేరిన సమయాలలో ప్రజలు సాధారణ జీవనానికి అలవాటుపడతారు. ఈ విధంగా తరతరాల నుండి ప్రజలకు మానసికంగా, సైద్ధాంతికంగా శిక్షణ ఇస్తున్నారు. దీనిలో వారు చాలా ఎక్కువగా జయప్రదం అయ్యారు. విధేయతతో ఉండే అలవాట్లను ప్రజలకు నేర్పారు. 2007-08లో వచ్చిన ద్రవ్య సంక్షోభంలో కోటిమందికి పైగా ప్రజలు-నాకు ఖచ్చితమైన సంఖ్య గుర్తులేదు- వారి ఇళ్ళను కోల్పోయారు. అయినప్పటికీ చెప్పుకోదగిన ప్రదర్శనలుగాని, తిరుగుబాట్లుగాని జరగలేదు.


**విజయప్రసాద్:** ద్రవ్య సంక్షోభం వచ్చిన సమయంలో ప్రదర్శనలు జరగకపోవటం విధేయంగా ఉండే అలవాటును తెలియజేస్తున్నది. ప్రస్తుతం మనం ప్రజలలో అవిధేయతను పెంచే అలవాట్లను కూడా చూస్తున్నాం. ఇది మనలను ఎక్కడికి తీసుకుపోతుందో చూద్దాం. ప్రొ. ఐజాజ్ అహ్మద్, మీకు అభినందనలు తెలుపుతున్నాను.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**



epaper.prajasakti.com

# ముసుగు తొలగిన బిజెపి ప్రభుత్వం



రచయిత ప్రముఖ పాత్రికేయులు

**వెంకటేష్ రామకృష్ణన్**

కరోనా మహమ్మారి సమస్య, సరిహద్దు వివాదాలు, దౌత్యపరమైన చిక్కులతో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్ల నుంచి తప్పించుకునేందుకు రెండోసారి ఎన్నికయిన మోడీ ప్రభుత్వం తొలి వార్షికోత్సవం వరకు మతపర మైన అంశాలు, బలప్రయోగంపై కేంద్రీకరించింది.

రెండో దఫా మోడీ ప్రభుత్వ తొలి వార్షికోత్సవం 5 లాక్‌డౌన్‌లు ఒక అన్‌లాక్ సమయంలో వచ్చింది. ఈ లాడౌన్‌లు,అన్‌లాక్ హాస్యాస్పదంగా తయారైనాయని సామాజిక మాధ్యమాల్లో, ప్రత్యేకించి వాట్సప్‌లో విస్తృతంగా ప్రచారంలో ఉన్న సమాచారం స్పష్టం చేస్తున్నది. వివిధ భారతీయ భాషల్లో ప్రచారంలో ఉన్న సమాచారాన్ని స్థూలంగా చూస్తే ఇలా అర్థమవుతోంది. "లాక్‌డౌన్1: మీరు ఈ పని ఆపని చేయకూడదు; లాక్‌డౌన్2: మీరు ఈ పని చేయవచ్చు, కానీ ఆ పని చేయకూడదు; లాక్‌డౌన్3: మీరు ఈ పనిచేయవచ్చు, కానీ ఆ పని చేయరాదు: లాక్‌డౌన్4: మీరు ఈ పని, ఆ పని చేయవచ్చు, కానీ ఈ పని, ఆ పని మాత్రం చేయకూడదు; లాక్‌డౌన్ 5: మేమేమీ చెయ్యటం లేదు కాబట్టి మీరు ఏం కావాలంటే అది చేయవచ్చు."

ఈ నాలుగు లాక్‌డౌన్‌ల గమనాన్ని విశ్లేషిస్తే, కోవిడ్-19 విస్తృతికి సంబంధించి ఆ మహమ్మారిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు రాజకీయ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం బదలాయించిన హక్కులు, అధికారాలు ఎంతమాత్రం మార్గనిర్దేశం చేసే విధంగా లేకపోగా తాత్కాలిక ప్రాతిపదికన ఇవ్వడం అపహాస్యం పాలయ్యాయి. ఐదవ దశ లాక్‌డౌన్ విధింపు, లాక్‌డౌన్ ఎత్తివేత-1 నాటికి మహమ్మారిని ఎదుర్కొనే మొత్తం బరువు బాధ్యతలన్నింటినీ, లాక్‌డౌన్ ఫలితంగా ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కొనడం, వలస కార్మికులను వారి గమ్యస్థానాలకు చేర్చడం వరకు అన్ని పనులను రాష్ట్ర ప్రభుత్వాల నెత్తిన పెట్టింది. విచిత్రంగా లాక్‌డౌన్ తొలిదశల్లో కేంద్రం సూక్ష్మ అంశాల్లో కూడా పలు చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వాలతో నిమిత్తం లేకుండా వ్యవహరించింది. అనంతర కాలంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలకు తగినన్ని నిధులను మంజూరు చేయడంలో కఠినంగా వ్యవహరించడమే కాక సంస్థాపరమైన రుణాలు పొందడానికి కూడా అనేక పరిమితులను విధించింది.

ప్రభుత్వ తొలి వార్షికోత్సవంలో ఈ అంశాలు మాత్రమే ప్రాధాన్యతను సంతరించుకోలేదు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని చేపట్టిన తరువాత బిజెపి తన హిందూత్వ ఎజెండాను అమలుచేయుడం మొదలు పెట్టింది. తమకు మార్గనిర్దేశం చేసే రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ (ఆర్.ఎస్.ఎస్)తో కలిసి మైనారిటీల పీకనులిమేందుకు, అసమ్మతి గళం వినిపించకుండా చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వం కేంద్రీకృత ఆర్థిక విధానాలను అమలు చేస్తూ పేదలు, బడుగు వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోవడం మానేసింది. రక్షణ దళాల పట్ల ప్రభుత్వ వుదాసీనత, దుడుకుతనంతో వారిలో అసంతృప్తి పెరుగుతోంది. సరిహద్దు సమస్యలు, దౌత్య వ్యవహారాల్లో అంతర్జాతీయంగా వ్యవహరించాల్సిన వైఖరికి సంబంధించి తీవ్రమైన సందిగ్ధం నెలకొంది.

**తిరిగొచ్చిన అమిత్ షా**

వ్యక్తిగత ఆరోగ్య సమస్యలతో సుదీర్ఘకాలం మౌనంగా ఉన్న హోంమంత్రి అమిత్ షా వార్షికోత్సవం నాటికి ప్రభుత్వ వ్యవహారాల్లో తనదైన శైలితో తిరిగి రంగ ప్రవేశం చేశాడు. వాస్తవానికి దేశంలో 5వ సారి లాక్‌డౌన్ విధించడానికి, లాక్‌డౌన్ 1 తొలగించటానికి ముందు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించాల్సింది హోం మంత్రే. ఆయన ముందుగా ఆన్‌లైన్ సమావేశం జరిపిన అనంతరం ప్రధాని మోడీ వివరంగా లాక్‌డౌన్ ప్రకటన చేశారు. షా రాకతో మీడియా సమావేశాలు తిరిగి మొదలయ్యాయి. అయితే మహమ్మారి వల్ల, అనంతరం లాక్‌డౌన్ కారణంగా బాధలు పడుతున్న పేద బడుగు వర్గాల ప్రజల పట్ల ఎంతమాత్రం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న జాడ కనిపించడం లేదు.

పెద్దఎత్తున తరలివెళుతున్న వలస కార్మికులపై అమిత్ షా మీడియా సమావేశాల్లో విరుచుకుపడ్డారు. కొంతమంది ఎంతమాత్రం సహనం లేకుండా రోడ్లపైకి వచ్చి నడుకుంటూ వెళుతున్నారని విమర్శించారు. అంతటితో ఆగకుండా ఈ "నడక ప్రవాహం" "ఐదారు రోజుల్లో" కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సానుభూతితో వారి స్వస్థలాలకు తిరిగివెళ్లేందుకు రవాణా సదుపాయంకల్పించడంతో ఆగిపోయిందన్నారు.

లాక్‌డౌన్ విధించిన తరువాత70 రోజుల పాటు వలస కార్మికులు నడకతో పాటు తమకు తోచిన మార్గంలో అందుబాటులో ఉన్న ఎడ్లబండ్లు, సైకిళ్లు, ఆటోరిక్షాలు, సైకిల్ రిక్షాలు, చిన్నవ్యాన్లు, ట్రక్కులు తదితరాలపై ప్రయాణం సాగించిన తరువాత హోం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. వాస్తవాలను ఎంతమాత్రం పట్టించుకోకుండా ఆయన చేసిన వ్యాఖ్యలకు ప్రతిపక్ష పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, కేంద్ర ప్రభుత్వంలోని అధికార వర్గాల నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమైంది.

హోం మంత్రిత్వశాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ తమ మంత్రి వ్యవహరించిన తీరు విచారకరమని అంగీకరించారు. 'అంతకంటే కొన్ని లోటుపాట్ల కారణంగా ఎదురైన ఇబ్బందులకు చింతిస్తున్నామని చెప్పివుంటే బాగుండేదని' ఆ అధికారి అభిప్రాయపడ్డారు.

"మార్చి 25న తొలిసారి లాక్‌డౌన్ విధించారు. దాదాపు నెల రోజుల పాటు వలస కార్మికులకు ఎలాంటి రవాణా సదుపాయం



epaper.prajasakti.com

> "సామాజిక కార్యకర్తలు, విద్యార్థులైన నటాషా నర్వల్, ఢిల్లీలోని ఫెమినిస్టు ఉద్యమానికి చెందిన పింజర టాడ్ ప్రతినిధులు దేవాంగన కలిత, రచయిత, సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖ అరెస్టులు ఈ కోవలోకి వస్తాయి. నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) మే 26న 'విచారణ కొనసాగించే" పేరుతో నవల ఖను ఢిల్లీ నుంచి ముంబాయికి తీసుకెళ్లారు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ మాజీ సంపాద కులకు "మావోయిస్టు లింకులు' ఉన్నాయేమో తెలుసుకునేందుకు తీసుకువెళుతున్నట్టు చెప్పారు."



రైల్వేస్టేషన్‌లో తనతల్లి చనిపోయిపడివున్న విషయం తెలియని చిన్నారి ఆమెను లేపటానికి చేస్తున్న ప్రయత్నం కంటతడిపెట్టిస్తున్నది.

కల్పించలేదు" అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. "కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏప్రిల్ 20 నుంచి బస్ సర్వీసులను ఏర్పాటుచేస్తే మరో పది రోజుల అనంతరం అంటే మే 1 నుంచి రైలు సర్వీసులను నిర్వహిం చేందుకు అంగీకరించారు. అయినప్పటికీ 170 మంది వలస కార్మికులు రోడ్లపై, రైలు పట్టాలపై జరిగిన పలు ప్రమాదాల్లో చనిపోయారు. అన్నింటిలోకి అత్యంత విషాదం కలిగించినది రైల్వేస్టేషన్‌లో చనిపోయిన తల్లిని లేపే ప్రయ త్నం చేస్తున్న బిడ్డ చిత్రం. విపరీతమైన ఎండ వేడి, తిండి, నీరు లేక ఆ తల్లి కన్నుమూసింది. వాస్తవాలన్నీ ఇలా ఉంటే వాటికి అసహ్యకరమైన రంగులు జోడించారని ఆయన పేర్కొన్నాడు.

### క్రూరమైన చట్టాలు

ప్రభుత్వ వార్షికోత్సవం సందర్భంలో కూడా క్రూరమైన చట్టాలను, నియమ నిబంధనలను మరింత కఠినంగా మార్చి మైనారిటీ ప్రజల అసమ్మతిని అణచివేయటానికి, వారి గళాన్ని నొక్కేందుకు శాంతిభద్రతలను పరిరక్షించే ప్రభుత్వ సంస్థలను వినియోగిస్తున్నారు. ఈ కాలంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో పలు రకాల ఆరోపణలు మోపుతూ అనేకమంది సామాజిక కార్యకర్తలను, రచయితలను పోలీ సులు అదుపులోకి తీసుకుంటున్నట్టు నివేదికలు తెలియజేస్తున్నాయి.

సామాజిక కార్యకర్తలు, విద్యార్థులైన నటాషా నర్వల్, ఢిల్లీలోని ఫెమినిస్టు ఉద్యమానికి చెందిన పింజర టాడ్ ప్రతినిధులు దేవాంగన కలిత, రచయిత, సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖ అరెస్టులు ఈ కోవలోకి వస్తాయి. నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) మే 26న "విచారణ కొనసాగించే" పేరుతో నవల ఖను ఢిల్లీ నుంచి ముంబాయికి తీసుకెళ్లారు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ మాజీ సంపాద కులకు "మావోయిస్టు లింకులు" ఉన్నాయేమో తెలుసుకునేందుకు తీసుకువెళుతున్నట్టు చెప్పారు. ఈ నాటకీయ పరిణామం గురించి నవలఖ కుటుంబ సభ్యులకు గాని, ఢిల్లీలోని ఎన్ఐఏ కోర్టుకు కానీ సమాచారం లేదు. ఆరోగ్య కారణాలతో ఢిల్లీ హైకోర్టులో మధ్యంతర బెయిల్ కోరుతూ ఆ రచయిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కూడా మొదలు కాలేదు.

వరుసగా రూపొందించిన ప్రాథమిక సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్‌లు) ఆధారంగా పింజర టాడ్ వ్యవస్థాపకులు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ విద్యార్థులు నటాషా నర్వల్, దేవాంగన కలితలను మే 23న తొలిసారి అరెస్టు చేశారు. వాస్తవానికి అంతకు ముందు వారిపై పెట్టిన కేసుల నుంచి అప్పటికే బెయిల్ పొందారు, అయినా వేరే కేసులు బనాయించి తిరిగి అరెస్టు చేశారు.

అంతర్గతంగా భారత పౌరులపై తప్పుడు కేసులు బనాయించి సాగిస్తున్న దాడులు కొనసాగుతుంటే మరోపక్క సరిహద్దు సమస్యలతో రక్షణ పరమైన సమస్యలు, దౌత్యపరమైన వివాదాలతో ప్రభుత్వ తొలి వార్షికోత్సవం జరుపుతున్నారు. భారత, చైనా బలగాల మధ్య మే నెలలో భారత చైనా సరిహద్దుల్లోని వివిధ ప్రదేశాల్లో మొదలైన వివాదం ఆ నెలంతా కొనసాగింది. చైనా సైనికులు గాల్వాన్ నదీలోయలో "వాస్తవాధీన రేఖ" (ఎల్ఏసి)ని దాటారని నివేదికలు చెబుతున్నాయి. గడిచిన దశాబ్ద కాలంలో చైనా ఇటువంటి చర్యలకు దిగలేదని, ఇటీవల కాలంలో సరిహద్దుల్లోని కొన్ని ప్రాంతాల్లో భారతదేశం చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు స్పందనగానే చైనా ఈ విధంగా వ్యవహరించిందని నిపుణులు చెబుతున్నారు.

మోడీ రెండోసారి ఎన్నికయ్యాక సాగుతున్న పాలనలో విదేశాంగ విధానంలోని లోటు పాట్లను "పొరుగున" మిత్రదేశంగా ఉన్న నేపాల్ ఎత్తిచూపిస్తున్నది. నేపాల్ బాహాటంగా మనల్ని వ్యతిరేకించే స్థాయికి వారితో సంబంధాలు చేరుకున్నాయి. ఇరుదేశాల మధ్య సరిహద్దుగా ఉన్న లిపులేక్ వద్ద నేపాల్ సాయుధ బలగాలను మోహరించింది. నేపాల్ తన భూభాగంగా చెబు తున్న ప్రాంతంలో భారతదేశం రోడ్డు నిర్మాణా నికి ప్రారంభోత్సవం చేయడానికి ప్రతిస్పందనగా నేపాల్ చర్యలున్నాయని భావిస్తున్నారు.

### సాయుధ బలగాల్లో పెరుగుతున్న అసంతృప్తి

ఇటువంటి రక్షణ, దౌత్యపరమైన విషయాల మధ్య దేశ రక్షణ వ్యవహారాలను చూసే కీలకమైన వ్యక్తులు, ప్రత్యేకించి సైన్యంలో ఉన్నవారు ఇటీవల కాలంలో సాయుధ దళాల అధిపతిగా (సిడిఎస్) జనరల్ బిపిన్ రావత్ నియామకం, ఆయన సంస్థాపరంగా తీసుకుంటున్న చర్యల పట్ల అసంతృప్తితో ఉన్నారు. అటువంటి చర్యల్లో భాగంగా సాధారణ పౌరులను సైన్యంలో భాగస్వాముల్ని చేస్తూ మూడేళ్ల పాటు "టూర్ ఆఫ్ డ్యూటీ"గా కొనసాగేందుకు సైనిక ఆస్తులను సాధారణ పౌరులకు అందుబాటులోకి తెచ్చే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నారు.

రాజకీయ ప్రాబల్యానికి లొంగి సిడిఎస్ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని సైన్యంలో పనిచేస్తున్న, రిటైరైన కొన్ని వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. పలు సందర్భాల్లో ఇతర రక్షణ విభాగాల కన్నా తమ సమర్థతను నిరూపించు కున్నప్పటికీ రాజకీయ నాయకత్వానికి లొంగి పోయినందునే సైనిక బలగాలను కోవిడ్ సహాయ కార్యకలాపాల్లో దూరం పెట్టారని వారు భావిస్తున్నారు.

**మోడి బహిరంగ లేఖ**

ఇటువంటి అన్ని రకాల బలహీనతలు, అవాంఛనీయమైన పద్ధతులు ఉన్నప్పటికీ ప్రధాని మోడీ రెండోసారి ఎన్నికయ్యాక జరుగుతున్న తొలి వార్షికోత్సవాన్ని భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వర్ణాక్షరాలతో లిఖించదగినదని పేర్కొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు "బహిరంగ లేఖ" రాస్తూ 2014 నుంచి 2019 వరకు సాగిన ఐదేళ్ల కాలంలో అవినీతితో తడిచి ముద్దయిన భారతదేశాన్ని విముక్తం చేశామని చెప్పుకున్నారు. దానికి తోడు "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" (అందరి కోసం, అందరి అభివృద్ధి) అనే నినాదంతో రెండో దశ పరిపాలనా కాలంలో అన్ని రకాలుగా – సామాజికంగా, ఆర్థికంగా, ప్రపంచస్థాయిలో, – అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.

> **"మోడీ ప్రభుత్వం ప్రధానంగా సాధిం చామని చెప్పుకుంటున్న వాటిలో రాజ్యాంగం లోని 370 అధికరణాన్ని రద్దుచేయడం, సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా అయోధ్యలో రామమందిర నిర్మాణం, "ట్రిపుల్ తలాక్" రద్దు, పౌరసత్వ చట్టంలో తెచ్చిన మార్పులు తది తరాలు. దానికితోడు ప్రధాన మంత్రి, ఆయన బృందం హిందూత్వ నమ్మకాలతో మత విద్వే షాలను రెచ్చగొట్టడం, ప్రభుత్వ బలగాలను వినియోగించి అణచివేయటం చేస్తున్నారు."**



సిఎఎ వ్యతిరేక ఆందోళనలో పాల్గొంటున్న ప్రజలు

విశ్వశాంతి, ప్రగతి ప్రాతిపదికన కాకుండా గత యేడాది కాలంలో ప్రాథమికంగా హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోవటంలో సాధించిన లక్ష్యాలను ఏకరవు పెడుతున్నారు. మోడీ ప్రభుత్వం ప్రధానంగా సాధించామని చెప్పుకుంటున్న వాటిలో రాజ్యాంగం లోని 370 అధికరణాన్ని రద్దుచేయడం, సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా అయోధ్యలో రామమందిర నిర్మాణం, "ట్రిపుల్ తలాక్" రద్దు, పౌరసత్వ చట్టంలో తెచ్చిన మార్పులు తదితరాలు. దానికితోడు ప్రధానమంత్రి, ఆయన బృందం హిందూత్వ నమ్మకాలతో మత విద్వేషాలను రెచ్చగొట్టడం, ప్రభుత్వ బలగాలను వినియోగించి అణచివేయటం చేస్తున్నారు. కరోనా మహమ్మారి, సరిహద్దు సమస్యలు, దౌత్యపరమైన చిక్కులు, రక్షణ దళాల్లో పెరుగుతున్న అసంతృప్తి తదితర సమస్యలను ఎదుర్కొనేందుకు బదులుగా సొంత ఎజెండాతో సాగుతున్నారు. ప్రజల జీవితాలకు పెనుసవాలుగా మారిన మహమ్మారిని ఎదుర్కొనడంలో అస్పష్టమైన విధానాలు, క్రూరబుద్ధితో వ్యవహరిస్తున్నారు.

మోడీ ప్రభుత్వ ఆరేళ్ల పరిపాలనా కాలంలో పనితీరు గురించి, ప్రత్యేకించి రెండోసారి అధికారంలోకి వచ్చాక పరిస్థితి గురించి ఆర్థిక, రాజకీయ వ్యవహారాల విశ్లేషకుడు శేషాద్రి కుమార్ "ప్రత్యేకించి భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాబోయే కాలంలో మరింత తీవ్ర పరిస్థితులు ఏర్పడతాయని " చెప్పారు. "గత ఆరేళ్లుగా మోడీ నిర్వాకంతో మన ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే ఒంటికాలిపై నడుస్తున్నది, ఇప్పుడు కోవిడ్ వైరస్ సమస్యతో పూర్తిగా అస్తవ్యస్తమై పోయింది. ప్రభుత్వం పూర్తిగా ఆర్థిక అజ్ఞానంతో వ్యవహరిస్తున్నది. ఆర్థిక సంక్షోభ పరిస్థితులు తలెత్తినప్పుడు వారికి తెలిసింది, చేస్తున్నది ఒక్కటే. వడ్డీరేట్లు తగ్గించడం. ఆర్థిక వ్యవహారాలలో కొత్తవారు కూడా సమస్య చాలా ప్రాథమికమైనదైతే తప్ప ఆర్థిక వ్యవస్థను చక్కబరిచేందుకు కేవలం వడ్డీరేట్లు తగ్గించడం వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరదని చెబుతారు. వ్యాపారం తక్కువగా ఉండడంతో కంపెనీలు ఎడాపెడా ఉద్యోగులను తొలగించడమే కాక కోవిడ్ సమస్య వల్ల రుణభారాన్ని కూడా ఎదుర్కొంటున్నాయి. కొద్దినెలల కాలంలో లక్షలాది మంది రోడ్లపైకి వస్తారు. దాంతో ప్రభుత్వం తనకు ఇష్టమైన ఎత్తుగడగా వడ్డీరేట్లను తగ్గిస్తుం ది. అవివేకమైన పరిపాలనతో భారత పరిశ్ర మలు చావుదెబ్బ తినే స్థితికి చేరుకుంటాయి" అని ఆయన చెప్పాడు.

కోవిడ్‌పై పోరాటంలో ఎదురౌతున్న కష్టాల నన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటుండగా, కేంద్రం వ్యవహరిస్తున్న తీరు సామాజికంగా, ఆర్థికంగా దేశానికి మరణశాసనం రాసేవిధంగా ఉందని కేరళ ఆర్థికశాఖ మంత్రి థామస్ ఐజాక్ అన్నారు. రాష్ట్రాలకు అవసరమైన నిధులు ఇచ్చేందుకు కూడా కేంద్రం సిద్ధంగా లేకపోయినప్పటికీ కష్టాలను ఎదుర్కొంటూ రాష్ట్రాలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని ఆయన చెప్పారు.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!


**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**



epaper.prajasakti.com

# సింధు నాగరికత - పతనం

**ఎంవిఎస్ శర్మ**



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

క్రీ.పూ. 2,600 ప్రాంతంలో ప్రారంభమైన సింధు నాగరికత మూడు వందల ఏళ్లలో విస్తరించి ఉచ్ఛ దశకు చేరుకుంది. మెసపటోమియా ప్రాంతంలో వ్యాపారం నడిపింది. క్రీ.పూ. 2,000 నుండి సింధు నాగరికత బలహీనపడడం మొదలై క్రీ.పూ. 1,900 నాటికి దాదాపు అంతరించిపోయింది. పశ్చిమ కనుమల ప్రాంతంలో గోదావరి నది ప్రవహించే ప్రాంతంలో మాత్రం (మహారాష్ట్రలోని దైమాబాద్ ప్రాంతం) మరి కొద్ది కాలం అంటే క్రీ.పూ. 1,700 వరకూ సింధు నాగరికత కొనసాగినట్లు ఆధారాలు లభించాయి.

వాయువ్య ప్రాంతం లోని ఆఫ్ఘనిస్తాన్ నుండి కాశ్మీర్ లోయ, బెలూచిస్తాన్, సింధ్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ వరకు సువిశాలమైన ప్రాంతంలో విస్తరించి, తొలినాటి పట్టణాలను నిర్మించి, అంతర్జాతీయ వ్యాపారాన్ని నిర్వహించిన సింధు నాగరికత ఎందుకు అంతరించింది?

వాయువ్య పశ్చిమ ప్రాంతం వైపు నుండి వచ్చి దండయాత్రలు చేసిన ఆర్యుల ధాటికి నిలబడలేక సింధు నాగరికత ధ్వంసం అయిందన్న అభిప్రాయం చరిత్రకారుల్లో ఇటీవల వరకు ప్రముఖంగా ఉండేది. కాని 'చరిత్ర పరిశోధనలో చివరిమాట (ఫైనల్ వర్డ్) ఖరారుగా ఏదీ ఉండదని, మనం గతంలోకి తొంగి చూడగలిగే శక్తి, అన్వేషించడానికి అవసరమైన సామర్థ్యం పెంచుకుని పోతూవుంటే గతానికి సంబంధించి అంతకంతకూ స్పష్టత సంతరించుకోగలుగుతామని ప్రముఖ చరిత్రకారుడు ఇ.హెచ్.కార్ చెప్పిన విషయాన్ని మనం మరిచిపోకూడదు. గతానికి సంబంధించిన కొత్త నిజాలు ఏవి వెలుగులోకి వచ్చినా అవి శాస్త్రీయంగా, సాధికారికంగా చరిత్ర పండితులు ధృవపరిస్తే మనం వాటిని స్వీకరించాల్సిందే. అలాగాక పుక్కిటి పురాణాలను పునాదిగా చేసుకుని గతాన్ని తమకు అనుకూలంగా ఉండేలా మార్చి చరిత్రను బూటకపు ఆధారాలతో తిరగరాయాలని ప్రయత్నించే ప్రబుద్ధులకు గట్టిగా బుద్ధి చెప్పాలి కూడా.

సింధు నాగరికత పతనానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది : వ్యవసాయం. సింధు నాగరికత దశలో వ్యవసాయంలో ఇనుము వాడకం ప్రవేశించలేదు. అది ప్రధానంగా కంచు, రాతి పనిముట్లతోనే జరిగింది. కనుక వ్యవసాయం నదీ ప్రవాహాల వెంబడి ఉన్న భూములలో జరిగింది. మొహంజొదారో వంటి పట్టణాలలో నూతులు, బావులు తవ్విన ఆధారాలు ఉన్నాయి. కాని బావుల మీద ఆధారపడి వ్యవసాయం జరిగిన దాఖలాలు లేవు. కనుక వ్యవసాయం పరిమితమైన ప్రాంతంలో మాత్రమే జరిగేది. ఇనుప నాగలిని వాడి లోతుగా భూమిని పెళ్లగించి చేసే వ్యవసాయం కాదిది. అలాగే బళ్లు లాగడానికి పశువులను వాడిన ఆధారాలు ఉన్నాయి తప్ప వ్యవసాయ పనులకు వాడిన సందర్భాలు లేవు. గొడ్డళ్లు, రంపాలు, కత్తులు వంటి సాధనాలను ఉపయోగించినా అవేవీ నేడు మనం ఉపయోగించే ఇనుప పరికరాల నమూనాల్లో ఉండేవి కావు. ఇప్పుడుకర్ర పిడితో గొడ్డలిని వాడతారు. కాని రాగి/కంచుతో ఆనాడు చేసిన గొడ్డళ్లకు అటువంటి పిడిని దిగ్గొట్టగలిగే రంధ్రం ఉండేలా లేవు. వాటిని ఒకవైపు పదునుగా, ఇంకొకవైపు మందంగా ఉండే దళసరి రేకుల మాదిరిగా పోత పోసేవారు. కర్ర పిడి గొడ్డలి క్రీ.పూ. 1,900-1,700 మధ్య వాడకంలో వచ్చింది.

క్రీ.పూ. 2,000 తర్వాత రెండు పంటల విధానం క్రమంగా అమలు చేయడం ప్రారంభమైన దాఖలాలు వున్నాయి. అంతవరకూ ఒకే పంట పండేది. అదీ పరిమితమైన భూప్రాంతం మీద. ఈ పంట గ్రామాల్లోని ప్రజలను పోషించడానికే గాక పట్టణాల్లోని ప్రజల కడుపులు కూడా నింపాలి. అది జరగాలంటే విస్తృతంగా మిగులు ఉండాలి.

సింధు నాగరికత కాలంలో సమాజంలో వర్గ విభజన ఉండేదన్నది స్పష్టం. ఆనాటి పట్టణాల సముదాయాల నిర్మాణంలోనే ఆ విషయం ఖరారుగా తెలుస్తుంది. అయితే ఆ వర్గ విభజన ఎంత తీవ్రంగా ఉండేది అన్నది ఇక్కడ పరిశీలించాలి. పరిమితమైన ప్రాంతం మీద మాత్రమే ఆధిపత్యం చెలాయించగలిగే పాలకులు ఆనాడు ఉండేవారని వాళ్ల భవనాల సైజుని బట్టి చెప్పవచ్చు. ఫ్యూడల్ కాలం నాటి గుర్తులుగా నిలిచివున్న కోటలతో పోల్చితే (చిన్న చిన్న కోటలతో పోల్చినా సరే) ఏ మాత్రమూ సరితూగని స్థాయిలో ఆ భవనాలు ఉండేవి. దీనినిబట్టి వ్యవసాయ ఉత్పత్తిలో మిగులును పరిమితంగానే పాలకులు సేకరించగలిగేవారు. ఈ మిగులుతో పట్టణాల లోని ప్రజలను పోషించగలిగే శక్తి కూడా పరిమితంగానే ఉంటుంది. దీనికితోడు వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల పంటలు గనుక దెబ్బతింటే ఆ పట్టణ ప్రజలను పోషించగలిగే శక్తీ దెబ్బ తింటుంది. ఇది సింధు నాగరికత అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి పెద్ద అవరోధం అయింది. పనిముట్ల పరిమిత సామర్థ్యం, పరిమితంగానే వ్యవసాయంలో మిగులును సేకరించగలగడం, వాతావరణంలో అడపాదడపా సంభవించే ప్రతికూలతలు-ఇవి సింధు నాగరికతకు ప్రధాన సవాలు అయ్యాయి.

అందుచేత క్రీ.పూ. 2,000 నుంచీ రెండో పంట పండించే ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. ఒకే భూమి మీద రెండు పంటలు పండించడం ఎరువుల వాడకం ఏమీ లేని ఆకాలంలో సాధ్యం కాదు. రెండో పంటకు దిగుబడి రాదు. కనుక రెండో పంట పండించేందుకు కొత్త భూములు కావాలి. కొత్త భూముల కోసం గ్రామ ఆవాసాలు అన్వేషిస్తూ కొత్త కొత్త ప్రాంతాలకు చెదిరిపోవడం మొదలైంది. ఒక పంట పాత ప్రాంతంలో పండిస్తూ, అది పూర్తయిన తర్వాత రెండో పంట కోసం మరో భూభాగానికి రైతులు వెళ్లేవారు. క్రమంగా ఇది



epaper.prajasakti.com

జనావాసాలు చెదిరిపోయి విస్తరించడానికి దారితీసింది. ఈ క్రమంలో అంతకుముందున్న పాలనా వ్యవస్థ కూడా చెదిరిపోయింది. పట్టణాలు బలహీన పడసాగాయి.

**రెండవది వాణిజ్యం :** పట్టణాల్లో చేతి వృత్తుల ద్వారా తయారైన కొన్ని రకాల పరికరాలు (చెకుముకి రాళ్లతో చేసిన పనిముట్లు వంటివి), రంగు రాళ్లతో చేసిన ఆభరణాలు, పింగాణీ వస్తువులు, శంఖాలతో, గవ్వలతో చేసిన అలంకార వస్తువులు-ఇవే ప్రధానంగా వ్యాపార సరుకులు. ఇటువంటివి తయారు చేయడానికి అవసరమైన ముడి సరుకు లభ్యత తగ్గిపోతున్నకొద్దీ ఆ వ్యాపారం సన్నగిల్లసాగింది. దానిమీదే ఆధారపడిన వారు సైతం బతుకుతెరువుకు ఇతర ప్రాంతాలకు తరలిపోవాల్సి వచ్చింది. వాణిజ్యం బలహీనపడడం కూడా సింధు నాగరికత పతనానికి దోహదపడింది.

అటు పట్టణాల ప్రజలను పోషించగలిగేంత వ్యవసాయ ఉత్పత్తీ లేక, ఇటు చేతి వృత్తులూ బలహీనపడి సింధు నాగరికత లోని పట్టణాలు క్రమంగా క్షీణదశకు చేరుకున్నాయి.

ఈ పరిస్థితుల్లోనే కొత్త మార్పులకు కూడా తెరలేచింది. అందులో మొదటిది మానవ నాగరికత తూర్పు వైపుగా ఉత్తరప్రదేశ్ వరకూ, దక్షిణాన మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వరకూ, ఆ తర్వాత దక్షిణ భారతదేశానికీ విస్తరించింది. క్రీ.పూ. 2,000-1,500 సంవత్సరాల మధ్యఈ మార్పులు జరిగాయి. దీనినే రాగి, లేదా కంచు యుగం అని అనవచ్చు. ఈ కాలంలోనే రెండు పంటలు పండించే విధానమూ విస్తృతంగా వ్యాపించింది. అయితే ఈ దశలో విస్తరించిన అన్ని ప్రాంతాలలోనూ గ్రామాలే తప్ప సింధు నాగరికతలో మాదిరిగా పట్టణాలు లేవు.

ఈ దశలోనే పశ్చిమ-వాయువ్య ప్రాంతం నుండి కొత్తగా మానవ సమూహాలు వలసలు వచ్చారు. సింధు ప్రాంతంలో అంతవరకూ మచ్చిక చేయని జంతువులను ఈ వలస వచ్చిన జాతుల వారు మచ్చిక చేయగలిగారు. వాటిలో ప్రధానమైనవి మూడు. ఒంటెలు, గుర్రాలు, గాడిదలు. ఇవి కేవలం బరువులు మోయగలగడమే గాక, వాటికి కట్టిన రథాలపై ఎక్కి ఎదుటివారి మీద దాడి చేయడానికి పనికి వచ్చే కొత్త యుద్ధ విన్యాసాలకు తోడ్పడ్డాయి. యుద్ధాల్లో నైపుణ్యం కలిగిన కొత్త తెగలు ఆ విధంగా సింధు-గంగా మైదానంలోకి ప్రవేశించాయి. ఈ తెగలనే ఇండో-ఆర్యన్ తెగలు అంటారు. ఈ తెగలు తమతోబాటు కొత్త సంస్కృతిని, కొత్త భాషను కూడా తమ వెంట తెచ్చారు. వీరి

**"నిజానికి సింధు నాగరికత తవ్వకాలలో ఆనాటి ప్రజలు వేరే భాషను ఉపయోగించారని ఆధారాలు లభించాయి. ఈ విషయాన్ని ఇంతకు ముందు వ్యాసాల్లో చెప్పకున్నాం. ఈ భాషకు సంబంధించిన లక్షణం, దీని లిపిలో సంకేతాలను బట్టి, ఉచ్ఛారణను బట్టి రెండు రకాలూ కలగలిపి ఉంటాయి. ఉదాహరణకు చేప అన్న అర్థం ఆ రెండక్షరాలూ రాస్తే మనకు తెలుస్తుంది. దానికి బదులు చేప గుర్తు వేసినా తెలుస్తుం ది. సూర్యుడు, పడవ వంటివి కూడా గుర్తుల ద్వారా తెలియజేయవచ్చు."**



హరప్పా ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రం

భాషలు ఎక్కువగా మెసపటేమియా ప్రాంతపు భాషలను పోలి వుండేవి.

సింధు నాగరికత పతనం, దానితోబాటు కొత్తగా విస్తరించిన రాగి-కంచు నాగరికత, ఈ కాంలోనే ఇండో ఆర్యన్ తెగల ప్రవేశం-ఇది క్రీ.పూ. 2,000-1,800 మధ్య మొదలైంది.

ఇక్కడే కొన్ని విషయాలను ప్రస్తావించాలి. 'హిందుత్వ'వాదులు ఈ సువిశాల భారతదేశం అటు ఆఫ్ఘనిస్తాన్ నుండి ఇటు బర్మా వరకు అంతా 'అఖండ భారత్' అని, 'ఆర్యావర్తం' అని అంటారు. ఆర్యులు మొదటి నుంచీ ఇక్కడ ఉంటున్న వారే అని చెప్తారు. కాని ఈ వాదన అబద్ధం అని సింధు నాగరికత మనకు రుజువు చేస్తుంది. ఇండో-ఆర్యన్ తెగల ప్రజలు, లేదా ఆర్యులు పశ్చిమ-వాయువ్య ప్రాంతం నుండి ప్రవేశించారు. అదీ సింధు నాగరికత ఒక పక్క ఉన్న చోట శిథిలమౌతూ, మరోపక్క ఇతర భారత ఉపఖండంలోకి రాగి-కంచు నాగరికత రూపంలో రూపాంతరం చెందుతూ ఉన్న సమయంలో వచ్చారు. కనుక భారతదేశమే ఆర్యుల పుట్టినిల్లు అన్న వాదన తప్పు, నిరాధారం.

రెండవది. సంస్కృతం మూల భాష, దాని నుండే అన్ని భాషలూ పుట్టుకొచ్చాయని 'హిందూత్వ'వాదులు ప్రచారం చేస్తున్నారు. ఆ పేరుతో దేశంలో వివిధ భాషల ప్రజలపై బలవంతంగా సంస్కృతాన్ని రుద్దాలని ప్రయత్నిస్తున్నారు.

నిజానికి సింధు నాగరికత తవ్వకాలలో ఆనాటి ప్రజలు వేరే భాషను ఉపయోగించారని ఆధారాలు లభించాయి. ఈ విషయాన్ని ఇంతకు ముందు వ్యాసాల్లో చెప్పుకున్నాం. ఈ భాషకు సంబంధించిన లక్షణం, దీని లిపిలో సంకేతాలను బట్టి, ఉచ్ఛారణను బట్టి రెండు రకాలూ కలగలిపి ఉంటాయి. ఉదాహరణకు చేప అన్న అర్థం ఆ రెండక్షరాలూ రాస్తే మనకు తెలుస్తుంది. దానికి బదులు చేప గుర్తు వేసినా తెలుస్తుంది. సూర్యుడు, పడవ వంటివి కూడా గుర్తుల ద్వారా తెలియజేయవచ్చు. వీటికి కాలక్రమేణా కొన్ని ఇతర సంకేతాలు (ఇంటూ మార్కు, ఆశ్చర్యార్థకం, ప్రశ్నార్థకం వంటివి ) తోడు చేశారు. ఈ రెండు రకాలు (బొమ్మలు, సంకేతాలు) కలగలిపిన భాషలు నేటికీ ప్రపంచంలో ఉ

(మిగతా 35వ పేజీలో)




epaper.prajasakti.com

మతోన్మాదం

# సిఎఎ వ్యతిరేక ఉద్యమకారులపై కుట్ర కేసులు

**అపూర్వానంద్**



రచయిత ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్

ఫిబ్రవరి చివరిలో ఢిల్లీ ఈశాన్య ప్రాంతంలో జరిగిన హింసాకాండ వెనుక కుట్ర ఉన్నదన్న కట్టుకథలను ఢిల్లీ పోలీసులు సృష్టించి, వాటిని మనచేత నమ్మింపచేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలలో పాల్గొన్నవారిని ఈ కుట్రకేసులలో ఇరికించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నారు. వీరిలో చాలామందిని ఇప్పటికే అరెస్టు చేసి జైళ్ళలో పెట్టామని, ఇంకొంత మందిని అరెస్టు చేయబోతున్నామని పోలీసులు చెబుతున్నారు. యువకులు, విద్యార్థులను, వీరిలో ఎక్కువ మంది మహిళలు, ముస్లింలను జైళ్ళలో పెడుతున్నారు. ఘర్షణలలో పాల్గొనటం, హత్యా ప్రయత్నం, హత్య చేయటం తదితర తీవ్రమైన ఆరోపణలతో కూడిన కేసులను వారిపైన పెడుతున్నారు. అత్యంత క్రూరమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టాన్ని-యుఎపిఎ-వారిపై ప్రయోగిస్తున్నారు. కుట్ర పన్నిన వారే ఈశాన్య ఢిల్లీలో హింసాకాండను రెచ్చగొట్టారనే కథనాన్ని పరిశోధనా సంస్థలు ప్రచారంలో పెడుతున్నాయి. ఈ కుట్రను కప్పిపెట్టుకోవటానికే పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారని చెబుతున్నారు.

ఈ కథనానికి కావలసిన ప్రణాళిక అంతటిని వారి రాజకీయ నాయకులు పోలీసులకు అందజేశారు. దీనిలో "విభజనకు వ్యతిరేకంగా ఐక్యం కండి"-యునైటెడ్ ఎగైనెస్ట్ హేట్-లాంటి సంస్థలు, ఉమర్ ఖలీద్ లాంటి వ్యక్తులు వున్నారని, హింసాకాండను రెచ్చగొట్టటానికి వారే బాధ్యులని పాలకపార్టీ ఎంపిలు పార్లమెంటులో ప్రకటన చేశారు. హర్షమందర్ వీడియో వుపన్యాసంలోని కొన్ని భాగాలను తీసుకొని, ఆయన హింసాకాండను రెచ్చగొట్టాడని ఆరోపణలు చేశారు. ఈ అంశంపై పరిశోధన చేస్తున్న సంస్థలు కుట్ర సిద్ధాంతాన్ని ఒక కథగా రూపొందించి, తమ కథనంలోని పాత్రలకు అవసరమైన వారిని తామే ఎంపిక చేసుకొని, తమ కథనమే వాస్తవమని కోర్టులను, ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో కూడా ఒక సెషన్స్ కోర్టు ఈ కుట్రను పసిగట్టి, విచారణ ఒకవైపు నుండే జరుగుతున్నదని పోలీసులను మందలించింది.

కేసు పరిశోధనలో ప్రచారం చేస్తున్న కుట్ర సిద్ధాంతం భీమా కొరెగావ్ హింసాకాండపై విచారణ జరిగిన తీరును గుర్తుకు తెస్తున్నది. వాస్తవంగా జరిగిన హింసాకాండను ప్రజలు పూర్తిగా మర్చిపోయే విధంగా ఆ కార్యక్రమంలో పాల్గొన్న దళితులపై విచారణ కొనసాగించారు. హింసాకాండకు కారణమైన నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. మరోవైపున ఈ సంఘటనతో ఏ మాత్రం సంబంధంలేని మానవహక్కుల కార్యకర్తలు, సామాజిక, రాజకీయ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ సంస్థలకు సంబంధించిన వారు రూపొందించిన కుట్ర వలననే హింసాకాండ జరిగిందని కేసును పరిశోధిస్తున్న సంస్థ ప్రచారం చేస్తున్నది. ఈ విధంగా మొత్తం ఈ సంఘటనను పూర్తిగా తల్లకిందులుగా చూయిస్తున్నారు. వాస్తవంగా జరిగిన హింసాకాండను మరిచిపోయే విధంగా, కుట్ర సిద్ధాంతం-ప్రధానమంత్రిని కూడా హత్య చేయటం కోసం రూపొందించిన కుట్రలో మేధావులు కూడా వున్నారని- మాత్రమే ప్రజల మనసులలో ఉండే విధంగా ప్రచారం చేస్తున్నది. తాను చేస్తున్నది ఏమిటో పరిశోధన చేస్తున్న సంస్థకు పూర్తిగా తెలుసు.

ఇదే విధమైన పద్ధతిని ఢిల్లీ హింసాకాండ కేసు విచారణలో కూడా అమలు చేస్తున్నారు. ఫిబ్రవరిలో జరిగిన హింసాకాండలో సుమారుగా 60 మంది హత్యకు గురయ్యారు. అనేక మంది గాయపడ్డారు. చాలా ఇళ్ళు, వాణిజ్య సంస్థలపై దాడులు చేసి కూల్చివేశారు. అనేక షాపులను నాశనం చేశారు. కొన్నింటిని తగులబెట్టారు. అనేక మసీదులను తీవ్రంగా నష్టపరిచారు. అపవిత్రం చేశారు. హిందువులు కూడా బాధలకు గురైనప్పటికీ ఈ హింసాకాండ ప్రత్యేకంగా ముస్లింలకు వ్యతిరేకంగా వుద్దేశించబడింది. మీరన్ హైదర్, దేబాంగన కలిత, నటాషా నర్వాల్, సఫూర జర్గర్, అసిఫ్ తన్హాలకు ఢిల్లీ హింసాకాండతో సంబంధం ఉందని పేర్కొన్నారు. ఒక్క దేవాలయానికి కూడా నష్టం వాటిల్లలేదని, మసీదులను మాత్రమే లక్ష్యం గా పెట్టుకున్నారని దేశంలోని, అంతర్జాతీయ పరిశీలకులు, విలేకరులు పేర్కొన్నారు. ముస్లింలకు చిహ్నంగా ఉండే మసీదులు, ఖురాన్ కాపీలను దగ్ధం చేయటం ముస్లింగా జీవించటంపై దాడిగా ఒక మిత్రుడు పేర్కొన్నాడు. మొదటి దశలో దాడులు, ప్రతిదాడులలో హిందువులు, ముస్లింలు ఉభయులూ బాధలు పడినప్పటికీ త్వరలోనే పూర్తిగా ముస్లింలకు వ్యతిరేకంగా, వారి జీవితాలు, జీవనాధారాలు, ఆస్తులు, అస్థిత్వం లక్ష్యాలుగా దాడులు జరిగాయి.

అనేక సంఘటనలలో ముస్లింలకు వ్యతిరేకంగా పోలీసులు పాక్షిక దృక్పథంతో వ్యవహరించిన ఘటనలు కూడా వెల్లడైనాయి. గాయపడిన ముస్లింలకు వైద్యం నిరాకరించారు. చాలా సందర్భాలలో ఉద్దేశ్యపూర్వకంగానే వారికి వైద్య సహాయం అందకుండా చేశారు. ఢిల్లీ హైకోర్టు అర్ధరాత్రి జోక్యం చేసుకొని ఆదేశాలు జారీ చేసిన తర్వాత మాత్రమే హింసాకాండ జరుగుతున్న ప్రాంతం నుండి గాయపడిన వారిని తీసుకొని అంబులెన్స్‌లు వెళ్ళటానికి పోలీసులు అనుమతించారు. విస్తృత ప్రచారం పొందిన షహీన్ బాగ్ ముస్లిం మహిళల ప్రతిఘటనతో ఉత్తేజం పొంది ఏర్పడిన అనేక నిరసన కేంద్రాలపై దాడులు చేసి, వాటిని నిర్మూలించటం ఈ హింసాకాండలో కనిపించిన మరో అంశం. ఈ నిరసనలలో ఆజాదీ కావాలన్న నినాదం బాగా ప్రచారం పొందింది. "మీరు ఆజాది కావాలన్నారు, దానిని మీకు ఇస్తున్నాం" అని ముస్లింలు, ముస్లిం మహిళలపై దాడులుచేసి కొడుతున్నపుడు పోలీసులు వారికి చెప్పారు. తాము కొడుతున్న యువకులకు ఈ మాటలు చెప్పేటపుడు కొందరు


epaper.prajasakti.com

పోలీసులు వీటిని సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీశారు. ఇవన్నీ ప్రజలకు చేరాయి. వీటిని ప్రజలు అర్థం చేసుకున్నారు.

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నవారిపై భౌతికదాడులకు దిగటానికి ముందు వారిపై రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం ద్వారా దాడులకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించారు. వారు ధరిస్తున్న దుస్తులను బట్టి నిరసనలు చేస్తున్నవారిని ప్రజలు గుర్తించాలని ప్రధాని చెప్పాడు. ఈ నిరసలు ఒక నమూనా మాత్రమేనని వాటిపై ప్రజలకు దురభిప్రాయం కల్పిస్తూ, షహీన్‌బాగ్ నిరసనకారులకు తీవ్రమైన షాక్ ఇవ్వాలని ఢిల్లీ ప్రజలను ప్రధాని రెచ్చగొట్టాడు. విద్రోహులను కాల్చిపారేయాలని ఒక కేంద్రమంత్రి తన అనుచరులను ప్రోత్సహించాడు. టెర్రరిస్టులు, రేప్‌లు చేసేవారు సిఎఎ ముసుగులో దాగున్నారని పాలకపార్టీకి చెందిన ఒక సీనియర్ ఎంపి హిందువులను రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేశాడు.

కొత్తగా తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న వారికి వ్యతిరేకంగా హింసాకాండను రెచ్చగొట్టటానికి మానసికంగా ప్రజలను సన్నద్ధం చేశారు. నిరసనలు తెలియజేస్తున్నవారు ముస్లింలు కావటంతో రెచ్చగొట్టే వారిపని తేలికైంది. వ్యక్తిగతంగా మంచివారైనప్పటికీ ముస్లింలు సమూహంగా ఉండటం ప్రమాదకరమని హిందుత్వ సంస్థలు అనేక సంవత్సరాల నుండి సాధారణ హిందువుల మధ్య ప్రచారం చేస్తున్నాయి. ప్రజల సాధారణ జీవనానికి ఏ మాత్రం ఆటంకం లేకుండా ఢిల్లీలో 20 ప్రాంతాలలో రెండు మాసాల పాటు వందలు, వేలాదిమంది మహిళలతో జరిగిన నిరసనలు ప్రజలను ఆశ్చర్యంలో ముంచెత్తాయి. స్వతంత్ర భారతదేశంలో మొదటిసారిగా రాజ్యాంగ పీఠిక ప్రజల ప్రతిఘటనకు చిహ్నంగా నిలిచింది. మొదటిసారి మూడురంగుల జాతీయ జెండా నిరసనలకు చిహ్నంగా నిలిచింది. ప్రజలలో ఉన్న సామాజిక భావాలను నిరసనకారులు శక్తివంతంగా వ్యక్తం చేశారు. వారిలో కొంత గందరగోళం, ప్రణాళికా రాహిత్యం ఉన్నప్పటికీ ఉత్సాహంగా కార్యక్రమాన్ని కొనసాగించారు. ముస్లిం యువతులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించటం దీనికి ప్రత్యేకతను తీసుకువచ్చింది. ఎక్కువమంది ముస్లింలే పాల్గొన్నప్పటికీ ఇతరులు తమ ఆందోళనను అర్థం చేసుకొని, ఉద్యమంలో పాల్గొనాలని వారు కోరారు.

> **“ పార్లమెంటు ఆమోదించిన అంశా లపై ఆందోళన చేసే హక్కు ప్రజలకు లేదనే అవగాహనను ప్రచారంలో పెట్టటానికి ప్రయత్నం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నీవు ఆందోళన చేస్తున్నట్లైతే ఆ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజలను వ్యతిరేకిస్తున్నట్లేననే వాదన చేశారు. ప్రజల అభిప్రాయాలకు తాను మాత్రమే ప్రతినిధినని ప్రభుత్వం వాదించింది. ఇటువంటి పరిస్థితులలో షహీన్‌బాగ్ ఉద్యమం వచ్చింది. ”**



సిఎఎ వ్యతిరేక ఆందోళనలలో పాల్గొంటున్న ప్రజలపై హింసాకాండకు పాల్పడుతున్న పోలీసులు

ఈ నిరసన కార్యక్రమాలు జరుగుతుండగానే వాటిని హిందు వ్యతిరేకమైనవిగా, భారతదేశానికి వ్యతిరేకమైనవిగా ప్రచారం చేయటం ప్రారంభమైంది. పక్కనున్న ముస్లిం దేశాలలో వేధింపులకు గురవుతున్న హిందువులకు పౌరసత్వం ఇవ్వటాన్ని ముస్లింలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ఆందోళనలను వ్యతిరేకిస్తున్న వారు ప్రశ్నించడం ప్రారంభించారు. సిఎఎ వ్యతిరేక ఆందోళనలను ఇది పూర్తిగా వక్రీకరించటమే. కాని మీడియాలోని ఒక తరగతి దీనిని నిరంతరం ప్రచారంలో పెట్టింది. సిఎఎను చట్టంగా చేయటాన్ని ప్రతిపక్ష పార్టీలు నిరోధించలేకపోయాయి. ఈ విషయంలో పార్లమెంటు విఫలం కావటంతో ప్రజలు కదిలారు. వారిని యుపి, ఢిల్లీ పోలీసులు వెంటనే కట్టడి చేశారు. యుపిలో సుమారుగా 20 మంది ప్రజలు చనిపోయారు. ఈ మరణాలకు పోలీసులు బాధ్యత తీసుకోలేదు. నిరసనకారుల మరణాలకు వారే కారకులని పోలీసులు ప్రచారం చేశారు. ఆలీఘర్ ముస్లిం యూనివర్సిటి, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలలో నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు అత్యంత క్రూరంగా వ్యవహరించారు.

రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న హింసాకాండను నిరోధించటానికి జోక్యం చేసుకోవాలనే అభిప్రాయం తమకులేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే నిరసనకారులు రోడ్లపై నుండి వైదొలగితేనే వారి వినతులను విచారిస్తానని సుప్రీంకోర్టు ప్రకటించటం. దీనితో నిరసనలు చట్ట వ్యతిరేకమైనవని తక్షణమే ప్రభుత్వం ప్రకటించింది. పార్లమెంటు ఆమోదించిన అంశా లపై ఆందోళన చేసే హక్కు ప్రజలకు లేదనే అవగాహనను ప్రచారంలో పెట్టటానికి ప్రయత్నం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నీవు ఆందోళన చేస్తున్నట్లైతే ఆ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజలను వ్యతిరేకిస్తున్నట్లేననే వాదన చేశారు. ప్రజల అభిప్రాయాలకు తాను మాత్రమే ప్రతినిధినని ప్రభుత్వం వాదించింది. ఇటువంటి పరిస్థితులలో షహీన్‌బాగ్ ఉద్యమం వచ్చింది. ముస్లిం మహిళలు రోడ్డులో కొంతభాగాన్ని ఆక్రమించుకొని ధర్నా కార్యక్రమం ప్రారంభించారు. ఇది స్వచ్ఛందంగా జరిగింది. దీనికి మహిళలే నాయకత్వం వహించారు. యువ ముస్లిం మహిళలు దీనిని జయప్రదంగా నిర్వహించటానికి కావలసిన కృషి చేశారు. స్టేజీ నిర్వహణ బాధ్యతలను వారే చూశారు. అతిత్వరలోనే నిరసనలకు షహీన్‌బాగ్ ఒక నమూనాగా మారిపోయింది. ఢిల్లీలోని ఇతర ప్రాంతాలకు, మొత్తం దేశవ్యాపితంగా, గ్రామాలు, పేటలకు కూడా విస్తరించింది. ఈ ఉద్యమంతో ఏ విధంగా



epaper.prajasakti.com

**"నిరసనకారులపై హింసాకాండను ప్రారంభించాలన్న ప్రచారాన్ని కూడా నెమ్మదిగా ప్రారంభించారు. "మోడిజీ, లాఠి ఝుళిపించండి, మేం మీతోనే ఉన్నాం" అనే కొత్త నినాదాన్ని ముందుకుతెచ్చారు. "ఢిల్లీ పోలీసులూ, లాఠీలు ఝుళిపించండి, మేం మీతోనే ఉన్నాం" అనే నినాదాన్ని తర్వాత ముందుకు తీసుకొచ్చారు. ముస్లిం నిరసనకారులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బలమైన ప్రభుత్వశక్తితో అరాచక బజారు మూకలు కలిసిపోయాయి."**



షహీన్‌బాగ్ ఆందోళనలలో పాల్గొన్న మహిళలు

వ్యవహరించాలో ప్రభుత్వానికి అర్థంకాక పోవటంతో కుట్ర సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చింది. ప్రమాదకరమైన ముస్లిం వ్యక్తులు మహిళలను ముసుగుగా వినియోగించు కొంటున్నారని ప్రచారం ప్రారంభించింది. వారి వెనుక మావోయిస్టులు, మార్క్సిస్టులు, ప్రభుత్వం సృష్టించిన "అర్బన్ నక్సల్" గ్రూపులున్నాయని ప్రచారం చేసింది. ఢిల్లీ ఎన్నికల ప్రచారంతో ఈ గుసగుసల ప్రచారానికి ఒక అవకాశం దొరికింది. ఎన్నికల ప్రచారం పేరుతో బహిరంగంగానే ఈ తప్పుడు ప్రచారాన్ని కొనసాగించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను లొంగదీసుకోవటం కోసం ఈ ఆందోళనల వెనుక ఆయన ఉన్నాడని బిజెపి ప్రచారం చేసింది. షహీన్‌బాగ్ ఉద్యమం నుండి తాను దూరంగా ఉన్నట్లు చూపుకొంటూ నిరసనలు కొనసాగటానికి కేంద్ర ప్రభుత్వమే అవకాశం ఇచ్చిందని కేజ్రీవాల్ పేర్కొన్నాడు. ఢిల్లీ పోలీసులు తమ ప్రభుత్వ పరిధిలో ఉంటే రెండురోజుల్లో షహీన్‌బాగ్ ఆందోళనాకారులను అక్కడి నుండి తొలగించేవాడినని చెప్పాడు. బహుశా తాము షహీన్‌బాగ్ ఆందోళనకారుల తరపున ఉంటే హిందువులకు దూరమౌతామనే భావంతోనే ప్రధాన ప్రవంతి రాజకీయ పార్టీలు నిశ్శబ్దంగా ఉండాలని నిర్ణయించుకొన్నట్లున్నాయి. షహీన్‌బాగ్ ఆందోళనకారులను ఒంటరి చేయటానికి ఇవన్నీ బిజెపికి తోడ్పడ్డాయి.

అంతమాత్రాన ఉద్యమానికి సంఘీభావం లభించలేదని కాదు. మహిళల హక్కులు, దళితులు, మానవహక్కుల కోసం ఆందోళన చేస్తున్న అనేక సంస్థలు ఈ నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నాయి. వారి భాగస్వామ్యాన్ని చూయించి అర్బన్ నక్సల్స్, జిహాది ముస్లింలతో ఏర్పడిన అపవిత్ర కూటమి ఇదని తిరిగి దుష్ప్రచారం చేశారు. నిరసనకారులపై హింసాకాండను ప్రారంభించాలన్న ప్రచారాన్ని కూడా నెమ్మదిగా ప్రారంభించారు. "మోడిజీ, లాఠి ఝుళిపించండి, మేం మీతోనే ఉన్నాం" అనే కొత్త నినాదాన్ని ముందుకుతెచ్చారు. "ఢిల్లీ పోలీసులూ, లాఠీలు ఝుళిపించండి, మేం మీతోనే ఉన్నాం" అనే నినాదాన్ని తర్వాత ముందుకు తీసుకొచ్చారు. ముస్లిం నిరసనకారులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బలమైన ప్రభుత్వశక్తితో అరాచక బజారు మూకలు కలిసిపోయాయి.

ఈ పూర్వరంగంలో ఈశాన్య ఢిల్లీలో హింసాకాండ ప్రారంభమైంది. ఈ హింసాకాండపై సరైన దర్యాప్తు జరిపించాలి. సిఎఎ వ్యతిరేక ఆందోళనకారులపై ఆందోళనలను వ్యతిరేకిస్తున్నవారు ఉద్దేశ్యపూర్వకంగా ప్రారంభించిన హింసాకాండకు, ఆతర్వాత జరిగిన హింసాకాండకు మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవాలి. కాని ఈ ఘటనలపై పరిశోధన చేస్తున్న సంస్థ ఇందుకు వ్యతిరేక దిశలో విచారణ కొనసాగిస్తున్నది. పోలీసులు తయారు చేసిన నాటకంలో పాత్రధారులుగా మార్చటం కోసం విద్యార్థులు, యువకులను, అత్యధికంగా మహిళలను అరెస్టు చేస్తున్నారు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**


epaper.prajasakti.com

ఈ మాసం ప్రత్యేకం

# వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తున్న మోడి

ఎ కోటిరెడ్డి



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

కోవిడ్ 19 మహమ్మారిని ఎదుర్కోవటం కోసం అంటూ మోడి ప్రకటించిన ప్యాకేజీలో భాగంగా వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు అప్పగించటం కోసం మూడు ఆర్డినెన్స్‌లను జారీ చేయటానికి జూన్ 3వ తేదీన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. లాక్‌డౌన్ ప్రకటించినప్పటికీ రోజురోజుకూ విజృంభిస్తున్న కోవిడ్ 19 మహమ్మారితో దేశప్రజలు భయాందోళనలకు గురవుతున్న సమయంలో ప్రజలకు అత్యవసరమైన ఆర్థిక, వైద్య సదుపాయాలను అందించాల్సిన ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కలిగించే ఆర్డినెన్స్‌లు జారీ చేయటం అత్యంత దారుణం. వ్యవసాయ రంగంలో సంస్కరణలను అమలు చేయటం ద్వారా వ్యవసాయోత్పత్తులను, రైతుల ఆదాయాలను పెంచటం పేరుతో మోడి ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌లను జారీ చేసింది. నిత్యావసరాలను నిల్వచేయటంపై ప్రస్తుతం ఉన్న ఆంక్షలను తొలగించటం కోసం నిత్యావసర సరుకుల చట్టానికి సవరణలు చేస్తూ మొదటి ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటి(ఎపిఎంసి)ల గుత్తాధిపత్యాన్ని అంతం చేయటం, వ్యవసాయోత్పత్తులను అమ్మటం, కొనటానికి ఎవరికైనా అవకాశం కల్పించటం కోసం ది ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ (ప్రమోషన్ అండ్ ఫెసిలిటీస్)- ఎఫ్‌పిటిసి- ఆర్డినెన్స్‌ను జారీచేసింది. బడా కార్పొరేట్ సంస్థలు, కంపెనీలకు ప్రయోజనం కలిగించే విధంగా కాంట్రాక్టు వ్యవసాయాన్ని చట్టబద్ధం చేయటం కోసం ది ఫార్మర్స్ (ఎంపవర్‌మెంట్ అండ్ ప్రొటెక్షన్) ఆన్ ప్రైస్ అస్యూరెన్స్ అండ్ ఫార్మ్ సర్వీస్ ఆర్డినెన్స్ 2020- ఎఫ్ఎపిఎఎఫ్ఎస్-ను జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఈ మూడు ఆర్డినెన్స్‌లు మన వ్యవసాయ రంగంపై వినాశకరమైన ప్రభావం చూపుతాయి. రైతాంగాన్ని కార్పొరేట్, బహుళజాతి కంపెనీల చేతుల్లో కీలుబొమ్మలుగా చేస్తాయి. వారి భూములలో పండించే పంటలు, ఆదాయాలపై కార్పొరేట్ సంస్థలు ఆధిపత్యం చెలాయిస్తాయి. కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం నెలకొనటంతో గ్రామీణప్రాంతంలోని సామాజిక జీవితంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇప్పటికే ఎక్కువగా ఉన్న అసమానతలు మరింత తీవ్రం అవుతాయి. ఒకవైపున దేశంలో కోవిడ్ 19 మహమ్మారి విలయతాండవం చేస్తున్నది. వైరస్ విస్తరణను అరికట్టి, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించటం కోసం లాక్‌డౌన్ విధించామని చెబుతూ అన్ని ఆర్థిక, సామాజిక కార్యకలాపాలను ప్రభుత్వం స్థంభింపచేసింది. లాక్‌డౌన్ విధించటంతో తన బాధ్యత పూర్తయినట్లుగా ప్రభుత్వం భావించింది. ప్రజారోగ్యాన్ని పరిరక్షించటం, లాక్‌డౌన్ వలన ఉపాధికోల్పోయిన కోట్లాది మంది కార్మికులు, వలస కార్మికులకు ఆహార ధాన్యాలను, ఆర్థిక సహాయాన్ని అందించటం, వారు తమ స్వగ్రామాలకు చేరటానికి అవసరమైన ప్రయాణ సదుపాయాలను కల్పించటం, ప్రజల కొనుగోలుశక్తిని పెంచటం ద్వారా డిమాండ్ పెంచే చర్యలు తీసుకొని దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దటం తదితరాలను గురించి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. ఇటువంటి అత్యవసర చర్యలు తీసుకోకుండా రైతు వ్యతిరేక ఆర్డినెన్స్‌లు జారీ చేయటం ప్రభుత్వ కార్పొరేట్, బహుళజాతి సంస్థల అనుకూల విధానాలను వెల్లడిస్తున్నది.

**నిత్యావసర సరుకుల చట్టానికి సవరణ**

రైతులు, వినియోగదారుల ప్రయోజనాలు, ఆహారధరలు, ఆహారలభ్యతలను దృష్టిలో పెట్టుకొని నిత్యావసర సరుకుల విధానాన్ని రూపొందించారు. ఇదే ప్రాతిపదికపై ఆహారధాన్యాల ధరలను నిర్ణయిస్తున్నారు. దేశంలో ఆహార ధాన్యాల కొరత, కరువులు సంభవిస్తున్న పరిస్థితులలో 1955లో నిత్యావసర సరుకుల చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. నిత్యావసర సరుకులను అధికంగా నిల్వచేయటాన్ని నేరంగా చట్టంలో పేర్కొన్నారు. ఈ చట్టం వలన కొంత మేరకు ఆహారధాన్యాల అక్రమ నిల్వలను కట్టడి చేయటం, ప్రజలకు ఆహారభద్రత కల్పించటం సాధ్యమైంది. అయితే ఇపుడు ఈ చట్టం వలన వ్యవసాయ రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులు రావటం లేదని, ప్రైవేటు పెట్టుబడులు రావటం ద్వారా వ్యవసాయోత్పత్తుల విలువ పెరుగుతుందని, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతాయని చెబుతున్నారు. నిత్యావసర సరుకుల చట్టం చేసేటపుడు గోధుమల ఉత్పత్తి కోటి టన్నులు ఉండగా ఇపుడు 10 రెట్లు పెరిగి 10 కోట్ల టన్నులకు, బియ్యం ఉత్పత్తి 4 రెట్లకన్నా అదనంగా పెరిగి, 2.5 కోట్ల టన్నుల నుండి 11 కోట్ల టన్నులకు పైగా పెరిగిందని, పప్పు ధాన్యాల ఉత్పత్తి కోటి టన్నుల నుండి 2.5 కోట్ల టన్నులకు చేరాయని, కాబట్టి ఈ చట్టం ఇపుడు అవసరం లేదని వాదనలు చేస్తున్నారు. ఇంతగా ఉత్పత్తి పెరిగినప్పటికీ ఇప్పటికీ దేశంలో తమ అవసరాలకు సరిపడా ఆహారధాన్యాలు అందనివారు మూడోవంతుకు పైగా ఉన్నారని, పోషకాహారం లభించకపోవటంతో రక్తహీనతతో బాధపడుతున్నవారు సగం మంది ఉన్నారని, వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేని బాలలు మూడోవంతుకు పైగా ఉన్నారన్న వాస్తవాన్ని ఈ వాదనలు చేస్తున్నవారు మరుగుపరుస్తున్నారు.

నిత్యావసర సరుకుల చట్టానికి చేసిన సవరణలతో ముతకధాన్యాలు, పప్పులు, నూనెగింజలు, వంటనూనెలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను నిత్యావసర సరుకుల జాబితా నుండి తొలగించారు. నిత్యావసర సరుకుల జాబితా నుండి తొలగించిన ఈ సరుకులన్నీ ప్రతివారూ, ప్రతిరోజూ ఆహారంలో వినియోగించేవే. ఈ సరుకులను నిత్యావసరాల జాబితా నుండి తొలగించిన తర్వాత చట్టంలో పేర్కొన్న మిగతా


epaper.prajasakti.com

> **"ఈ సంస్థల ప్రచారహోరు, ప్రభుత్వం కొనుగోలు చేయటానికి ముందుకురాని పరిస్థితులలో రైతులు తమ ఉత్పత్తులను ఏ ధరలకైనా అమ్ముకోవాల్సిన పరిస్థితులను కల్పిస్తారు. కాబట్టి రైతాంగంలో 80 శాతానికి పైగా ఉన్న పేద, మధ్య తరగతి, కౌలురైతులు నష్టపోతారు. పంట అంతా తమ చేతుల్లోకి వచ్చిన తర్వాత దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు తక్కువగా ఉన్నాయని ప్రచారం చేస్తూ ధరలు పెంచి వినియోగదారులను కొల్లగొడతారు."**



ప్రజలకు పంపిణీ చేయటం కోసం ఆహారధాన్యాలను నిల్వచేస్తున్న ఎఫ్‌సిఐ

సరుకులను జాబితాలో ఉంచుతారనే గ్యారంటీ లేదు. నిత్యావసరాలను జాబితా నుండి తొలగించటం ద్వారా వ్యాపారులు, ఎగుమతిదారులు, ఈ లావాదేవీలలో పాల్గొనేవారు ఎంత పెద్దమొత్తంలోనైనా సరుకులను నిల్వచేసుకోవటానికి అవకాశం కల్పించారు. యుద్ధం, కరువు, ప్రకృతి వైపరీత్యాలు, నిత్యావసర సరుకుల ధరలు అసాధారణంగా – నిల్వ ఉండని ఉత్పత్తుల ధరలు 50 శాతం, నిల్వ చేయటానికి అవకాశం ఉన్న ఉత్పత్తుల ధరలు 100 శాతం– పెరిగినపుడు ప్రభుత్వం ధరల పెరుగుదలపై ఆంక్షలు విధించవచ్చునని పేర్కొన్నారు. కాని ఇవి అక్రమంగా సరుకులను దాచి, ధరలు పెంచుతున్న కార్పొరేట్లు, ఎగుమతిదారులను అదుపుచేయటానికి, ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసరాలను అందించటానికి ఏ మాత్రం ఉపయోగపడకపోగా, 100 శాతం ధరలు పెరిగేవరకు ప్రభుత్వం ధరలను అరికట్టటానికి ఏ చర్యలూ తీసుకోకుండా ఉండటానికి అవకాశం కల్పిస్తాయి. ఎగుమతులపై ఉన్న ఆంక్షలను తొలగించటం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందని ప్రచారం చేస్తున్నప్పటికీ దీని వలన సామాన్య రైతులకు ఎటువంటి ప్రయోజనం కలుగకపోగా నష్టపోవటానికి అవకాశం ఉన్నది. నిత్యావసర సరుకుల వ్యాపారంలోకి ప్రవేశించటానికి కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు స్వేచ్ఛనిచ్చిన తర్వాత వ్యవసాయ వాణిజ్యంలో అధిక లాభాలను పొందటం కోసం వ్యవసాయోత్పత్తుల ధరలను తమ ఇష్టం వచ్చినట్లు తగ్గించటం, పెంచటం చేస్తారు. అందుకోసం పంటలు కళ్ళాలలోకి వచ్చి, రైతులు అమ్ముకొనే సమయంలో దేశంలో ఆ ఉత్పత్తులు అధికంగా నిల్వలున్నాయని, విదేశాల నుండి చౌకధరలకు దిగుమతి అవుతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తూ రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తారు. ఈ సంస్థల ప్రచారహోరు, ప్రభుత్వం కొనుగోలు చేయటానికి ముందుకురాని పరిస్థితులలో రైతులు తమ ఉత్పత్తులను ఏ ధరలకైనా అమ్ముకోవాల్సిన పరిస్థితులను కల్పిస్తారు. కాబట్టి రైతాంగంలో 80 శాతానికి పైగా ఉన్న పేద, మధ్య తరగతి, కౌలురైతులు నష్టపోతారు. పంట అంతా తమ చేతుల్లోకి వచ్చిన తర్వాత దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు తక్కువగా ఉన్నాయని ప్రచారం చేస్తూ ధరలు పెంచి వినియోగదారులను కొల్లగొడతారు. కాబట్టి నిత్యావసర సరుకుల చట్టానికి చేసిన సవరణ వలన రైతులు, వినియోగదారులు నష్టపోతారు. కొద్దిమందిగా ఉన్న భూస్వాములు, కార్పొరేట్ సంస్థలు, ఆహారధాన్యాలను ఎగుమతి, దిగుమతులు చేసే వ్యాపారులు లాభపడతారు.

నిత్యావసర సరుకుల చట్టానికి చేసిన సవరణ వలన ఉత్పత్తి అయిన ఆహారధాన్యాలను ఎగుమతి చేయటంపై ఆంక్షలు కూడా రద్దవుతాయి. దానితో ఎంతమొత్తం ఆహార ధాన్యాలనైనా ఎగుమతి చేయటానికి ఎగుమతిదారులకు అవకాశం లభిస్తుంది. ఆహార ధాన్యాల ఎగుమతిదారులు వారి లాభాలు మినహా మన ప్రజల ఆహారభద్రత, దేశ ఆర్థిక స్వావలంబన తదితర అంశాలను గురించి పట్టించుకోరు. లాభాలు వస్తున్నాయనుకుంటే మన ప్రజలు పస్తులుంటున్నా ఎగుమతులు చేస్తారు. ప్రస్తుత స్వేచ్ఛా వాణిజ్య విధానాలతో ఒకే సమయంలో ఒక సరుకు ఎగుమతి, దిగుమతులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నది. ఆ విధమైన ఎగుమతులు, దిగుమతులకు అయిన ఖర్చులు, రెండు వైపులా వ్యాపారంలో వ్యాపారులు సంపాదించుకున్న లాభాలు ప్రజలే భరించాల్సి ఉంటుంది. కాబట్టి అనివార్యంగా నిత్యావసరాల సరుకుల ధరలు పెరుగుతాయి. సరళీకరణ విధానాల ద్వారా అన్ని రంగాలలోనూ అభివృద్ధిని సాధిస్తుండగా వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అడుగడుగునా జోక్యం చేసుకోవటం అభివృద్ధికి ఆటంకంగా ఉందని, వ్యవసాయ సరుకుల వాణిజ్యంపై ఉన్న ఆంక్షలను తొలగించాలని, ఈ చర్యలు వ్యవసాయాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రచారం చేస్తున్నారు. ఆహారధాన్యాల నిల్వలు, ఎగుమతులపై ఆంక్షలను తొలగించటం వలన దేశంలో వ్యాపారం చేసేవారు, ఎగుమతులు చేసే బడా వ్యాపారస్తులు కూడా ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తారని, తద్వారా వ్యవసాయోత్పత్తుల ధరలు పెరుగుతాయని రైతులను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నారు.

ఆహారధాన్యాలను పండించే భూమి తగ్గటం కూడా ఆహారధాన్యాల కొరత ఏర్పడటానికి దారితీస్తుంది. ప్రస్తుతం మనదేశంలోని సాగు భూమిలో 60 శాతానికి పైగా భూమిలో ఆహార


epaper.prajasakti.com

ధాన్యాలను పండిస్తున్నారు. కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహించే కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయరంగంలోకి ప్రవేశించిన తర్వాత పశ్చిమదేశాలలోని ప్రజలకు అవసరమైన, తమకు అధికలాభాలు చేకూర్చే పంటల సాగును ప్రోత్సహిస్తాయి. ఫలితంగాఆహారధాన్యాలు పండించే భూమి, ఆహారధాన్యాల ఉత్పత్తి కూడా తగ్గిపోతుంది. ఉత్పాదకతను పెంచటం ద్వారా తక్కువ భూమిలో ఎక్కువ ఆహారధాన్యాలను పండించవచ్చునని, తద్వారా ఆహారధాన్యాలను పండించే భూమి తగ్గినా ఆహారధాన్యాల దిగుబడులు తగ్గకుండా చేయవచ్చునని, దిగుబడులు పెరుగుతాయి కాబట్టి దేశంలో ఆహారధాన్యాల కొరత ఏర్పడదని చట్ట సవరణను బలపరిచేవారు వాదిస్తున్నారు. కాని ఆహారధాన్యాల ఉత్పాదకత పెరగాలంటే విత్తనాభివృద్ధి, నీటి సరఫరా, భూ అభివృద్ధి తదితర మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులు పెరగాలి. ప్రభుత్వం వ్యవసాయరంగంలో చేసే ఖర్చును గణనీయంగా తగ్గిస్తున్నది. కాంట్రాక్టు కంపెనీలు తక్షణం లాభాలను సంపాదించుకొనే మార్గాలను చూస్తాయి మినహా దీర్ఘకాలిక ప్రయోజనాలను గురించి ఆలోచించవు. కాబట్టి వారు మౌలిక సదుపాయాల కల్పన కోసం పెట్టుబడులు పెట్టటానికి పూనుకోరు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెట్టుబడులు తగ్గించి, ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెట్టకపోతే ఉత్పాదకత ఎలా పెరుగుతుంది? అందువలన కాంట్రాక్టు వ్యవసాయ కంపెనీల రాకతో ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసే భూమి తగ్గు తుంది మినహా ఆహారధాన్యాల ఉత్పత్తి పెరగదు. కాబట్టి నిత్యావసర సరుకుల చట్టానికి చేసిన సవరణ, కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహించే ఆర్డినెన్స్‌లతో దేశప్రజలు అనివార్యంగా ఆహారధాన్యాల కొరతను ఎదుర్కొంటారు.

పప్పులు, నూనెగింజలు, వంటనూనెలు, ముతక ధాన్యాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు తదితరాలను నిత్యావసర సరుకుల జాబితా నుండి తొలగించటం ప్రజాపంపిణి వ్యవస్థ దెబ్బతినటానికి కూడా దారితీస్తుంది. కొన్ని రాష్ట్రాలలో బియ్యం, గోధుమలతో పాటు ముతకధాన్యాలు, వంటనూనెలు, ఇతర సరుకులను కూడా ప్రభుత్వాలు పేదలకు సరఫరా చేస్తున్నాయి. గత రెండు సంవత్సరాలలో ఉల్లిపాయల ధరలు అసాధారణంగా పెరిగినపుడు ప్రభుత్వమే దిగుమతులు చేసుకొని, రైతుబజార్లు, చౌకధరల దుకాణాల ద్వారా తక్కువ ధరలకు ప్రజలకు పంపిణి చేసింది. ఇపుడు ఉల్లిపాయలను నిత్యావసర సరుకుల జాబితా నుండి తొలగించటంతో ధరలు పెరిగినపుడు వాటిని తక్కువ ధరలకు సరఫరా చేసే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకున్నది.

**"కాంట్రాక్టు కంపెనీలు కేవలం రైతుల పంటలను కొనుగోలు చేయటమే కాకుండా, వివిధ రకాల వ్యవసాయ పనులు చేసే భారీ యంత్రాలను కూడా వారికి అద్దె ప్రాతి పదికపై అందజేస్తాయి. ఎక్కువ పనులను యంత్రాలతో చేయించిన తర్వాత వ్యవసాయ కార్మికులు చేసేందుకు తక్కువ పనులు మాత్రమే ఉంటాయి. కౌలురైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి తాము కౌలుకు తీసుకున్న భూమితో పాటు ఇతర రైతుల భూములలో కూడా పనులకు వెళుతుంటారు."**



వ్యవసాయోత్పత్తుల సేకరణలో గుత్తాధిపత్యం వహించనున్న కార్పొరేట్ సంస్థల సూపర్‌మార్కెట్

### కాంట్రాక్టు వ్యవసాయంతో రైతులకు నష్టం

కాంట్రాక్టు వ్యవసాయంపై ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కార్పొరేట్, బహుళజాతి కంపెనీలకు ఉపయోగపడుతుంది. వీరు తమకు అవసరమైన పంటలను మాత్రమే రైతులు పండించాలని, ఒప్పందం ప్రకారం నిర్ణయించిన ధరలకు ఆ పంటలను తామే కొనుగోలు చేస్తామని రైతులతో ఒప్పందం చేసుకుంటారు. ఒప్పందానికి అనుగుణంగా రైతులు పంటలు వేయాలి. రైతులు ఆ పంటలను పండించిన తర్వాత కాంట్రాక్టు కంపెనీలు ఒప్పందం ప్రకారం ధరలు చెల్లిస్తాయనే గ్యారంటి ఉండదు. ఒప్పందానికి రైతులు బద్ధులై ఉండాలి మినహా కంపెనీలు కట్టుబడి ఉండవు. రైతులతో చేసుకున్న ఒప్పందాలకు తూట్లు పొడవటానికి కార్పొరేట్ సంస్థలు అనేక పద్ధతులను అవలంభిస్తాయి. పంట నిర్దిష్టమైన నాణ్యతతో లేదని, పురుగు మందుల అవశేషాలు ఎక్కువ ఉన్నాయని తది తర వాదనలను ముందుకు తెస్తారు. ఈ విధం గా ఒప్పందం ప్రకారం రైతులకు చెల్లింపులు చేయకుండా, తక్కువ ధరలకు రైతుల పంటలను కాజేస్తారు. తక్కువ ధర చెల్లించినా ఒప్పందం చేసుకున్న కంపెనీకి పంటను అమ్ముకోవటం మినహా రైతులకు గత్యంతరం ఉండదు.

మీడియాలో వస్తున్న సమాచారం ప్రకారం కేంద్ర కాంట్రాక్టు వ్యవసాయ చట్టంలో రైతుకు కనీసమద్దతు ధర గ్యారంటి ఉంటుందని పేర్కొన్నారు. ధరలు ఎక్కువగా ఉంటే రైతుకు కూడా అధికధరలు వస్తాయని కూడా చెబుతున్నారు. ఇది కాంట్రాక్టు వ్యవసాయ విధానానికి వ్యతిరేకం. కాంట్రాక్టు వ్యవసాయంలో రైతు, కాంట్రాక్టరు అంగీకరించిన ధరలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు లేదా మార్కెట్‌లో మారుతున్న ధరలపై ఆధారపడి ఉండవు. మొదట నిర్ణయించుకున్న ధరలనే అమలుచేస్తారు. కాంట్రాక్టు వ్యవసాయంతో కౌలురైతులు,

> **❝ రైతుల ఉత్పత్తులను మార్కెట్ యార్డులలో కొనుగోలు చేయటం వలన రైతులతో పాటు ప్రజలందరికీ మేలు జరిగింది. మార్కెట్ యార్డుల వ్యవస్థలో లోపాలున్నప్పటికీ వాటిలో రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవటం వలన బయట తక్కువ ధరలకు అమ్ముకోవటం తప్పటం తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణి వ్యవస్థ, ఇతర ప్రజావసరాల కోసం ఆహారధాన్యాలను సేకరించే కేంద్రాలుగా కూడా ఇవి రూపొందాయి.❞**



తెలంగాణాలోని ఒక మార్కెట్ యార్డులో ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయకపోవటంతో కొనుగోలుదార్ల కోసం రైతుల ఎదురుచూపులు

వ్యవసాయ కార్మికులు కూడా సమస్యలను ఎదుర్కొంటారు. కాంట్రాక్టు కంపెనీలు కేవలం రైతుల పంటలను కొనుగోలు చేయటమే కాకుండా, వివిధ రకాల వ్యవసాయ పనులు చేసే భారీ యంత్రాలను కూడా వారికి అద్దె ప్రాతిపదికపై అందజేస్తాయి. ఎక్కువ పనులను యంత్రాలతో చేయించిన తర్వాత వ్యవసాయ కార్మికులు చేసేందుకు తక్కువ పనులు మాత్రమే ఉంటాయి. కౌలురైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి తాము కౌలుకు తీసుకున్న భూమితో పాటు ఇతర రైతుల భూములలో కూడా పనులకు వెళుతుంటారు. భారీయంత్రాల ప్రవేశంతో అటువంటిఅవకాశాలు తగ్గిపోతాయి.

### వ్యవసాయ మార్కెట్ సంస్కరణలు

వ్యవసాయ మార్కెట్ యార్డులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ వ్యవసాయోత్పత్తుల కొనుగోలు, అమ్మకాలకు మార్కెట్ కమిటీలకు వెలుపల కొత్త మార్కెట్లు ఏర్పడటానికి అవకాశం కల్పిస్తున్నది. దీని వలన కొనుగోలుదారులు మార్కెట్ యార్డులతో నిమిత్తం లేకుండా యార్డులకు బయటే రైతుల నుండి ఉత్పత్తులను కొనుగోలు చేయటంతో మార్కెట్ యార్డుల ప్రాముఖ్యం తగ్గిపోతుంది. మార్కెట్ యార్డులు పోటీకి అంగీకరించకపోవటంతో వాటి గుత్తాధిపత్యం పెరిగిపోయిందని, అందువలనే రైతులకు ఎక్కువ ధరలు రావటం లేదని సంస్కరణల అనుకూలురు ప్రచారం చేస్తున్నారు. వాటికి సంబంధించిన ప్రాంతంలో, నిర్ణయించిన సరుకుల వాణిజ్యానికి మాత్రమే ఇతరులను అనుమతించటంతో ఈ గుత్తాధిపత్యం పెరిగి పోయిందని చెబుతున్నారు. సంస్కరణల అనుకూలురు ప్రచారం చేస్తున్నట్లుగా వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఉత్పత్తుల కొనుగోలుపై విధించిన ఆంక్షల వలన కాక పండించిన పంటలకు గిట్టు బాటు ధరలు లేకపోవటం, వ్యవసాయోపకరణాల ధరలు పెరిగిపోవటం, సకాలంలో రుణాలు అందకపోవటం వలన రైతాంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

రైతుల ఉత్పత్తులను మార్కెట్ యార్డులలో కొనుగోలు చేయటం వలన రైతులతో పాటు ప్రజలందరికీ మేలు జరిగింది. మార్కెట్ యార్డుల వ్యవస్థలో లోపాలున్నప్పటికీ వాటిలో రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవటం వలన బయట తక్కువ ధరలకు అమ్ముకోవటం తప్పటం తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణి వ్యవస్థ, ఇతర ప్రజావసరాల కోసం ఆహారధాన్యాలను సేకరించే కేంద్రాలుగా కూడా ఇవి రూపొందాయి. ఇటువంటి పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతును అందజేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా–ఎఫ్‌సిఐ–కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా–సిసిఐ–లు వ్యవసాయ మార్కెట్ యార్డుల నుండి కమిషన్ ఏజంట్ల ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేయించి, వారి నుండి తాము సేకరిస్తున్నాయి. ఈ అమ్మకం, కొనుగోలు లావాదేవీలకు గానూ ఏజంట్లకు కొంత మొత్తం కమిషన్‌గా చెల్లిస్తున్నారు. ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా పంపిణి చేసే సరుకులు, ఇతర ప్రజావసరాల కోసం ప్రభుత్వం పంపిణి చేసే సరుకులలో ఎక్కువ భాగం వ్యవసాయ మార్కెట్ యార్డుల నుండే సేకరిస్తున్నారు. రైతులకు, ప్రభుత్వానికి ఇంత ఉపయోగకరంగా ఉన్న సంస్థలలో లోపాలున్నాయనే పేరుతో వాటిని రద్దుచేసే చర్యలు కాకుండా వాటిలోని లోపాలను సరిదిద్ది, అవినీతిని అరికట్టి సక్రమంగా పనిచేయించటానికి పూనుకోవాలి.

ఈ సంస్కరణల వలన ఈనామ్ ( జాతీయ వ్యవసాయ మార్కెట్) వృద్ధి చెందుతుందని, పోటీ పెరిగి రైతుల ఉత్పత్తులకు మంచి ధరలు వస్తా యని ప్రచారం చేస్తున్నారు. రైతులు మార్కెట్ యార్డుకు తీసుకువచ్చిన ఉత్పత్తిని ఈనామ్ ద్వారా అమ్మాలంటే కనీసం ముగ్గురు వ్యాపారస్తులు వేలంలో పాల్గొనాలి. వ్యాపారులు ఇస్తానన్న ధర గిట్టుబాటు కాకపోతే రైతు తన సరుకును అమ్మకుండా ఉండవచ్చు. కాని ఒకసారి మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన సరుకును ధరలేదనే పేరుతో రైతు తిరిగి వెనక్కు తీసుకుపోవటం అంటూ ఉండదు. అందువలన ఈనామ్ విధానం ఉన్నా, మార్కెట్ యార్డులో వేలం పద్ధతి అయినా తన సరుకును మార్కెట్‌కు తీసుకొచ్చిన తర్వాత ఏ ధర వచ్చినా రైతు అనివార్యంగా తన సరుకును అమ్ముకోకతప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

వ్యవసాయరంగానికి మరింత స్వేచ్ఛనిస్తున్నామన్న పేరుతో రాష్ట్రాల జాబితాలో ఉన్న



epaper.prajasakti.com

“కాని వాస్తవంలో ఏ ఉత్పత్తినైనా, ఏ ధరకైనా రైతుల నుండి కొనుగోలు చేయటానికి కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకు స్వేచ్ఛ లభిస్తుంది. ఎఫ్ (ఇ అండ్ పి)ఎపిఎఎఫ్ఎస్ ఆర్డినెన్స్‌లో వ్యవసాయో త్పత్తులకు గ్యారంటీ ధరలని పేర్కొన్నారు. కాని ఈ ధరలు కనీసమద్దతు ధరల కన్నా తక్కువ వుండవని చెప్పలేదు. కనీసం వ్యవసాయ మార్కెట్ యార్డులలో చెల్లించే ధరలకు తగ్గకుండా వుంటాయని కూడా పేర్కొనలేదు.”

ఈ రంగాన్ని ఆర్డినెన్స్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం తన అదుపులోకి తీసుకొంటున్నది. రాష్ట్రాల లోపల, రాష్ట్రాల మధ్య వాణిజ్యానికి వ్యవసాయ మార్కెట్ యార్డులు ఆటంకంగా ఉన్నాయని ఆరోపణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడిని పెంచటం ద్వారా వ్యవసాయరంగంలో సంస్కరణ లను ముందుకు తీసుకుపోవటానికి గత ప్రభుత్వాలు ప్రయత్నం చేశాయి. కొనుగోలుదారులు మార్కెట్ యార్డుల నుండి లైసెన్స్ పొందాలనే నిబంధన ఇందుకు ఆటంకంగా ఉందని ప్రచారం చేశారు. కాని నయాఉదారవాద సంస్కరణలను బలవంతంగా రాష్ట్రాలపై రుద్దటానికి పూనుకోలేదు. చాలా రాష్ట్రాలు తమ రాష్ట్రాల పరిధిలో వ్యాపారం చేయటానికి ఒకే లైసెన్స్‌ను జారీచేస్తున్నాయి. వ్యవసాయరంగం, రాష్ట్రస్థాయిలో జరిగే వ్యవసాయ వాణిజ్యం రాష్ట్రాల పరిధిలో ఉన్నాయి. ఆహారధాన్యాల వాణిజ్యం ఉమ్మడి జాబితాలో ఉండగా, వ్యవసాయ మార్కెట్లకు సంబంధించిన చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రాలు కలిగివున్నాయి.

ఒకేదేశం, ఒకేమార్కెట్‌కు ఈ ఆర్డినెన్స్ మార్గం సుగమం చేస్తుందని, ఒకరాష్ట్రం లోపల, వివిధ రాష్ట్రాల మధ్య వ్యవసాయ సరుకుల వాణిజ్యాన్ని సులభతరం చేస్తుందని, కొనుగోలుదారులు రైతుల ఇంటికే వచ్చి వారి ఉత్పత్తులను కొనుగోలు చేస్తారని ప్రచారం చేస్తున్నారు. ఆ విధంగా కొనుగోలు చేసేవారికి లైసెన్స్ అవసరం లేదు. వారు పన్నుకూడా చెల్లించాల్సిన అవసరం లేదు. పాన్‌కార్డు ఉంటే సరిపోతుంది. ఈ ఆర్డినెన్స్ కింద కొనుగోలు చేసిన ఉత్పత్తులపై రాష్ట్రాలు ఎటువంటి పన్నులు, ఫీజులు వసూలు చేయవు. కాబట్టి రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడైనా అమ్ముకొని ఎక్కువ ధరలు రాబట్టుకోవటానికే ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేశామని ప్రభుత్వం చెబుతున్నది. కాని ఒకేదేశం, ఒకే మార్కెట్ సాకుతో వ్యవసాయ మార్కెట్లు, వ్యవసాయ వాణిజ్యం, ఆహారధాన్యాల చిల్లర వ్యాపారంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించటమే ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నది. ఈ నామ్‌తో ఎపిఎంసి-వ్యవసాయ మార్కెట్ కమిటి-లను డిజిటల్ విధానం ద్వారా అనుసంధానం చేయాలన్న కేంద్రం ప్రయత్నాలకు పరిమిత ప్రయోజనం మాత్రమే చేకూరింది. కాబట్టి ఈ ఆర్డినెన్స్‌ల ద్వారా రాష్టాలపై సంస్కరణలను నిరంకుశంగా రుద్దటానికి పూనుకుంది.

కొనుగోలుదారులు, అమ్మకందార్ల ప్రయోజనాల రక్షణ కోసం ఇతర రంగాలలో ఎటువంటి రక్షణలు అవసరం లేనపుడు వ్యవసాయ రంగంలోని రైతులకు మాత్రం రక్షణలు ఎందుకని ఆర్డినెన్స్‌లను బలపరిచేవారు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి రక్షణలు లేకపోయినా రైతులు తమ ఉత్పత్తులకు తగిన ధరలు పొందగలరని, అందుకు పాల ఉత్పత్తిరంగంలోని లక్షలాది మంది రైతులే ఉదాహరణ అని వారు చెబుతున్నారు. పాల రైతులు రోజుకు రెండుసార్లు పాలు పోస్తారని, అయినప్పటికీ మంచి ధరలనే పొందుతున్నారని చెబుతున్నారు. కాని పాల ఉత్పత్తి రంగంలో రైతుల ప్రయోజనాలను కాపాడటంలో సహకార సంఘాలు నిర్వహిస్తున్న పాత్రను గురించి ప్రస్తావించరు. ఈ రంగంలో సహకార సంఘాలు ఉండటం, అవిచేస్తున్న కృషి వలన ఇతర కొనుగోలుదారులు కూడా సహకారసంఘాల బాటలోనే నడవాల్సివస్తున్నది.

దేశం 1947లో స్వాతంత్ర్యం పొందగా ఈ ఆర్డినెన్స్‌ల ద్వారా రైతాంగం స్వాతంత్ర్యం పొందుతుందని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌లు తమ ఉత్పత్తులను ఎక్కడైనా, ఏ ధరకైనా అమ్ముకోవటానికి రైతాంగానికి స్వాతంత్ర్యం కల్పిస్తున్నాయని ప్రచారం చేస్తున్నారు. కాని వాస్తవంలో ఏ ఉత్పత్తినైనా, ఏ ధరకైనా రైతుల నుండి కొనుగోలు చేయటానికి కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకు స్వేచ్ఛ లబిస్తుంది. ఎఫ్ (ఇ అండ్ పి)ఎపిఎఎఫ్ఎస్ ఆర్డినెన్స్‌లో వ్యవసాయోత్పత్తులకు గ్యారంటీ ధరలని పేర్కొన్నారు. కాని ఈ ధరలు కనీసమద్దతు ధరల కన్నా తక్కువ ఉండవని చెప్పలేదు. కనీసం వ్యవసాయ మార్కెట్ యార్డులలో చెల్లించే ధరలకు తగ్గకుండా వుంటాయని కూడా పేర్కొనలేదు. రైతాంగం డిమాండ్ చేస్తున్న, స్వామినాధన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా సి2+50 శాతం మద్దతు ధరలను గురించి కూడా ప్రస్తావించ లేదు. రైతాంగ ప్రయోజనాల కోసమే అయితే దేశమంతా కోవిడ్‌తో పోరాడుతున్న సమయంలో, ప్రజలు తమ ఇళ్ళుదాటి బయటికి రావటంపై అనేక ఆంక్షలు విధించిన తరుణంలో ఈ మార్పులను దొంగచాటుగా రైతాంగంపై రుద్దాల్సిన అవసరం ఏమున్నది?

పెద్ద కంపెనీలు, ఎగుమతిదారులు, హోల్‌సేల్ వ్యాపారులు, ప్రాసెసింగ్‌లో పాల్గొనే కంపెనీలతో రైతులు సమానస్థాయిలో వ్యవహరించటానికి ఈ ఆర్డినెన్స్‌లు అవకాశం కల్పిస్తాయని చెబుతున్నారు. కాని ఇది రైతుల హక్కులను హరించి బడా భూస్వాములు, వ్యాపారులకు ప్రయోజనం కలిగిస్తుంది. వ్యవసాయరంగంలో గోడౌన్‌లు, రవాణా, నిల్వచేయటానికి అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలు కల్పించటం కోసం ప్రభుత్వం కేటాయించిన లక్షకోట్ల రూపాయలు కార్పొరేట్ సంస్థల చేతులలోకిపోతాయి.

ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌లు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి కాక వారిని మరింత సంక్షోభంలోకి నెట్టటానికి దారితీస్తాయి. వీటిని కోవిడ్ ఉద్దీపన ప్యాకేజీలో చేర్చటం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించటానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. వ్యవసాయరంగంలో తమ ప్రవేశానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని సామ్రాజ్యవాదులు అనేక సంవత్సరాల నుండి ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారు. పార్లమెంటును పక్కన పెట్టి, ప్రజలు బయటికి రావటానికి వీలులేని పరిస్థితులలో మన రైతాంగం, ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడని ఆర్డినెన్స్‌లను జారీ చేయటం బిజెపి ప్రభుత్వ కార్పొరేట్, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను వేగంగా అమలు చేస్తుందన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. రైతాంగం, వ్యవసాయ కార్మికకులు, కౌలురైతులు ఐక్యంగా పోరాటాలు చేయటం ద్వారా మాత్రమే ఈ ఆర్డినెన్స్‌లను తిప్పికొట్టటం సాధ్యమౌతుంది.


epaper.prajasakti.com

# ప్రమాదంలో ప్రజా పంపిణీ వ్యవస్థ



రచయిత్రి
జెఎన్‌యు ప్రొఫెసర్, మార్క్సిస్టు మేధావి

**ఉత్సా పట్నాయక్**

ఇటీవల భారతదేశం, డబ్లుటివోల మధ్య వ్యవసాయ ఒప్పందం కుదిరింది. దానితో ప్రభుత్వ ఆహార పంపిణీ వ్యవస్థకు ప్రమాదం ముంచుకొస్తున్నది. ఇది మన ప్రజానీకంపై నయా వుదారవాదం చేస్తున్న తాజా దాడిగా గమనించాలి.

**నేపథ్యం :**

యూరపు, ఉత్తర అమెరికాల్లోని అభివృద్ధి చెందిన దేశాలు శీతలమండలంలో వున్నాయి. వాటితో పోల్చితే, భారత్ వంటి ఉష్ణమండల దేశాల్లోని భూముల వుత్పాదకత అధికంగా వుంటుందని కొందరికి మాత్రమే తెలుసు. మన దేశంలో ఒక వ్యవసాయ సీజనులో కనీసం రెండు, కొన్ని చోట్ల మూడు ప్రత్యేక పంటలు కూడా పండుతాయి. వాయువ్య ఆసియా, చైనా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా వంటి ఉష్ణమండల దేశాల్లో కూడా అలాంటి పరిస్థితే వుంది. అందుకు భిన్నంగా అభివృద్ధి చెందిన శీతల మండల దేశాలు వార్షికంగా ఒక పంటను మాత్రమే పండించగల్గుతున్నాయి. ఈ దేశాల్లో వేసవిలో పండించే ప్రతి పంటనూ కూడా, ఉష్ణమండలంలోని ఆసియా దేశాల్లో వర్షా కాలంలో పండించగల్గుతున్నారు. దానితోపాటు అభివృద్ధి చెందిన దేశాలకు అవసరమైన పలు రకాల ఉష్ణమండల పంటలను కూడా పెద్ద మొత్తంలో పండించగల్గుతున్నారు. వాతావరణ పరిమితులవల్ల ఉత్తరాది దేశాలు ఆ పంటలను ఏ పరిస్థితుల్లోనూ వుత్పత్తిచేయ లేవు.

అనేక శతాబ్దాలుగా అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ఈ భౌతిక వాస్తవాలను ఉద్దేశ్యపూర్వకంగానే విస్మరిస్తున్నాయి. ఉత్తరాది దేశాలలోని విశ్వవిద్యాలయాలు వండివార్చే మిథ్యావాద ఆర్థిక సిద్ధాంతాల మాటున ఈ తతంగాన్ని కొనసాగిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని మేధావులను కూడా ఈ సిద్ధాంతాలు ప్రభావితం చేస్తున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య వేదికల్లో వారు ఈ అంశాన్ని చర్చకు తీసుకోవటం లేదు. డేవిడ్ రికార్డో 'పరస్పర ప్రయోజనం' (కంపారిటివ్ అడ్వాన్టేజ్) సిద్ధాంతాన్ని ఆవిష్కరించారు. పై సిద్ధాంతాలన్నింటి కంటే అత్యంత స్పష్టమైనదిగానూ, ముఖ్యమైనదిగాను రికార్డో సిద్ధాంతం వుంది. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా అన్ని దేశాలూ, అన్ని సరుకులను, వుత్పత్తి చేయగలవని ఆ సిద్ధాంతం ప్రచారం చేస్తున్నది. అన్ని దేశాలూ అన్ని సరుకులనూ వుత్పత్తి చేయలేవన్నది వాస్తవం. ఈ భౌతిక వాస్తవాన్ని అవాస్తవంగా మార్చటానికే రికార్డో తప్పుడు సిద్ధాంతం వుద్దేశించబడింది. ఉష్ణమండలానికి సంబంధించిన ఏ వ్యవసాయ సరుకు ఖరీదునూ యూరపు వాసులు నిర్ణయించలేరు. కారణం అలాంటి సరకులు యూరప్‌లో ఏనాడూ వుత్పత్తి చేయలేదు. అందుకే "వాణిజ్యం, నైపుణ్యాలతో పరస్పర లబ్ధి చేకూరటం అనివార్యం" అంటున్న రికార్డో నిర్ధారణ సరికాదు.

సాధారణ వాణిజ్య ఒప్పందాలతో అభివృద్ధి చెందిన దేశాలకు అవసరమైన సరుకులను పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవటంసాధ్యం కాదు. జనాభాలో ఎక్కువ జీవవైవిధ్యం కల్గిన దేశాలు తమకు అవసరమైన వ్యవసాయ సరుకులు అన్నింటినీ వుత్పత్తి చేసుకుంటున్నాయి. ఆ సరుకులతో పోల్చినపుడు శీతల మండల దేశాలలోని భూముల్లో పండుతున్న సరుకులకు ఇక్కడ గిరాకీ లేదు. గతంలో ఐరోపా నుండి ఇక్కడకు వచ్చిన విదేశీయులు ఇందుకు ఏకైక పరిష్కారాన్ని కనుగొన్నారు. శక్తివంతమైన సాయుధ బలగాలు, రాజకీయ ప్రాబల్యంతో ఈ దేశాలను తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. పన్నులు వసూలు చేసుకునే హక్కును సంపాదించారు. భారతీయులు తమకు చెల్లించిన మొత్తం పన్నుల్లో మూడవ వంతును ఇక్కడి సరుకుల కొనుగోళ్లకు బ్రిటీషువారు వినియోగించారు. ఆ విధంగా స్థానికంగా వసూలుచేసిన పన్నుల నుండే ఇక్కడి ప్రజల నుండి కొనుగోలు చేసిన ఉత్పత్తులకు చెల్లించారు. కానీ ఉత్పత్తిదార్లకు వాస్తవంగా అందాల్సిన మొత్తం అందలేదు. ఈ విధంగా చెల్లించినప్పటికీ ఇది వాస్తవంగా చెల్లింపుల కిందకురాదు. దేశంలో ఖర్చు చేసిన దానికన్నా పన్నుల ద్వారా అధికంగా వసూలు చేయటం ఇక్కడి ప్రజల ఆదాయాలపై ప్రతి ద్రవ్యోల్బణ(డిఫ్లేషన్) ప్రభావాన్ని కల్గించాయి. ఫలితంగా అత్యవసర సరకులు, ప్రధానంగా ఆహారధాన్యాల వినిమయం తగ్గిపోయింది. ఎగుమతికి వుద్దేశించిన పంటలవైపు భూములు, ఇతర వనరులను మళ్లించవలసి వచ్చింది. పంటల సరళి మార్పువంటి చర్యలవల్ల ప్రజల పౌష్టిక ఆహారపు ప్రామాణిక విలువలు తగ్గిపోసాగాయి. తమ దేశపు వుత్పత్తిదారుల దిగుమతుల కోసం వలస మార్కెట్లను తెరచివుంచారు. తమ మార్కెట్లను కాపాడుకున్నారు. ఈ విధమైన వివక్షాపూరిత విధానాల ఫలితంగా ఇక్కడ నిరుద్యోగం తీవ్రతరమయ్యింది. భూమిపై వత్తిడి పెరిగింది. ప్రజలు తమ కొనుగోలు శక్తిని కోల్పోయారు.

ఇక్కడ రెండు అంశాలను గమనించాలి : ఒకటి. భారత్ వంటి ఉష్ణమండల భూముల్లో వుత్పాదకత అధికంగా వుంది. ఆ భూముల ఉత్పాదకతను పెంచేందుకు తగు మొత్తంలో పెట్టుబడులు పెట్టకుండా ఉత్తర అమెరికా, యూరపు దేశాల ఎడతెగని కోర్కెలను సంతృప్తి పరచటం సాధ్యంకాదు. అదే సమయంలో అంతర్గతంగా ప్రజలకు ఆహార ధాన్యాలను సరఫరా చేయటం గురించి ఆలోచించేవారు కాదు. తమ వలస దేశాల్లో వుత్పాదకతను పెంచేందుకు స్వల్ప మొత్తాలనే ఖర్చుచేసేవారు. అసలు ఈ అంశం గురించి పట్టించుకునేవారు కాదు. వలస దేశాల్లోని ప్రజల వినిమయాన్ని



epaper.prajasakti.com

గణనీయంగా తగ్గించి, ఇక్కడి వ్యవసాయ వుత్పత్తులను తమ దేశాలకు కొల్లగొట్టుకు పోయేవారు. ప్రాథమిక వుత్పత్తుల ఎగుమతులు, స్థానిక ప్రజలకు వాటి లభ్యతకు మధ్యగల సంబంధం స్థానికప్రజలకు ప్రతికూలంగా వుండేది. నేడు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆదాయాలపై సామ్రాజ్యవాద దేశాల ప్రత్యక్ష అదుపు లేదు. కానీ అభివృద్ధి చెందిన దేశాలూ, వాటి నాయకత్వంలో నడుస్తున్న ప్రపంచ ఆర్థిక సంస్థలూ ద్రవ్యపెట్టుబడి బంట్లుగా తయారయ్యాయి. అవి అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని తమ విధేయ ప్రభుత్వాలపై తీవ్రమైన వత్తిడి చేస్తున్నాయి. వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రభుత్వ కేటాయింపులను గణనీయంగా తగ్గించేలా దాడి చేస్తుయటం,స్వేచ్ఛా వాణిజ్యాన్ని పెంచటం పేరుతో ప్రాథమిక వుత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించటం ద్వారా స్థానిక ప్రజలచేతిలో కొనుగోలు శక్తి లేకుండా (డిఫ్లేషన్) చేశాయి. తద్వారా ఆయా దేశాలలోని ప్రజలకు ఆహారాన్ని అందించటాన్ని గాలికి వదిలేశాయి. ఆ విధంగా అంతర్జాతీయ ద్రవ్య సంస్థల సలహా మేరకు, జల వనరులు, పంటల పరిశోధనలు, వ్యవసాయ విస్తరణల సేవలపై ప్రభుత్వ వ్యయాలలో గణనీయంగా కోతలు పెట్టాయి. ఫలితంగా అవసరమైన స్థాయిలో వుత్పాదకత పెరగటం లేదు.

❝కానీ గత 25 సంవత్సరాల 'నయా వుదారవాద' విధానాల అమలు కాలం లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించటం, రక్షణలను తొలగించటంతో 2011లో తలసరి ఆహార ధాన్యాల లభ్యతలో దేశం అత్యంత దిగువ స్థాయికి, 176కిలోలకు పడిపోయింది. అదే సమయంలో అత్యంత వెనుకబడిన దేశాలలో తలసరి ఆహారధాన్యాల సగటు లభ్యత 212 కిలోలు ఉండగా, ఆఫ్రికా దేశాలలలో 227 కిలోలుగా వుంది.❞



ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలు పొందుతున్న పేదలు

భారతదేశంతో పాటు అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయ సంక్షోభం కొన సాగుతున్నది. ఆహారధాన్యాల ఎగుమతులు తిరిగి వూపందుకున్నాయి. ఈ దేశాల్లో అంతర్గతంగా ఆహార ధాన్యాల లభ్యత పడిపోయింది. జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించిన అభివృద్ధి విధానాలు అమలు జరిగిన నాలుగు దశాబ్దాల కాలంలో తలసరి ఆహారధాన్యాల వుత్పత్తి, లభ్యత పెరిగింది. కానీ గత 25 సంవత్సరాల 'నయా వుదారవాద' విధానాల అమలు కాలంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించటం, రక్షణలను తొలగించటంతో 2011లో తలసరి ఆహార ధాన్యాల లభ్యతలో దేశం అత్యంత దిగువ స్థాయికి, 176కిలోలకు పడిపోయింది. అదే సమయంలో అత్యంత వెనుకబడిన దేశాలలో తలసరి ఆహారధాన్యాల సగటు లభ్యత 212 కిలోలు ఉండగా, ఆఫ్రికా దేశాలలలో 227 కిలోలుగా వుంది. ఈ విషయంలో భారత్ కంటే చైనా ఎల్లప్పుడూ ముందంజలో ఉన్నప్పటికీ జౌళి వుత్పత్తుల ఎగుమతులకు ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా పంట భూములను, ముడి పత్తి వుత్పత్తులవైపు మళ్లించారు. ఫలితంగా చైనాలో కూడా తలసరి ఆహారధాన్యాల లభ్యత తగ్గింది. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులతో తమ దేశం కూడా ఇందుకు మినహాయింపు కాదని స్పష్టమైందని చైనాకు చెందిన కొందరు పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

రెండు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టినప్పటికీ సాంకేతిక మార్పుల ద్వారా పంటల వుత్పాదకతను కొద్దిమేరకు మాత్రమే పెంచుకోగల్గాయి. కానీ వారి పంటల సరళిని పూర్తిగా మార్చలేదు. ఆయా దేశాల పరిమిత వుత్పాదక అవకాశాలకు, అక్కడి సంపన్న జనాభా అధికస్థాయి వినియోగ పద్ధతులకు పొసగటం లేదు. తాము ఏనాడూ వుత్పత్తి చేసి యెరుగని అనేక ప్రాథమిక వుత్పత్తులను భారీగా వినియోగించటానికి అక్కడి సంపన్నులు అలవాటు పడ్డారు. ఏ యితర వుత్పాదక విభాగాల కంటే వ్యవసాయం పూర్తి భిన్నమైనదిగా నిలిచింది. అభివృద్ధి చెందిన దేశాలకు, ఉష్ణమండల దేశాల నుండి పంటలను దిగుమతులు చేసుకోవటం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. ఆ దేశాల్లో వేసవిలో పండే పంటలను శీతాకాలంలో వుత్పత్తి చేయలేరు. వారు అలాంటి పంటలను దిగుమతి చేసుకోవచ్చు. విమాన రవాణా ధరలు తగ్గిన పరిస్థితుల్లో ఎగుమతి, దిగుమతుల్లో సమతుల్యత దెబ్బతింటున్నది. శీతాకాలపు పంటల తాజా వుత్పత్తులకు గిరాకీ పెరిగింది. మన భూముల్లో వుత్పాదక సామర్థ్యం ఎక్కువగా వుంది. దాన్ని వారి వ్యవసాయ సరుకుల వ్యాపార కార్పొరేషన్‌ల అదుపులో వుంచుకోవటం కోసం వత్తిడి చేస్తున్నారు. గతంలో వలే ముడి సరుకుల దిగుమతులు వారికి ప్రాధాన్యత గల అంశం కాదు. రకరకాల ఆహార పదార్థాల దిగుమతుల కోసం సంపన్నుల నుండి గిరాకీ వేగంగా పెరుగుతున్నది. వేరొక వైపున ఉత్తర అమెరికా, యూరపు దేశాలు కొన్ని దశాబ్దాలుగా ఆహారధాన్యాలు, పాడి వుత్పత్తుల్లో స్థిరమైన అధికోత్పత్తిని సాధిస్తున్నాయి. ఆ దేశాల అంతర్గత వినిమయానికి మించి ఆ అధికోత్పత్తులు వున్నాయి. కొండల్లా పేరుకు పోయిన తమ అదనపు వుత్పత్తులకు మార్కెట్ల కోసం ఆ దేశాలు నిరంతరం అన్వేషిస్తున్నాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ఆహార భద్రతా విధానాలను వదులుకొనేలా అభివృద్ధి చెందిన దేశాలు వత్తిడి చేస్తున్నాయి. తమ ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రపంచ వ్యాపితంగా శ్రామికుల్లో పని విభజనను ప్రవేశపెట్టారు. దీనితో జీవ వైవిధ్యమున్న అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ఆహార భద్రతను వదులుకునేలా చేసి, సంపన్న దేశాల నుండి ఆహార ధాన్యాల



epaper.prajasakti.com

"వ్యవసాయ ఒప్పందం(ఎఒఎ)పై సంతకాలు చేసే ముందు, భారత్‌తో సహా అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన ప్రభుత్వాలు, అధికారులు అస్థిరమైన ప్రపంచ మార్కెట్ల పని తీరు, అభివృద్ధి చెందిన దేశాలలో ఇస్తున్న సబ్సిడీలు సాంకేతికపరమైన అంశాలు, వారనుపరించే అక్రమ విధానాలు తదితరాలపై వారి దేశాలలోని ఆర్థికవేత్తలు, నిపుణుల నుండి ఎలాంటి సలహాలను తీసుకోవటానికి ప్రయత్నం చేయలేదు."

దిగుమతి చేసుకొనేలా చేయటం, వెనుకబడిన దేశాలు తమ భూములను, ఇతర వనరులను ఎగుమతికి వుద్దేశించిన ప్రత్యేక పంటలను పండించేలా చేయటం ద్వారా అభివృద్ధి చెందిన దేశాలు స్వయంగా పండించలేని లేదా అవసరమైన మేరకు పండించలేని సరుకులతో వారి సూపర్ మార్కెట్‌లను నింపుతున్నాయి. తమ ప్రజల స్వీయ అవసరాలను విస్మరిస్తున్నాయి.

తమ దేశాల్లో వలస పాలన అంతరించాక, అనేక అభివృద్ధి చెందుత్ను దేశాల్లో ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీవంటి వ్యవస్థలను అక్కడి ప్రభుత్వాలే నిర్వహిస్తున్నాయి. తమ దేశాల్లోని పేదలకు ఆహార భద్రతకు కనీసంగానైనా భరోసాను కల్పిస్తున్నాయి. ప్రపంచ మార్కెట్ల ధరల్లోవచ్చే ఒడిదుడుకుల నుండి రక్షణ కల్పించేందుకు కూడా ఈ వ్యవస్థలు వుపకరిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఈ వ్యవస్థలను పెద్ద ఆటంకంగా భావిస్తున్నాయి. తమ వద్దవున్న మిగులు ఆహార ధాన్యాలను వదిలించుకోవాలన్న వారి లక్ష్యాలకు ఇవి అడ్డుగా వున్నాయి. అందుకే ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ ఆర్థిక సంస్థలు, అభివృద్ధి చెందిన దేశాలు ఈ వ్యవస్థలపై నిరంతరం దాడి చేస్తున్నాయి. ఫలితంగా అనేక దేశాలు ప్రభుత్వ రంగం ద్వారా ఆహార ధాన్యాల సేకరించి, నిలువచేసి, ప్రజలకు అందించటాన్ని నిలిపివేశాయి. ఫిలిపైన్స్ 1994లో ఈ విధానాలను వదులుకోగా, మరో దశాబ్దం తర్వాత బోట్స్వానా వదులుకున్నది. అందుకు తగిన మూల్యాన్ని వారు చెల్లించారు. రెండవ గల్ఫ్ యుద్ధం అనంతరం అమెరికా, యూరపులోని అభివృద్ధి చెందిన దేశాలు సింహభాగం ధాన్యాలను 'ఇథనాల్' వుత్పత్తికి వినియోగిస్తున్నాయి. అందుకే 2007 చివరి నుండి అంతర్జాతీయంగా ఆహార ధాన్యాల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. ఆహార వుత్పత్తుల దిగుమతులపై కొత్తగా ఆధారపడుతున్న పేద దేశాల్లో ఆకలి, పేదరికంతో పెరగటంతో 37 దేశాల్లో ఆహారం కోసం ఘర్షణలు జరిగాయి. భారతదేశంలో కూడా ప్రభుత్వ సేకరణ, ప్రజాపంపిణీ వ్యవస్థలను పూర్తిగా రద్దుచేయలేదు. కానీ ఈ ప్రక్రియలను గణనీయంగా బలహీనపరిచారు. ప్రపంచంలో ఆహారధాన్యాల రేట్లు అనూహ్యంగా పెరిగాక మాత్రమే, 2008 నుండి ఈ వ్యవస్థలను కొంతమేరకు పునరుద్ధరించారు.

**అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ధాన్యం మార్కెట్ల స్వాధీనం :**

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ధాన్యం మార్కెట్లను స్వాధీనం చేసుకునేందుకు, నూతన మార్కెట్లలోకి చొరబడేందుకు పారిశ్రామిక దేశాలు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. మాజీ సోవియట్ యూనియన్ ఆర్థికంగా చితికిపోయింది. 1990ల నుండి 1996 మధ్య కాలంలో అక్కడి ప్రజానీకం వినిమయ స్థాయి గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా అభివృద్ధి చెందిన దేశాలు ఎగుమతి మార్కెట్లను భారీగా కోల్పోయారు. అందుకే అంతర్జాతీయ వాణిజ్యంపై ఉరుగ్వేలో జరిగిన సమావేశాల్లో మొదటిసారిగా వ్యవసాయాన్ని చర్చనీయాంశంగా చేర్చారు. అక్కడ ఆమోదించిన వివక్షాపూరితమైన వ్యవసాయ ఒప్పందం (ఎఒఎ)పై భారతదేశం కూడా సంతకం చేసింది. 1994లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఏర్పాటయ్యాక ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. అభివృద్ధి చెందిన దేశాలు తమకు లాభసాటిగా వుండే విధంగా విదేశీ మార్కెట్లను స్వాధీనం చేసుకుంటున్నాయి. తమకు అనుకూలమైన నిబంధనలను వాటిపై రుద్దుతున్నాయి.

ఇటీవలి కాలంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ఆహారభద్రత సమస్యలను గురించి అంతర్జాతీయ వేదికలపైన గళం విప్పుతున్నాయి. అక్కడి ప్రభుత్వ సంస్థలు ఆహారధాన్యాలను నిల్వచేయటం, వాటి సరఫరాలో స్వల్ప సబ్సిడీలను ఇవ్వటంపై కూడా అభివృద్ధి చెందిన దేశాలు అభ్యంతరం చెబుతున్నాయి. అందుకు డబ్లుటిఒ ఒప్పందాలను సాకుగా చూపుతున్నాయి. ఇటీవల 2018 మేలో భారత్‌కు వ్యతిరేకంగా అమెరికా డబ్యుటివోకి ఫిర్యాదు చేసింది. వరి ఉత్పత్తి విలువలో 70 నుండి 80శాతం, గోధుమ వుత్పత్తి విలువలో 60 శాతం ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తున్నదని ఆరోపిస్తున్నది. మొత్తం వుత్పత్తి(అవుట్‌పుట్) విలువలో ప్రభుత్వమద్దతు 10శాతానికి మించరాదన్న వ్యవసాయ ఒప్పందంలోని షరతును ఇందుకు సాకుగా చూపుతున్నది. ఈ వాదనలోని అసంగతత్వాన్ని తర్వాత భాగంలో మనం పరిశీలిద్దాం. ప్రపంచ పెట్టుబడిదారి విధానానికి నాయకుడైన అమెరికా తన లక్ష్యాల సాధన కోసం ఈ విధంగా మోసపూరితమైన వాదనలను ముందుకు తెస్తున్నది.

అభివృద్ధి చెందిన దేశాలు మేధోపరంగా విశ్వసనీయతలేని పద్ధతిలో వ్యవసాయ ఒప్పందాన్ని (ఎఒఎ)తయారు చేశాయి. నిరుపేద దేశాల పంటలకు వాస్తవ వుత్పత్తి విలువలను ఇచ్చేందుకు మొదటి నుండి తిరస్కరిస్తున్నాయి. వాటి వాదనలకు ఎలాంటి విశ్వసనీయత లేదు. అందుకు కారణాలు దిగువ విధంగా వున్నాయి : వ్యవసాయ ఒప్పందం(ఎఒఎ)పై సంతకాలు చేసే ముందు, భారత్‌తో సహా అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన ప్రభుత్వాలు, అధికారులు అస్థిరమైన ప్రపంచ మార్కెట్ల పని తీరు, అభివృద్ధి చెందిన దేశాలలో ఇస్తున్న సబ్సిడీలు సాంకేతికపరమైన అంశాలు, వారనుపరించే అక్రమ విధానాలు తదితరాలపై వారి దేశాల లోని ఆర్థికవేత్తలు, నిపుణుల నుండి ఎలాంటి సలహాలను తీసుకోవటానికి ప్రయత్నం చేయ లేదు.వలసపాలన కాలపు స్వేచ్ఛా వాణిజ్య విధానాలపై అవగాహన లేని నేతలకు వారి దేశాలలోని ఆహార భద్రతకు ఏర్పడే ప్రమాదంపై కూడా అవగాహన లేకుండాపోయింది.

వ్యవసాయ ఒప్పందం(ఎఒఎ)లో పొందుపరచిన అంశాలన్నీ కేవలం అభివృద్ధి చెందిన దేశాలకు లబ్ది చేకూర్చేందుకే వుద్దేశించబడ్డాయి. వాటిలో రెండు ప్రధాన అంశాలను గురించి ఇక్కడ చర్చిద్దాం: ఒకటి. వ్యవసాయంలో స్వేచ్ఛా వాణిజ్యం, వాణిజ్యానికి వున్న ఆటంకాలను తొలగించటం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లోనే భారీస్థాయి ప్రభుత్వ సబ్సిడీలు కొనసాగుతున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు తమ రైతులకు ప్రత్యక్ష్యంగా నగదు బదిలీ చేయటం ద్వారా అత్యధిక సబ్సిడీలను ఇస్తున్నాయి. ఏ నిబంధనలకు లోబడకుండా దానిని ఎంతకైనా పెంచుకోగలవు. మరోవైపున


epaper.prajasakti.com

భారతదేశం, ఇతర దేశాలలో మద్దతు ధరలకు చెల్లించే మొత్తాలు "వాణిజ్యాన్ని వక్రీకరిస్తాయని" చెబుతూ వాటిని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉత్తరాదిలోని పారిశ్రామిక దేశాలు అనుసరిస్తున్న ఈ విధానం నిరంకుశమైనది, వారి స్వప్రయోజనాలను నెరవేర్చుకోవటం కోసం వుద్దేశించినది.

"1994లో అమెరికా ఆహార సబ్సిడీల మొత్తం 96 బిలియన్ డాలర్లు. కాగా అందులో 5వ వంతు, అంటే 19 బిలియన్ డాలర్లు మాత్రమే వ్యవసాయ ఒప్పందం(ఎఒఎ) నియమాలకు అనుగుణంగా కేటాయింపులు వున్నాయి. ఆ నియమావళి ప్రకారం, పై మొత్తంలో కోత పెట్టగల్గేది 4 బిలియన్ డాలర్లు మాత్రమే.ఆ విధంగా స్వల్ప మినహాయింపులతో అమెరికా, ఇతర పారిశ్రామిక దేశాలు ప్రపంచ మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని నిలుపుకుంటు న్నాయి."

వారి దేశాల్లోని మొత్తం శ్రామికులలో 5 శాతం మాత్రమే వ్యవసాయంపై ఆధారపడుతున్నారు కాబట్టి, జిడిపిలో 4 శాతం మాత్రమే వ్యవసాయం నుండి వస్తుంది కాబట్టి వ్యవసాయ సబ్సిడీలను తగ్గించటం వారికి సులభం. అమెరికా లో ఈ శాతం మరీ తక్కువ. తమకున్న కొన్ని లక్షల మంది రైతులకు మొత్తం వ్యవసాయోత్పత్తిలో 50 శాతాన్ని అమెరికా సబ్సిడీగా చెల్లిస్తున్నది. అది దాని జిడిపిలో 2 శాతం, బడ్జెట్‌లో 8 శాతం ఉంటుంది. అందువలననే డబ్ల్యుటిఒ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలలో తన సబ్సిడీలను తగ్గిస్తానని అమెరికా ఒప్పందంలో అంగీకరించినప్పటికీ వాస్తవంలో తగ్గించిలేదు. వివిధ రకాల పద్దుల కింద తన సబ్సిడీలను కొనసాగిస్తున్నది. ఆర్థిక సహకారం మరియు అభివృద్ధి సంస్థ(ఒఇసిడి) సమాచారం ప్రకారం, అమెరికాలో 46 ప్రత్యేక పద్దుల కింద వ్యవసాయ సబ్సిడీలను అందిస్తున్నారు. అందులో పంటలవారీ మద్దతు ధరల పేరిట కేటాయిస్తున్నది అతి స్వల్ప మొత్తమే. 1994లో అమెరికా ఆహార సబ్సిడీల మొత్తం 96 బిలియన్ డాలర్లు. కాగా అందులో 5వ వంతు, అంటే 19 బిలియన్ డాలర్లు మాత్రమే వ్యవసాయ ఒప్పందం(ఎఒఎ) నియమాలకు అనుగుణంగా కేటాయింపులు వున్నాయి. ఆ నియమావళి ప్రకారం, పై మొత్తంలో కోత పెట్టగల్గేది 4 బిలియన్ డాలర్లు మాత్రమే.ఆ విధంగా స్వల్ప మినహాయింపులతో అమెరికా, ఇతర పారిశ్రామిక దేశాలు ప్రపంచ మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని నిలుపుకుంటున్నాయి. వ్యవసాయ ప్రధానమైన అభివృద్ధి చెందుతున్న పేద దేశాల శ్రామికుల్లో మూడింట రెండు వంతులు వ్యవసాయంలో వుపాధి పొందుతున్నారు. ఆ మేరకు ఈ దేశాల జిడిపిలో వ్యవసాయం వాటా గణనీయంగా వుంది. అందుకే పై దేశాలు తమ రైతులకు అర్థవంతమైన, పాలనాపరమైన స్థాయిలో 'ప్రత్యక్షంగా నగదు బదిలీ' చేయగల వ్యవస్థలను నిర్వహించగల స్థితిలో లేవు.

ఉదాహరణకు భారతదేశంలోని 10 కోట్ల వ్యవసాయ కుటుంబాల్లో పై స్థాయిలోని ఐదు శాతం కుటుంబాలు మాత్రమే ఆర్థికంగా మెరుగ్గా వున్నాయి. నయా వుదారవాద ప్రభావంతో నేడు మన దేశపు జిడిపిలో వ్యవసాయం వాటా 16 శాతానికి పడిపోయింది. 25 సంవత్సరాల క్రితం అది 33 శాతంగా వుండేది. అమెరికా వలె వ్యవసాయ వుత్పత్తుల విలువలో సగభాగం, అంటే జిడిపిలో 8 శాతం సబ్సిడిగా ఇవ్వటం అంటే వార్షిక బట్‌లో 80 శాతం వ్యవసాయ సబ్సిడీలకే కేటాయించాలి. ఈ విధంగా చేయటం అసంభవం. తమ వ్యవసాయోత్పత్తుల విలువతో పోల్చుకున్నపుడు యూరోపియన్ దేశాలు, జపాన్ అమెరికా కన్నా ఎక్కువ శాతం సబ్సిడీలను ఇస్తున్నాయి. తమ స్వప్రయోజనాలకు అనుగుణంగా, ఈ సబ్సిడీలను వ్యాపారేతర అవరోధాల(నాన్ ట్రేడ్ డిస్టార్టింగ్ )విభాగంలో చేర్చుకున్నారు. కానీ వ్యవసాయ ఒప్పందంలో వాటిని తగ్గించేందుకు వీలులేని అంశాలుగా పేర్కొన్నారు. ప్రధాన పంటల వుత్పత్తి వ్యయం వెనుకబడిన దేశాల్లో దేశాల్లోకంటే అభివృద్ధి చెందిన దేశాల్లో చాలా ఎక్కువగా వుంది. అమెరికా, యూరపు దేశాల రైతులకు భారీ సబ్సిడీల అండ లేకుంటే అభివృద్ధి చెందుతున్న దేశాల వుత్పత్తిదారుల కంటే వెనుకబడిపోయేవారే.

ప్రజలలో ప్రచారం చేస్తున్నదానికి భిన్నంగా వెనుకబడిన దేశాలలో కన్నా అభివృద్ధి చెందిన దేశాలలో ప్రధాన వ్యవసాయోత్పత్తుల ఉత్పత్తి ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. ఉత్పత్తిలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ శిలాజ ఇంధనాల ను ఎక్కువగా వాడటంతో ఖర్చు ఎక్కువ అవుతు న్నది. ప్రభుత్వాల భారీస్థాయి డబ్బు మద్దతు లేకపోతే అంతర్జాతీయ మార్కెట్‌లో పేదదేశాల రైతులు చేసే ఉత్పత్తుల ధరలతో వారు పోటి పడలేరు. ధనికదేశాలలోని రైతుల జీవన ప్రమాణాలు వెనుకబడిన దేశాలలోని రైతుల కన్నా తక్కువగా ఉన్నాయి కాబట్టి వారి జీవన ప్రమాణాలను పెంచుకోవటం కోసం వారికి ఎక్కువ సబ్సిడిలు ఇస్తున్నారనే వాదన కూడా సరికాదు. అంతర్జాతీయ మార్కెట్‌లోని ధరలతో పోల్చు కున్నపుడు అమెరికాలో గత అనేక సంవత్సరాల నుండి వరితో పాటుగా అనేక పంటలు వాటి ఉత్పత్తి కోసం పెట్టిన ఖర్చుకన్నా ఏ మాత్రం ఎక్కువ విలువను ఇవ్వటం లేదన్న విషయాన్ని ఈ వాదనలు పక్కనపెట్టలేవు. వాటి ఉత్పత్తి కోసం ఖర్చుపెట్టిన ఉపకరణాలు, యం త్రాల అరుగుదల మేరకు కూడా విలువ రాలేదు. ఇక కూలి, రైతుల ఆదాయం గురించి ఆలో చించే ప్రసక్తేలేదు.

### ధరల నిర్ణయంలో మోసం

వ్యవసాయ ఒప్పందం(ఎఒఎ)లో రెండవ మోసపూరితమైన అంశాన్ని పరిశీలిద్దాం. 1986-88 మధ్యకాలంలోని స్థిరమైన వ్యవసాయ వుత్పత్తుల ధరలను ప్రాతిపదికగా తీసుకొని ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఆ దేశాలు ఎంతమేరకు వ్యవసాయానికి మద్దతు ఇవ్వవచ్చో, సబ్సిడీలను రద్దుచేయాలో నిర్ణయించాలని పేర్కొన్నారు. దాని నియమావళికి లోబడి ప్రపంచ దేశాలు, తమ దేశాల్లో వ్యవసాయ వుత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించాలి. ఇవి వ్యవసాయ ఒప్పందం జరగటానికి ఆరు సంవత్సరాల ముందు ధరలు కాగా, ఇప్పటికి 30 సంవత్సరాలు అయినా అవే ధరల ప్రాతిపదికను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కాలంలో వ్యవసాయ వుత్పాదకాల (ఎరువులు, పురుగు మందులు వగైరాలు) ధరలు కనీసం 10 రెట్లు పెరిగాయి. కాబట్టి ఆ కాలంలో నిర్ణయించిన వ్యవసాయ వుత్పత్తుల మద్దతు ధరల కంటే ఎక్కువగా నిర్ణయించాల్సి ఉండగా మద్దతుధరలలో ఎలాంటి మార్పు జరుగకూడదని చెబుతున్నారు. అమెరికా మరొక విచిత్రమైన పద్ధతిని అవలంబిస్తున్నది. మనదేశంలో పండిన వరి, గోధుమలు మొత్తం 25.3 కోట్ల టన్నుల మొత్తాన్ని సేకరించాలని ప్రభుత్వం ఎప్పుడూ భావించలేదు. అయినప్పటికీ ప్రభుత్వం సేకరించిన మొత్తాన్ని కాక, పండిన పంట మొత్తాన్ని సేకరించినట్లుగా, దానంతటికీ మద్దతు ధరలను ఇస్తున్నట్లుగా అమెరికా


epaper.prajasakti.com

> **“ మూడు దశాబ్దాలనాటి “అంతర్జాతీయ మార్కెట్‌లోని పాత ధరలను” పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆ ధరలను మూడు దశాబ్దాల నాటి పేద దేశాల “స్థానిక కరెన్సీ విలువ”తో గుణించి, వర్తమాన గిట్టుబాటు ధరల స్థాయిని నిర్ణయిస్తున్నారు. అమెరికా డాలరు విలువ పెరుగుదల, పెరిగిన పెట్టుబడు లను పరిగణనలోకి తీసుకోవాలన్న అభివృద్ధి చెందుతున్న దేశాల రైతుల విన్నపాలను పెడచెవిన పెడుతున్నారు.”**

లెక్కిస్తున్నది. అమెరికా అనుసరిస్తున్న మోసపూరి తమైన పద్ధతులలో ఇది ఒకటి. ఈ క్రమంలో రైతుల సొంత వినిమయాన్ని, విత్తనాలు, పశు దాణా అవసరాలు తదితరాల కోసం తమ వద్దఉంచుకొనే మొత్తాలను కూడా విస్మరిస్తున్నది.

భారత్‌లో గోధుమల మద్దతు ధరలను లెక్క కట్టడంలో కూడా అమెరికా మోసపూరిత విధా నాన్నే అవలంబిస్తున్నది. 2013-14లో మన దేశంలో కొన్ని రాష్ట్రాలు గోధుమలకు కనీస మద్దతు ధరగా సగటున క్వింటాలుకు రు.1386 ప్రకటించాయి. 1986-88నాటి ప్రపంచ మార్కెట్ ధరను గోధుమలకు డాలర్లలో (రు. 354లుగా)నిర్ణయించారు. ఆ ధరను భారత్‌లో ప్రకటించిన మద్దతు ధరతో పోల్చి చూస్తున్నారు. (నాడు ఒక డాలరు విలువ రు.12.50లుగా వుంది). పై రెండు ధరలకు మధ్య తేడా రు. 1032లు. వ్యవసాయ ఒప్పందాన్ని వుల్లం ఘించి భారతదేశం ఈ మొత్తాన్ని అదనంగా చెల్లిస్తున్నట్లు అమెరికా, సంపన్నదేశాలు ఆరోపిస్తున్నాయి. గత 30 సంవత్సరాలుగా మన దేశంలో పంటల వుత్పత్తి వ్యయం, మార కం విలువలు స్థిరంగా వున్నట్లు వారు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి 2013-14లో బోనస్‌తో కలిపి గోధుమలకు మన ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రు.1386. ఉత్పత్తి వ్యయంతో పోల్చితే ఈ మొత్తం చాలా తక్కువగా వుంది. రైతుకు ఏమాత్రం మిగిలేది లేదు. ఫలితంగా రైతాంగం తీవ్ర ఆర్థిక ఇబ్బం దులకు గురౌతున్నారు. మెరుగైన గిట్టుబాటు ధరల కోసం నేటికీ రైతాంగం ఆందోళనలు కొనసాగుతున్నాయి. 2013-14లో వాస్తవంగా ప్రపంచ మార్కెట్‌లో గోధుమ ధర క్వింటాలుకు 32డాలర్లు- రు.1936-గా వుంది. నాటి రూపాయి మారకం విలువ రు. 60.50లు. అంటే 1986-88తో పోల్చితే డాలరు మారకం విలువ ఐదు రెట్లు పెరిగింది. అందువలన మనదేశంలోని మద్దతు ధర రు.1386ను అంతర్జాతీయ ధరలతో పోల్చుకుంటే మన దేశంలో అంతర్గతంగా గోధుమల ధర రు.550 తక్కువగా ఉన్నది. అది ప్రస్తుత ‘బయట నిర్ణయించబడిన’ ధరకంటే చాలా తక్కువగా వుంది. ఈ విధంగా లెక్కిస్తే అనేక సంవత్స రాలు ఇక్కడ ప్రభుత్వ మద్దతు ధర చాలా ప్రతికూలంగా వున్నట్లు అర్థమౌతున్నది. ఈ విధంగానే లెక్కిస్తే ధాన్యం మద్దతు ధర కూడా ఒప్పందంలో అనుమతించిన 10శాతం ప్రభుత్వ మద్దతు కంటే తక్కువగానే నిర్ణయించ బడుతున్నది.

వర్తమాన మద్దతు ధరలను లెక్కించటంలో సంపన్న దేశాలు ఒక మోసపూరిత విధానాన్ని అవలంబిస్తున్నాయి. మూడు దశాబ్దాలనాటి “అంతర్జాతీయ మార్కెట్‌లోని పాత ధరలను” పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆ ధరలను మూడు దశాబ్దాల నాటి పేద దేశాల “స్థానిక కరెన్సీ విలువ”తో గుణించి, వర్తమాన గిట్టుబాటు ధరల స్థాయిని నిర్ణయిస్తున్నారు. అమెరికా డాలరు విలువ పెరుగుదల, పెరిగిన పెట్టుబడు లను పరిగణనలోకి తీసుకోవాలన్న అభివృద్ధి చెందుతున్న దేశాల రైతుల విన్నపాలను పెడచెవిన పెడుతున్నారు.

ఇక్కడ రెండు ప్రశ్నలు వస్తున్నాయి : ఒకటి. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ గత మూడు దశాబ్దాలుగా ధాన్యం వుత్పత్తి వ్యయం పెరిగి వుంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల రైతాంగం కోరుతున్నట్లు పెరిగిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని మద్దతు ధరను లెక్కించ టం వారికి కూడా అనుకూలమైన అంశమే కదా? రెండు. అభివృద్ధి చెందుతున్నదేశాలు, ధరల నిర్ణయంలో 1986-88 కాలాన్నే ప్రాతి పదికగా వుండాలని ఎందుకు మంకుపట్టు పడుతున్నాయి?

మొదటి ప్రశ్నకు సమాధానం మన అందరికే తెల్సిందే. మద్దతు ధరలు నిర్ణయించటంలో ఏ పద్ధతి అవలంబించినా అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు ఎలాంటి నష్టమూ లేదు. అక్కడ మద్దతు ధరలతో నిమిత్తం లేకుండానే దజన్లకొద్దీ నగదు బదిలీ పథకాలు అమలౌతున్నాయి. అవి వ్యాపారాలను వక్రీకర ణలకు దారితీయవని, వాటిని తగ్గించటం సాధ్యపడదని చెబుతున్నారు. వాటినే వ్యవసాయ ఒప్పందంలోపచ్చపెట్టె (గ్రీన్ బాక్సు)లు, బులుగు పెట్టె(బ్లూ బాక్సు)లు” అంటూ పిలుస్తున్నారు. దాని పేరు, రంగుతో నిమిత్తం లేకుండా సబ్సిడీ అంటే సబ్సిడీనే అని చెప్పవలసి ఉంది.

1980-86 మధ్య కాలంలో అభివృద్ధి చెందిన దేశాల్లో గరిష్టస్థాయిలో ధాన్యం ధరలు పెరుగుతుండగా, ప్రపంచ మార్కెట్‌లో ధాన్యం ధరలు పడిపోసాగాయి. గోధుమ, మొక్కజొన్న ధరలు 25-33శాతానికి, బియ్యం ధరలు సగా నికి తగ్గిపోయాయి. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని పారిశ్రామిక దేశాలు ధాన్యంపై సబ్సిడీలను గణనీయంగా పెంచేశాయి. యూరోపియన్ కమిషన్‌లోని 10 దేశాలు కూడా వ్యవసాయ వుత్పత్తులపై సబ్సిడీలను భారీ స్థాయిలోనే పెంచారు. కెనడాలో ఈ పెంపుదల 15 నుండి 54 శాతానికి చేరింది. అమెరికాలో కూడా ఆ పెరుగుదల 9 నుండి 45 శాతంగా వుంది. జపాన్‌లో ఆపాటికే 77శాతంగా వున్న సబ్సిడీలను తమ మొత్తం వుత్పత్తులపైన 99 శాతంగా పెంచేశారు. ఒక వైపున అన్ని దేశాల్లో వుత్పత్తి వ్యయం పెరిగిపోతున్నది. వేరొక వైపున వుత్పత్తి వ్యయాల పెరుగుదలకు మించిన వేగంతో సబ్సిడీలను పెంచేస్తున్నారు. కానీ పేద దేశాలు ఇస్తున్న సబ్సిడీలలో 13 శాతం తగ్గించాలని, తాము 20 శాతం మాత్రమే తగ్గిస్తామని ఆంక్షలు విధిస్తున్నారు. కానీ 1986కు ముందు ఆరు సంవత్సరాలలో తమ సబ్సిడీలను 500 శాతం వరకూ పెంచుకున్న అమెరికాలో వ్యవసాయ సబ్సిడీల్లో 20 శాతం తగ్గింపు పెద్ద విశేషంకాదు.

భారత్‌లో ప్రకటిస్తున్న మద్దతు ధరల నిర్ణాయక పద్ధతిని వ్యతిరేకిస్తూ అమెరికా డబ్ల్యుటిఒకు ఫిర్యాదు చేసింది. అమెరికా లెక్కల ప్రకారం 2010 ఆరంభం నుండి 2014 ఆఖరు వరకు భారత్‌లో ధాన్యానికి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు దాని వుత్పత్తి వ్యయంలో 74-84 శాతం, గోధుమకు 60- 69 శాతం వరకు వుంది. కానీ భారత్ ప్రభుత్వం లెక్కలు పై అంకెలకు భిన్నంగా వున్నాయి. ధాన్యం వుత్పత్తి వ్యయంలో మార్కెట్ ధరలకు ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర విలువ 5- 7.7శాతానికే పరిమితమయింది. గోధుమలకు సంబంధించి


epaper.prajasakti.com

నాలుగులో మూడు సంవత్సరాల్లో పెరుగుదల లేకపోగా గతం కంటే తగ్గిపోయింది, మిగిలిన ఒక్క సంవత్సరంలో మాత్రమే దాని వుత్పత్తి విలువలో ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర విలువ కేవలం 0.48 శాతంగా వుంది. వాస్తవానికి పై రెండు అంచనాల మధ్య తేడా అంత తీవ్రంగా వుండనవసరం లేదు. ఈ కాలంలో అమెరికా డాలరుతో పోల్చినపుడు రూపాయి విలువ రు 12.5 నుండి రు. 60.5కు దిగజారి పోవటమే అందుకు కారణం.

ఆ కాలంలో(1986-88) వాస్తవానికి భారత్‌లో గోధుమలకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రు. 175 మాత్రమే. అది ప్రపంచ మార్కెట్ ధర(రు. 350లు) లో సగం మాత్రమే. ఈ ధరల స్థాయి 2014 వరకూ అలాగే కొనసాగింది. ఈ కాలంలో పంటల ఉత్పత్తి ఖర్చు, కరెన్సి విలువలో ఏ మార్పూ లేదన్న చందంగా అమెరికా వ్యవహరిస్తున్నది.

అమెరికా తన ధాన్యం ఉత్పత్తి 16 కోట్ల టన్నులు, గోధుమలు 9.55 కోట్ల టన్నులు అంతటినీ 'సబ్సిడీకి అర్హమైన వుత్పత్తి'గా నిర్ణయిస్తుంది. కానీ భారతదేశంలో ప్రభుత్వ సంస్థలు సేకరిస్తున్న ధాన్యం పరిమాణం అమెరికా సేకరిస్తున్నదానిలో నాల్గవ వంతుగానే వుంటుంది. ఇక్కడ వుత్పత్తి అయ్యే ధాన్యంలో 35 శాతమే అమ్ముకుంటున్నట్లు అంచనా వేశారు. ఇక్కడి రైతులు పండించిన ధాన్యంలో తమ కుటుంబ వినిమయానికి, విత్తన అవసరాలకు, తమ పశువుల దాణాకు, కూలీల తిండికి, వారి కూలి చెల్లింపులకు అవసరమైన మోతాదులో తమ వద్ద నిల్వ వుంచుకుంటారు. మిగిలిన ధాన్యాన్నే అమ్ముకుంటారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాధారణంగా రైతులు, గిరిజన రైతులు వ్యవసాయం చేస్తారు. కానీ అమెరికా, యూరపు దేశాల్లో భారీ వాణిజ్య సంస్థలు పారిశ్రామిక ప్రాతిపదికపై ధాన్యం పండిస్తారు. పండిన ధాన్యమంతటినీ అమ్మేస్తారు.

కానీ ఇటీవల భారత్ ఆహార ధాన్యాలను పెద్దయెత్తున ఎగుమతి చేయటం పట్ల అమెరికా వుక్రోషం పట్టలేక పోతున్నది. భారత ప్రభుత్వం మీద అమెరికా పాలకులు స్వయంగానూ, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ద్వారానూ ఎగుమతులను ఆపేయాలని నిరంతరం వత్తిడి చేస్తున్నారు. ఫలితంగా బడ్జెట్ కేటాయింపుల్లో, అభివృద్ధికి వుద్దేశించిన ప్రభుత్వ పెట్టుబడులపై ఆంక్షలు విధిస్తున్నారు. ద్రవ్యలోటు లక్ష్యాలను క్రమంగా కుదించివేస్తున్నారు. ఆ ద్రవ్య కుదింపుల వల్ల, ప్రతి ద్రవ్యోల్బణంతో ప్రజల ఆదాయాలు తగ్గుతున్నాయి. నిరుద్యోగం పెరుగుతున్నది. సగటు మార్కెట్ గిరాకీ తరిగిపోతున్నది. ప్రజల తలసరి సగటు ఆహారధాన్యాల వినిమయం తగ్గుతున్నది.

**“కానీ ఇటీవల భారత్ ఆహార ధాన్యాలను పెద్ద యెత్తున ఎగుమతి చేయటం పట్ల అమెరికా ఉక్రోషం పట్ట లేక పోతున్నది. భారత ప్రభుత్వం మీద అమెరికా పాలకులు స్వయంగానూ, అంతర్జాతీయ ద్రవ్యసంస్థల ద్వారానూ ఎగుమతులను ఆపేయాలని నిరంతరం వత్తిడి చేస్తున్నారు. ఫలితంగా బడ్జెట్ కేటాయింపుల్లో, అభివృద్ధికి వుద్దేశించిన ప్రభుత్వ పెట్టుబడులపై ఆంక్షలు విధిస్తున్నారు. ద్రవ్యలోటు లక్ష్యాలను క్రమంగా కుదించివేస్తున్నారు.”**



అమెరికాలో గోధుమలు పండిస్తున్న విస్తారమైన వ్యవసాయ క్షేత్రం

మన దేశం నుండి ధాన్యం ఎగుమతులు ఎలా సాధ్యమౌతున్నాయి? ఇక్కడ జాతీయ అవసరాలన్నీ తీరి, ఇబ్బడి ముబ్బడిగా ధాన్యం మిగలటం వల్ల మాత్రం కాదు. సాధారణ ప్రజల ఆకలి కడుపులను మాడ్చటం ద్వారానే ఎగుమతులకు అవకాశం కల్గుతున్నది. ప్రజలకు తలసరి ఆహారధాన్యాల లభ్యత, పౌష్టిక ఆహార విలువలు తగ్గిపోతున్నట్లు జాతీయ శాంపుల్ సర్వే(యన్‌యస్‌యస్)నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ఐక్యరాజ్యసమితి “ఆహార, వ్యవసాయ సంస్థ” నివేదిక ప్రకారం పలు దేశాల్లోని పంటల వార్షిక సరఫరా, వినిమయం ఇలా వున్నాయి : అమెరికాలో తలసరి ముతక ధాన్యాల వార్షిక వినిమయం 1033 కిలోలు. అందులో 550 కిలోలను ప్రజలు నేరుగా ఆహారంగా వినియోగిస్తున్నారు. కొంత భాగం పశువుల దాణా వుత్పత్తుల తయారీకి, మిగిలిన ధాన్యాన్ని 'ఇథనాల్' తయారీకి వాడుతున్నారు. భారత్‌లో పరిస్థితులు అందుకు భిన్నంగా వున్నాయి. ఇక్కడ ముతక ధాన్యాల తలసరి వార్షిక వినియోగం176 కిలోలు. ఇది ప్రపంచంలోనే అత్యల్ప వినిమయంగా వుంది.( అత్యంత వెనుకబడిన దేశాల వినిమయం 212 కిలోలు వున్నట్లు నివేదికలు తెల్పుతున్నాయి). అంటే అమెరికాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆహారం రూపంలో తలసరి వినియోగిస్తున్న ధాన్యంలో మూడవ వంతు మాత్రమే మనం వినియోగిస్తున్నాం. అమెరికాలో మన కంటే అధికంగా 40 రెట్లు ధాన్యాన్ని పశువుల దాణా కోసం వినియోగిస్తున్నారు. ప్రపంచంలో బాగా తినటంలో అమెరికా ప్రజలు ముందుంటారు. కానీ తీవ్ర ఆహార కొరతతో అల్లాడుతున్న మన ప్రజల కనీస ఆహార అవసరాలు తీర్చేందుకు వుద్దేశించిన ప్రజా పంపిణీ వ్యవస్థను కూల్చటంపై అమెరికా గురిపెట్టింది. మన దేశంలో ప్రభుత్వ సంస్థల ద్వారా ఆహారధాన్యాల సేకరణను అమెరికా తీవ్రంగా వ్యతిరేకించటం ఆందోళనకరం. భారత్ వ్యతిరేక వైఖరితో అమెరికా వితండ వాదనలు చేస్తున్నది. ఆహారధాన్యాల సేకరణలో నమ్మదగని లెక్కలు చూపుతున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ) అమెరికా కుయుక్తులకు తలొగ్గినట్లయితే ప్రజల మంచికోసం డబ్లుటిఒ నుండి మనం బైటకురావాలి. అమెరికా ప్రకటించిన రక్షణవాద విధానాలతో డబ్లుటిఒ మనుగడే ప్రశ్నార్థకమౌతున్నది.


**(అనువాదం: వై సిద్ధయ్య)**



epaper.prajasakti.com

# భారత ప్రజలపై కోవిడ్-19 ప్రభావం

**పి సాయినాథ్**



రచయిత ప్రముఖ పాత్రికేయులు

**జూన్ 1న జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో పి. సాయినాథ్‌గారు చేసిన ప్రసంగాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం - సంపాదకుడు**

కోవిడ్ నేపథ్యంలో మనం ప్రజల జీవనోపాధి, వ్యవసాయరంగం గురించి పరిశీలిద్దాం. మనం మొదటిసారి లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు రాబోయే పరిస్థితులపై మనకు ఒక ఆలోచన కానీ, ఒక అంచనా కానీ లేవు. ప్రత్యేకించి మార్చి 26, ఏప్రిల్ 30 మధ్య ఏమి జరిగిందనే దానిపై ఎవరికీ ఒక అంచనా లేదు. మే 1 నుండి మాత్రమే ప్రభుత్వాలు అధికారికంగా కొంత స్పష్టంగా జోక్యం చేసుకున్నాయి. అనేక జిల్లాల్లో స్థానిక జిల్లా అధికార యంత్రాంగం అనధికారికంగా అక్కడి ఎన్‌జిఓలూ, పౌర సంఘాలు మొదలైన వాటితో కలిసి సహాయ కార్యక్రమాలు నిర్వహించాయి. కేరళ దీనికి మినహాయింపుగా ఉంది. కేరళ ప్రభుత్వం లాక్‌డౌన్ కంటే ముందు నుంచే అప్రమత్తంగా ఉంటూ వచ్చింది. మే 1 నుంచి మాత్రమే మనకు బస్సులు, రైళ్ళకు సంబంధించిన వివరాలు తెలిశాయి. మార్చి 31న కేంద్ర హోం సెక్రెటరీ ఇచ్చిన ప్రకటనలో మార్చి 31న 11 గంటల నుంచి ఎవరూ రోడ్లపై లేరని చెప్పారు. దీనినే సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ తిరిగి చెప్తూ ఎవరూ రోడ్లపై ఉండరాదని తాను రాష్ట్రాలను ఆదేశించినట్లు చెప్పారు. ఎవరైనా రోడ్లపై ఉంటే వారిని అందుబాటులో ఉన్న సహాయ శిబిరాలకు పంపుతున్నామని చెప్పారు. ఏప్రిల్ 12 నాటికి ఆశ్రయాలలో వున్న వారిలో 69 శాతం మంది కేరళలోనే ఉన్నారు. కానీ మార్చి 31న కేంద్ర ప్రభుత్వం రోడ్లపై ఎవరూ లేరని కోర్టులో అధికారికంగానే చెప్పింది. ఆ తరువాత 12 రోజులకు వెలువరించిన ఒక అఫిడవిట్‌లో పది లక్షల కంటే ఎక్కువ మంది ప్రజలు సహాయ శిబిరాలలో వున్నారనీ, వారిని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామనీ, దేశవ్యాప్తంగా ఏర్పాటుచేసిన ఆహార కేంద్రాలకు ఆకలితో ఉన్న ఒకటిన్నర కోట్లకు పైగా ప్రజలు వస్తున్నారని తెలిపింది. 12 రోజుల క్రితం ఇదే హోం సెక్రెటరీ, ఇదే సొలిసిటర్ జనరల్ రోడ్లపై ఎవరూలేరని చెప్పడం విడ్డూరంగా ఉంది! వీరు చెప్పిన మాటలు గిన్నిస్ బుక్‌లో నమోదు చేయాల్సిన విధంగా ఉన్నాయి! కాబట్టి మనకు నిజంగా సరైన అంచనా లేదు. ఏప్రిల్ నెలలో ప్రజలు పెద్దఎత్తున ప్రవాహాలుగా కదిలారు. తరువాత మే 28న ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం మే 1న శ్రామిక్ రైళ్ళు మొదలైన తరువాత 91 లక్షల మంది ప్రజలు ప్రయాణం చేశారని తేల్చారు. కానీ, మార్చి 28 నుంచి ఏప్రిల్ 30 మధ్యలో ఏదో విధంగా తమ ఇండ్లకు చేరుకునేందుకు ఎంతమంది ప్రజలు రోడ్లపై నడిచారనే విషయంపై ఎవరికీ అంచనా లేదు.

దేశంలో అతి ముఖ్యమైన, పురాతనమైన నాగ్‌పూర్ రైల్వే జంక్షన్ నుంచి అపరిమితమైన సంఖ్యలో ప్రజలు ఉత్తరాది వైపు తరలి వెళ్ళారు. ఈ నాగ్‌పూర్ ద్వారా అనేక రాష్ట్రాలకు తరలి వెళ్ళిన జనసందోహాన్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌ఘడ్‌లకే కాక తూర్పున వున్న ఒరిస్సా, బెంగాల్‌లకూ పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపై నడిచివెళ్ళారు. అదే సమయంలో బొంబాయిలో కూడా విదర్భ నుంచి వెళ్ళేవారు, విదర్భకు వచ్చే వారు పెద్ద సంఖ్యలో కదిలారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి ఒక్క చంద్రపూర్ జిల్లాకే 37వేల మంది ప్రజలు తిరిగి వచ్చారు. అదేవిధంగా గోందియా జిల్లాకు చెందిన ప్రజలు చెన్నైలాంటి ప్రాంతాల నుంచి 17, 18 రోజుల పాటు నడిచి వచ్చారు. ఇది ఎందుకు చెప్తున్నానంటే మనకు నిజంగా ప్రజల కదలికలపై అంచనా లేదు. లాక్‌డౌన్ ప్రకటించినప్పటి నుంచి ఈ లాక్‌డౌన్ మొత్తం కాలంలో ప్రజల కదలికలపై ఏ మాత్రం అంచనా లేదు. వీరంతా వారి స్వగ్రామాలకు వెళ్ళే ప్రయత్నం చేశారు. కానీ ఎంతమంది క్షేమంగా వారి ఊళ్ళకు చేరుకున్నారు? వచ్చే వారికి వైరస్ ఉందేమోననే భయంతో చాలా గ్రామాల సరిహద్దుల వద్ద గ్రామస్థులు కంచెలు వేశారు. దీనిపై కూడా మనకు అంచనా లేదు. ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్న వారు కూడా లక్షల్లో ఉంటారు. ఇటువంటి వారు తమ గ్రామాల బయట 45 డిగ్రీల విపరీతమైన ఎండలో ఆరు బయట గడిపారు. తమను గ్రామస్థులు ఎప్పుడు ఊళ్ళోకి రానిస్తారా అని ఎదురు చూశారు. క్వారంటైన్ సమయం 14 రోజులు ఉంటుందో లేక 28 రోజులు ఉంటుందో ఎవరికీ తెలియదు. కాబట్టి ఈ పరిస్థితుల్లో కోవిడ్ మృతుల కంటే కోవిడ్ కాని సమస్యలతోనే ఎక్కువమంది చనిపోతారని నిర్మలాసీతారామన్ ప్యాకేజి ప్రకటించిన వెంటనే నేను చెప్పాను.

ఏప్రిల్ నెలలోమిరపతోటలలో పనిచేస్తున్న మోరియా ఆదివాసీ తెగలకు చెందిన జమలో అనే బాలిక తెలంగాణ నుంచి తన స్వస్థలమైన ఛత్తీస్‌ఘడ్‌కు మూడు రోజుల పాటు 140 కిలో మీటర్లు నడిచింది. ఇది చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. నేను ఒక మంచి వాకర్‌ని అని నేనను కుంటున్నాను. కానీ నేను ఎప్పుడూ అంతదూరం నడిచే కల కూడా కానలేదు. కానీ ఆ బాలిక మూడు రోజులలో 140 కిలో మీటర్లు నడిచింది. ఇంకొక 60 కిలోమీటర్లు నడిస్తే తన ఇంటికి చేరి తన తల్లిదండ్రులను కలిసేది. కానీ తీవ్రమైన నిస్సత్తువతో, అలసటతో ఆమె చనిపోయింది. ఆమె ఇంకొంత మంది కూలీలతో కలిసి పని కోసం వలస వచ్చింది. ఆమె తల్లిదండ్రులు ఆమెతో తెలంగాణకు వెళ్ళలేదు.

మే 17న హోం మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకూ, కేంద్ర పాలిత ప్రాంతాలకూ కొన్ని



epaper.prajasakti.com

> "జనగణనలో వలసలను సరిగా గుర్తించడం లేదు. ఉదాహ రణకు ఒక వ్యక్తి 'ఎ' అనే నగరం నుంచి 'బి' అనే నగరానికి వచ్చాడనుకోండి, ఆ 'బి' అనే నగరంలో ఆ వ్యక్తి కనీసం 6 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నివసిస్తేనే అతనిని వలస వచ్చిన వ్యక్తిగా జనాభా పట్టికలో నమోదు చేస్తారు. కొంతమంది వారిని యదేచ్ఛగా సంచరించే కార్మికులు (ఫుట్‌లూజ్ కార్మికులు) అని పిలుస్తారు."



సామాన్లు నెత్తిన పెట్టుకొని భార్యాబిడ్డలతో కాలినడకన స్వగ్రామాలకు ప్రయాణమైన వలస కార్మికులు

ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల ప్రకారం అత్యవసర సర్వీసులకు సంబంధించిన వారు మినహా ఎవ్వరూ రాత్రి 7గంటల నుంచి ఉదయం 7 గంటల వరకూ బయట కనిపించ రాదని కర్ఫ్యూ ప్రకటించారు. హైవేలపైన నడుస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం అత్యవసరమైనవిగా వారికి కనిపించ లేదు. దీనిద్వారా హైవేలపైనున్న లక్షల మంది ప్రజలకు ఈ నిబంధనలు వర్తింపచేశారు. దీనితో మే 17 నుండి ప్రజలు తీవ్రమైన వేసవి కాలంలో వేడి ఎక్కువగా ఉండే సమయంలో ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ నడిచారు. ఇటువంటి నిర్దాక్షిణ్యమైన ధోరణి ఏ స్థాయిలో ఉందో దీని ద్వారా మనకు తెలుస్తోంది. మనం తెలుసుకోవలసిన ఇంకొక విషయమేమిటంటే ముంబయి మహానగరాన్ని లక్షలాది మంది విడిచి వెళ్ళడమనేది ఇది మొదటిసారి కాదు. 1896-1897 మధ్య కాలంలో మనం బైబానిక్ ప్లేగ్ వ్యాధిని చూశాం. అప్పుడు 50 శాతం జనాభా నగరాన్ని విడిచి వెళ్ళారు. అప్పుడు ఆ నగర జనాభా 8.5 లక్షలు కాగా, 4 లక్షల మంది నగరం విడిచి వెళ్ళారు. వారిలో చాలామంది మిల్లు కార్మికులు. 1896-2014 మధ్య కాలంలో ఈ బైబానిక్ ప్లేగ్ వలన 80 లక్షల మంది చనిపోయారు. నగరం విడిచి వెళ్ళిన వారిలో కొంతమంది తిరిగి వచ్చారు. అది వేరే విషయం. రోగాలకు దూరంగా, నగరాలకు దూరంగా ప్రజలు తరలి వెళ్ళడనేది కొత్త విషయం కాదు.

నగరాల నుంచి ప్రజలు తరలివెళ్ళడం ఇది మొదటిసారి కూడా కాదు. ఇది చరిత్రలో ఒక భాగమని మనం గుర్తించాలి. దేశంలో గతంలో కూడా పెద్దఎత్తున ప్రజలు నగరాల నుంచి గ్రామాలకూ, గ్రామాల నుంచి వేరే గ్రామాలకూ వెళ్ళడం జరిగింది. మన దేశంలో వలస విధానం ఎలా ఉంది, వలసల పరిస్థితి ఎలా ఉంది అని తెలుసుకోవడం కోసమే నేను ఇది చెప్తున్నాను. భారతదేశంలో జనాభా పట్టిక అనేది (సెన్సెస్) మన దేశానికీ, మన సమాజానికీ సంబంధించిన ఒక అద్భుతమైన సమాచార గని లాంటిది. కానీ దేశంలోని వలసలను లెక్కించడంలో అది చాలా వెనుకబడింది. జనగణనలో వలసలను సరిగా గుర్తించడం లేదు. ఉదాహ రణకు ఒక వ్యక్తి 'ఎ' అనే నగరం నుంచి 'బి' అనే నగరానికి వచ్చాడనుకోండి, ఆ 'బి' అనే నగరంలో ఆ వ్యక్తి కనీసం 6 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నివసిస్తేనే అతనిని వలస వచ్చిన వ్యక్తిగా జనాభా పట్టికలో నమోదు చేస్తారు. కొంతమంది వారిని యదేచ్ఛగా సంచరించే కార్మికులు (ఫుట్‌లూజ్ కార్మికులు) అని పిలుస్తారు. వారికి ఒక స్పష్టమైన గమ్యం ఉండదు. వారు ఎక్కడ ఎన్ని రోజులు ఉంటారో వారికే స్పష్టత ఉండదు. ఒక్కోసారి ఒక్కో దగ్గర 3 లేక 4 నెలలు మాత్రమే ఉంటారు. ఉదాహరణకు కలహండి ఇటుక బట్టీలలో వారికి 40 రోజుల పని దొరకవచ్చు. యాత్రీకులు ఎక్కువగా వచ్చే సమయంలో రాయ్‌పూర్ లాంటి చోట్ల 20 రోజుల పాటు రిక్షా తొక్కే పని దొరకవచ్చు. వారికి పని దొరకవచ్చు, దొరకకపోవచ్చు. అది అక్కడి కాంట్రాక్టర్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. నిర్మాణ రంగంలో కూడా ఎప్పుడు పనులు ఉంటాయో, ఎప్పుడు ఉండవో స్పష్టత ఉండదు. కొన్నిచోట్ల లాక్‌డౌన్‌కు 2, 3 రోజుల ముందు కొంతమందిని నిర్మాణ పనులకు నియమించారు. వారి పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో చెప్పలేం. నయా ఉదారవాద సంస్కరణల ఫలితంగా విపరీతంగా పెరిగిపోయిన ఇటువంటి వలస కార్మికులు లెక్కలోనికి రావడం లేదు. వీరిని లెక్కించడం కూడా కష్టమే. మీడియాకు మాత్రం వలస కార్మికులపై ఎప్పుడూ శ్రద్ధ లేదు. కానీ మేము మా పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా (పారీ) అనే మా జర్నలిజం వెబ్‌సైట్‌లో మాత్రం సంవత్సరంలో 365 రోజులూ వలసలు, వలస కార్మికులకు సంబంధించిన కథనాలు పెడుతుంటాం. గ్రామీణ భారతంపై కథనాలకు అందులో ఎక్కువ భాగం కేటాయిస్తుంటాం. అది రూరల్ ఇండియా ఆన్‌లైన్ డాట్ ఒఆర్‌జి అనే లింకు ద్వారా చూడవచ్చు.

వలస జీవులపై ఎన్నడూ దృష్టి పెట్టని మీడియా ఇప్పుడు అకస్మాత్తుగా ఈ వలసల కోసం విలేకరులను కేటాయించడం మొదలు పెట్టింది. పట్టణ ప్రాంతాలలో ఈ వలస కార్మికుల సేవలు నిలిచిపోవడంతో మార్చి 28కి అకస్మాత్తుగా ఒక స్తబ్దత ఏర్పడింది. దీనితో మీడియా ఈ వలస కార్మికులను గుర్తించడం, వారితో


epaper.prajasakti.com

**"వ్యవసాయరంగం క్షీణించడంతో నిరాశ చెంది వలసలు వెళ్ళిన వారే వీరిలో చాలామంది వున్నారు. 3,15,000 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇవి నా లెక్కలు కాదు. ప్రభుత్వ లెక్కలే. ఇప్పుడు మనందరం దృష్టి పెట్టిన ఇంకొక విషయం పట్టణాల నుంచి గ్రామాలకు జరుగుతున్న ఈ తిరుగు వలసలు. పట్టణాలలో నివసిస్తున్న వారు వెనుకకు తిరిగి వెళ్ళిపోతున్నారు. అభ్యుదయ రాజకీయ భావాలు గల మనం ఇది ఎందుకు జరుగుతుందో ఆలోచించాలి."**

సంభాషించడం, వారి పరిస్థితుల గురించి తెలుసుకోవడం మొదలు పెట్టారు. వారి ఫొటోలు తీయడం, వారి గురించి కొంత రాయడం మాత్రమే వారు ఎక్కువగా చేయగలిగారు. అసలు వీరు ఎవరు, వీరి పరిస్థితి ఎందుకిలా తయారయింది అనే విషయాలు స్వల్పంగానే రాశారు. వీరు ఎందుకు వెనక్కి వెళ్ళిపోతున్నారు. వీళ్ళు తిరిగి వస్తారా రారా? అనే ప్రశ్నలే మీడియా వాళ్ళు ఎక్కువమంది వేశారు. మీరు మీ ఊళ్ళను వదిలి ఎందుకొచ్చారు అని చాలా తక్కువమంది మాత్రమే అడిగారు. ఇదే అసలు సమస్య. మనం గత 28, 29 ఏండ్ల నుంచి అనుసరిస్తున్న ఆర్థిక విధానాల ఫలితమే ఇదంతా. 2011 జనాభా లెక్కలను పరిశీలిస్తే గత 30 ఏండ్లలో రికార్డు స్థాయిలో వలసలు పెరిగాయని మనకు అర్థమవుతుంది. 1991 నుంచి 2011 మధ్య కాలంలో 1.5 కోట్లమంది రైతులు వలసలు వెళ్ళారు. వ్యవసాయరంగం క్షీణించడంతో ఆ రంగంలో ఉన్న రైతులు రోజుకు 2,000 మంది చొప్పున వలస వెళ్ళడం జరిగింది. వలసలు పెద్ద ఎత్తున జరిగాయి. గ్రామాల నుంచి పట్టణాలకూ, గ్రామాల నుంచీ గ్రామాలకూ, పట్టణాల నుంచి పట్టణాలకూ, అతి తక్కువ స్థాయిలో పట్టణాల నుంచి గ్రామాలకూ వలసలు జరిగాయి. అంతర్ రాష్ట్ర వలసలు కూడా పెరిగాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం అంతర్ రాష్ట్ర వలసలు 54 లక్షలు. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలోని మొత్తం వలస కార్మికుల సంఖ్య 45.4 కోట్లు. కానీ వీరిలో చాలామంది అంతర్ రాష్ట్ర వలసలు వెళ్ళినవారు కాదు. ఇతర జిల్లాలకు వెళ్ళిన వారూ, వివాహం వలన ఇతర చోట్లకు వెళ్ళిన మహిళలూ అలాంటి వారు వీరిలోఎక్కువ మంది ఉన్నారు. కానీ 1991 నుంచి వ్యాపార, ఉపాధి అవకాశాల కోసం కొత్త ప్రాంతాలకు తరలివెళ్ళిన అంతర్ రాష్ట్ర వలస కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కాబట్టి 2011 వచ్చేసరికి పెద్దఎత్తున వలసలు జరిగాయి. వలసలకు సంబంధించిన పూర్తి సమాచారం ఇంకా మనకు రావలసి ఉంది. కానీ లక్షలాది మంది వలసలు మన దేశంలో జరిగాయనేది తెలుస్తోంది.

వ్యవసాయరంగం క్షీణించడంతో నిరాశ చెంది వలసలు వెళ్ళిన వారే వీరిలో చాలా మంది వున్నారు. 3,15,000 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇవి నా లెక్కలు కాదు. ప్రభుత్వ లెక్కలే. ఇప్పుడు మనందరం దృష్టి పెట్టిన ఇంకొక విషయం పట్టణాల నుంచి గ్రామాలకు జరుగుతున్న ఈ తిరుగు వలసలు. పట్టణాలలో నివసిస్తున్న వారు వెనుకకు తిరిగి వెళ్ళిపోతున్నారు. అభ్యుదయ రాజకీయ భావాలు గల మనం ఇది ఎందుకు జరుగుతుందో ఆలోచించాలి. ఇది ఒక ముఖ్యమైన అంశం. 20 ఏండ్ల క్రితం గ్రామాలలో తుడిచి పెట్టుకుపోయిన ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ ఇప్పుడు ఈ స్త్రీ, పురుషులు ఆయా గ్రామాలకు తిరిగి వెళ్తున్నారు. ఉదారవాద విధానాల ద్వారా మనం ఆ అవకాశాలనన్నింటినీ తుడిచి పెట్టేశాం. రెండవ విషయం ఈ వలసలతో ఇప్పుడు అక్కడ వున్న భూములపై, వ్యవసాయంపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. మూడవ విషయం 2008 నుంచీ వున్న వాల్‌స్ట్రీట్ సంక్షోభంతో అమెరికా తదితర దేశాల నుంచి వస్త్ర పరిశ్రమలకు వచ్చే లక్షలాది ఆర్డర్లు అన్నీ రద్దయిపోయాయి. గుజరాత్‌లో అతిపెద్ద ఉత్పత్తి జరిపే పవర్ లూమ్ సెక్టార్ మూతపడింది. దీనితో సూరత్‌లో వున్న లక్షమంది ఒరిస్సా వలస కార్మికులకు ఉపాధి కరువైంది. ఒరిస్సా, సూరత్ రాష్ట్రాల మధ్య వలసల ప్రయాణ రద్దీ చాలా తీవ్రంగా ఉంటుంది. దీనికోసం అక్కడ బారక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ అనే రైలు కూడా ఉంది. బారక్‌పూర్ నుంచి సూరత్‌కూ, బారక్‌పూర్ నుంచి అహ్మదాబాద్‌కూ నడిచే రైళ్ళలో ఎక్కువగా వలస కార్మికులే వుంటారు. ఎందుకంటే ఒరిస్సా నుంచి సూరత్‌కూ, అహ్మదాబాద్‌కూ చాలామంది వెళ్ళి పని చేస్తుంటారు. ఈ పవర్‌లూమ్ పరిశ్రమలు మూత పడిన వెంటనే వేలాది మంది తమ గ్రామాలకు తిరిగి వచ్చారు. ఈ విధంగా ఒరిస్సాలోని గంజామ్ జిల్లాకు 40,000 మంది తిరిగి వచ్చారు. దీనితో అక్కడ అనేక సమస్యలు వచ్చాయి. అనేక ఆస్తి తగాదాలు వచ్చాయి. గతంలో ఒక ఇంట్లో తండ్రీ, పెద్ద కొడుకు పొలం పనులు చూసుకుంటూ ఉంటే మిగిలిన ముగ్గురు నలుగురు అన్నదమ్ములు సూరత్‌కు కానీ, అహ్మదాబాద్‌కు కానీ వెళ్ళి అక్కడ టెక్స్‌టైల్ మిల్లులలోనూ, వజ్రాలూ, నగల కంపెనీలలోనూ పని చేసేవారు.

కానీ ఇప్పుడు అందరూ తిరిగి వచ్చేయటంతో ఇంట్లో పని చేయకుండా ఉండే పురుషుల సంఖ్య పెరిగింది. దీనితో భూ తగాదాలూ, ఆస్తి తగాదాలూ పెరగడమే కాక ఇండ్లలో హింస పెరిగి మొత్తంగా నేరాల శాతం పెరిగింది. 30,000 లేక 40,000 మంది తిరిగి వెళితేనే ఇన్ని సమస్యలొచ్చాయి. కానీ ఇప్పుడు లక్షలాదిగా ప్రజలు తిరగి వెళ్తుంటే ఎటువంటి పరిస్థితులు ఎదురవుతాయో ఊహించడం కూడా కష్టమే. ఇప్పటికే గ్రామాలలో వున్న వారి పరిస్థితులు కూడా దిగజారాయి. ఉదారవాద విధానాల వలన ఇప్పటికే వారు దెబ్బతిని ఉన్నారు. ఈ పరిస్థితులలో క్షౌరవృత్తిలో వున్న వారి ఉపాధి పరిస్థితి ఏమిటి అనేది చూద్దాం. ఇది కొంత హాస్యాస్పదంగా ఉండవచ్చు. కానీ మన దేశంలో ఈ వృత్తి చేసే వారు కూడా అనేకమంది ఉన్నారు. దురదృష్టవశాత్తూ వారు నివసిస్తున్న ప్రతి గ్రామంలోనూ మైనారిటీలుగానే ఉన్నారు. ఒక్కో గ్రామంలో 12, 20, 30 మొదలైన సంఖ్యలో ఉంటారు. కానీ దేశంలోని ప్రతి గ్రామంలోనూ ఉంటారు. వారు తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని పోరాడుతున్నారు. కానీ సఫలం కాలేకపోతున్నారు. ఈ వృత్తిలో భౌతిక దూరం పాటించడమనేది అసాధ్యమైన పని. వీరి గురించి ఎవరు ఆలోచిస్తారు? వారు తమ షాపులన్నీ తెరవలేకపోవచ్చు. వారు ఇప్పటికే అప్పుల పాలై, తమ షాపుల అద్దెలను కూడా చెల్లించలేకపోతున్నారు. వారు కరువు అంచుల్లో ఉన్నారు. నా స్వరాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుకోస్తాలోని మత్స్యకారులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. చేపల ఉత్పత్తిలో రుతుపవనాలకు రెండు నెలల ముందు చేపలు గుడ్లు పెట్టే సమయం. కాబట్టి ఆ సమయంలో మత్స్యకారులెవ్వరూ సముద్రంలో చేపల వేటకు వెళ్ళరాదనే నిబంధనలు ఉంటాయి. ఎవరూ


epaper.prajasakti.com

ఆ సమయంలో సముద్రంలోకి వెళ్ళరు. ఈ సమయం ముగిసే రెండు వారాల ముందు మాత్రం మత్స్యకారులకు అధిక ఆదాయం వచ్చే సమయం. సరిగ్గా ఈ రెండు వారాల సమయం లాక్‌డౌన్‌లో ఉండిపోయింది. వారి ప్రాణాలకు ప్రమాదమైనా కూడా వారు సముద్రంలోకి వెళ్ళి చేపలు పట్టుకొచ్చి అమ్మాలని ప్రయత్నించారు. అయినా వారు సరిగా అమ్మకాలు చేయలేక పోయారు. ఎందుకంటే వినియోగదారులు ఆ చేపలు చైనా తీరం నుంచి వస్తాయనీ, వాటికి కరోనా వైరస్ ఉంటుందనీ భయపడ్డారు. ఈ విధమైన తప్పుడు ప్రచారాలు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా దేశమంతా వ్యాపించాయి. మత్స్య కారులు తాము తెచ్చిన చేపలను ఎక్కువ సమయం నిలువ ఉంచలేరు. కాబట్టి వారు తాము తెచ్చిన చేపలను తిననైనా తినాలి లేక అమ్మనైనా అమ్మాలి. కాబట్టి వారుఎక్కువ ట్రిప్పులలో చేపలు పట్టడానికి వెళ్ళాల్సి వస్తోంది.

దేశవ్యాప్తంగా నేత కార్మికులు, చేతి వృత్తుల వారు తీవ్ర సమస్యలెదుర్కొంటున్నారు. నేత కార్మికులకు, ఇతర చేతివృత్తుల వారికి పట్టణ మార్కెట్లతో వున్న సంబంధాల వలన వారికి కొంత ఆదాయం వచ్చేది. ప్రతి యేటా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఢిల్లీ తదితర ప్రాంతాలలో నేత బట్టలు, బొమ్మలు మొదలైనవి అక్కడ జరిగే ఎగ్జిబిషన్‌లలో అమ్మడం ద్వారా వారికి ఈ సమయంలోనే అధిక ఆదాయం వచ్చేది. కానీ ఈ ఎగ్జిబిషన్‌లు రద్దు కావడంతో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలలోని నేత పని వారందరూ అమ్ముడు కాని తమ సరుకులతో గ్రామాలలోనే ఇండ్లలో అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చీరాలలో వున్న నేత పనివారు, కంచిలో చీరలు నేసే కాంచీపురం నేత పనివారూ ప్రస్తుతం కరువు అంచుల్లో ఉన్నారు. అనేక వృత్తులూ, జీవనోపాధులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. మన దేశంలో అభద్రతకూ, ఆకలికీ, కరువుకూ మధ్య ఎంతో దూరంలేదు. కోవిడ్ –19 మనకు పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఉదారవాద విధానాల యొక్క తీవ్ర దుష్ఫరిణామాలు ఏ విధంగా ఉంటాయో పరిచయం చేసింది. ఈ విధానాల దుష్ప్రభావాలు గతం నుంచి పెరుగుతూ వచ్చి, ఇప్పుడు ఈ సంక్షోభం రూపంలో బయటపడుతున్నాయి. ఇప్పుడు మహావిపత్తు రూపంలోకి వచ్చింది. ఇప్పుడు రకరకాల వృత్తులూ, జీవనోపాధులూ దెబ్బతింటున్నాయి. రైతులు, వ్యవసాయ కూలీల పరిస్థితీ దయనీయంగా మారింది. ఇప్పుడు మనం భౌతిక దూరం గురించి మాట్లాడుతున్నాం. భౌతికదూరం నిబంధనలు పాటిస్తూ ఉపాధి హామీ పనులు మొదలు పెడుతున్నట్లు నోటిఫికేషన్లు వచ్చాయి.

“కాబట్టి సంక్షోభం వచ్చినప్పుడు అది అందరిపై ఒకేలా ప్రభావం చూపదు. కోవిడ్ చాలా సమానత్వం పాటిస్తోంది అని చెప్పడం చాలా చెత్తవాదన. ఆకలితో వున్న వారిపై, కరువు పరిస్థితులకు దగ్గరగా ఉన్నవారిపై, అనారోగ్యంతో ఉన్న వారిపై, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులో లేనివారిపై, కనీస సదుపాయాలు అందు బాటులో లేనివారిపై కోవిడ్ తీవ్ర ప్రభావం చూపుతోంది.”

మేము నిన్న రాత్రి మా పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా (గ్రామీణ భారత ప్రజల సమాచారం) వెబ్‌సైట్‌లో ఒక కథనం వేశాం. తెలంగాణలోని నల్లగొండ జిల్లాకు చెందిన ఒక వరి సేకరణ కేంద్రానికి సంబంధించిన సమాచారాన్ని మా విలేకరి హరినాథరావు నాగవర్పుల మాకు అందించారు. అక్కడ ఒక వరి సేకరణ కేంద్రానికి వెళ్ళి పరిశీలించితే పలు విషయాలు తెలిశాయి. ఆ వరి కేంద్రంలో 48 మంది కూలీలు రోజుకు 10 గంటల పాటు పని చేస్తున్నారు. అందులో 4 గంటల సమయం వారు విపరీతమైన ఎండలో పని చేయాల్సి వస్తోంది. వారు ఉదయం 3 గంటలకే పని మొదలు పెడతారు. కానీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విపరీతమైన ఎండలో వారు పని చేస్తున్నారు. వారు వరిని కట్టలు కట్టడం, తూకం వేయడం, శుభ్రం చేయడం, ట్రక్కులలోకి ఎత్తడం చేస్తున్నారు. అలా వారు 128 టన్నుల వరిని ట్రక్కులలోకి ఎత్తారు. ఇదంతా వారు గ్రూపులుగా చేయాలి. దూరం పాటించాలి. వారు మాస్కులు ధరించాలి. కానీ వేసుకున్న మొదటి 20 సెకండ్లలోనే ఆ మాస్కులు మొత్తం చెమటతో తడిచిపోతున్నాయి. అక్కడ పక్కవారికి కనీసం 2 మీటర్ల దూరం పాటించడం అనేది సాధ్యం కాని పని. వీరిలో చాలా మంది జీవన విధానం ఈ విధంగానే ఉంది. భారతదేశంలో సరళీకరణ ఆర్థిక విధానాల ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి. అసమానతలకు సంబంధించిన ఒక మైండ్‌సెట్‌ను కూడా ఈ వ్యవస్థ తయారు చేసింది. గత 28 ఏండ్లుగా ధనికులను మరింత ధనికులుగా, అణగారిన వారిని మరింత అణగారే వారిగా చేస్తూనే ఉండటం మనంచూస్తున్నాం. కాబట్టి సంక్షోభం వచ్చినప్పుడు అది అందరిపై ఒకేలా ప్రభావం చూపదు. కోవిడ్ చాలా సమానత్వం పాటిస్తోంది అని చెప్పడం చాలా చెత్తవాదన. ఆకలితో వున్న వారిపై, కరువు పరిస్థితులకు దగ్గరగా ఉన్నవారిపై, అనారోగ్యంతో ఉన్న వారిపై, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులో లేనివారిపై, కనీస సదుపాయాలు అందు బాటులో లేనివారిపై కోవిడ్ తీవ్ర ప్రభావం చూపుతోంది. నాలాంటి మధ్యతరగతి హౌసింగ్ సొసైటీలలో నివసించే వారికంటే ఇది వారిపైనే ఎక్కువ ప్రభావం చూపుతోంది. కచ్చితంగా ఉన్నతవర్గాల వారికంటే ఇది వీరిపైనే తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఉన్నతవర్గాల సంపద 1991 తరువాత బాగా పెరిగింది. భారతదేశంలో అంతకుముందు డాలర్ శత కోటీశ్వరులు ఒక్కరు కూడా లేని స్థితి నుంచి 2019 వచ్చే సరికి 121 మంది డాలర్ శతకోటీశ్వరులకు పెరిగారు. వీరి మొత్తం సంపద దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 22 శాతానికి సమానం. వీరిలో ఒక్కొక్కరికి అప్పటికే 2,300 కోట్ల డాలర్ల పైనున్న సంపదకు 12 నెలల కాలంలో అదనంగా 1,600 కోట్ల డాలర్లు పెరిగింది. వ్యవసాయ కార్మికులు, రైతులు మొదలైన వారి సంపద ఏమి పెరిగింది?

ఈ అసమానత్వానికి వ్యతిరేకంగా పోరాడకుండా మనం రాబోయే కొన్ని నెలల్లో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనలేం. ఖరీఫ్ సీజన్‌లో ఎదురయ్యే ప్రమాదకర పరిస్థితుల గురించి నేను ఎప్పుడూ చెప్తూనే ఉన్నాను. రబీ సీజన్‌లో వాణిజ్య పంటల పరిస్థితి ఏ విధంగా ఉందో ఇప్పుడు చూస్తున్నాము. లక్షలాది పుచ్చకాయలు అమ్ముడుపోకుండా పొలాల్లోనే పడి ఉన్నాయి. రవాణా సదుపాయం కూడా లేక వాటిని కోయడం లేదు. 70, 80 లక్షల క్వింటాళ్ళ ప్రత్తి అమ్ముడుపోకుండా పడి ఉంది. లక్షల క్వింటాళ్ళ చెరకు అమ్ముడుకాక పడి ఉంది. అయినా కూడా తెలంగాణ, హర్యానా, పంజాబ్ లాంటి రాష్ట్రాలలో రైతులను తిరిగి వాణిజ్య


epaper.prajasakti.com

> **"తెలంగాణ, హర్యానా, పంజాబ్ లాంటి రాష్ట్రాలలో రైతులను తిరిగి వాణిజ్య పంటలు వేయాల్సిందిగా ప్రభుత్వాలు తప్పుడు సలహాలు ఇస్తున్నాయి. ఇది ఆత్మహత్యా సదృశ్య మే అని నేను చెప్పదలచుకున్నాను. ఇది చాలా ప్రమాదకరం. మనం ప్రతి ఒక్కరినీ ఆహార ధాన్యాలే పండించమని చెప్పాలి. కనీసం కొంత భాగమైనా వారి కుటుంబ అవసరాల కోసం, వ్యవసాయ కూలీల కోసమైనా పండించాలని చెప్పాలి."**

పంటలు వేయాల్సిందిగా ప్రభుత్వాలు తప్పుడు సలహాలు ఇస్తున్నాయి. ఇది ఆత్మహత్యా సదృశ్య మే అని నేను చెప్పదలచుకున్నాను. ఇది చాలా ప్రమాదకరం. మనం ప్రతి ఒక్కరినీ ఆహార ధాన్యాలే పండించమని చెప్పాలి. కనీసం కొంత భాగమైనా వారి కుటుంబ అవసరాల కోసం, వ్యవసాయ కూలీల కోసమైనా పండించాలని చెప్పాలి. ఆహార ధాన్యాలు పండిస్తేనే అదనపు ఉపాధి కూడా లభిస్తుంది. ఇంకా ఎక్కువ పని దినాలు కల్పించగలుగుతాం. మనందరం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మద్దతు ఇస్తాం. తగినన్ని పనిదినాలు కల్పించాలని కూడా కోరుతుంటాం. ఈ ఆహార ధాన్యాల ఉత్పత్తి 10 రెట్లు పెరిగితే గానీ రాబోయే పరిస్థితులను ఎదుర్కోవడం సాధ్యం కాదు. మనం వాణిజ్య పంటల వైపు మళ్ళితే రాబోయే ఆహార సంక్షోభం మరింత తీవ్రతరమవుతుందని అర్థం చేసుకోవాలి. అంతేకాక వాణిజ్య పంటలను ఎవరూ కొనే పరిస్థితి ఉండదు. ప్రభుత్వాలు, రైతులు తమ పంటలను అమ్ముకోలేని పరిస్థితులు ఏర్పడతాయి. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగానే ఆదాయాలూ, వినిమయాలూ తగ్గిన పరిస్థితులో ఎగుమతులు జరుగుతాయనే హామీ లేదు. ఇప్పటికే 70, 80 లక్షల టన్నులు ప్రత్తి అమ్ముడు కాక మిగిలిపోయిందనేది చూస్తున్నాం.

ఆహార పంటలు పండించకపోతే మనం తీవ్ర సమస్యలు ఎదుర్కొనక తప్పదు. కాని ఇంకోవైపు ప్రభుత్వం గత ఏప్రిల్ 15నే పెద్ద మొత్తాలలో వరి ధాన్యాన్ని ఇథనాల్‌గా మార్చడానికి అనుమతులు ఇచ్చింది. ఎందుకంటే దానితో మనం హ్యాండ్ శానిటైజర్‌లు తయారు చేయాలని చెప్తున్నారు. ఈ హ్యాండ్ శానిటైజర్‌ల తయారీ కోసం కొన్ని లక్షల టన్నుల ఆహార ధాన్యాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఒకవైపు కొంతమంది ప్రజలు రోజుకు మూడుసార్లైనా చేతులు కడుక్కున్నేందుకు సరిపడా నీరు కూడా లేని పరిస్థితిలో ఉన్నారు. పశ్చిమకోస్తాలోను, తూర్పు కోస్తాలోనూ తుఫానులు కూడా ఈ సమయంలో వచ్చే అవకాశం ఉంది. దేశంలోని చాలా జిల్లాల్లో ప్రతి సంవత్సరం ఎదుర్కొనే నీటి సమస్య కూడా ఉంది. ఒకవైపు ఇంత తీవ్రమైన సమస్యలు ఉన్నా కూడా ఆహార నిల్వలను ఇథనాల్‌గా మార్చుతున్నారు. దీన్ని ఇంధనంలో కలపడానికి కూడా వాడుతుంటారు. సారాయి బట్టీలకు పని కల్పించాలనే ఉద్దేశ్యం కూడా దీని వెనుక ఉంది. ఇంకొక ముఖ్య విషయం మీడియా గురించి మనం చూడాలి. మీడియా పట్ల అభ్యుదయ వాదులకు రెండు రకాలైన అభిప్రాయాలున్నాయి. ఒక అభిప్రాయం ప్రకారం మీడియా అనేది పాలకవర్గాల చేతిలో ,పాలకులలోని కీలకవ్యక్తుల చేతిలో ఉంటుందనేది. ఇంకొక అభిప్రాయం ప్రకారం మనం మీడియా పనితీరునూ, దాని స్వభావాన్నీ కొంతవరకు మన జోక్యం ద్వారా మార్చవచ్చుని. నేను గత 40 ఏండ్ల నుంచీ అదే విధంగా జోక్యం చేసుకుంటున్నాను. అవును. గత 30 ఏండ్ల క్రితంతో పోల్చుకుంటే మనం ఇప్పుడు చాలా తక్కువగా మాత్రమే ఆ పని చేయగలుగుతున్నాం. మీడియానూ, జర్నలిజాన్ని మనం వేరువేరుగా చూడాలి. మీడియాకు చాలా పెద్ద నిర్మాణమే ఉంది. 20, 30 ఏండ్ల క్రితం మనం మీడియాను అది వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉంటోందని విమర్శించే వాళ్ళం. కానీ ఇప్పుడు అవి వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉండడం మాత్రమే కాదు, అవే వ్యాపార రంగాలుగా మారాయి.

ప్రస్తుతం మార్చి 2019 నాటికి మన దేశంలోని మీడియా, వినోద పరిశ్రమల విలువ 2,600 కోట్ల డాలర్లుగా ఉంది. రూపాయలలో చూస్తే అది మార్చి 2019 నాటికి రెండు లక్షల కోట్లుగా ఉంది. దేశంలో అత్యంత లాభాలు ఆర్జిస్తున్న కంపెనీలలో ఇవి కూడా వున్నాయి. సెన్సెక్స్‌లో మొదటి ర్యాంకులోని 30 కంపెనీల లాభాలతో ఇవి పోటీ పడుతున్నాయి. కానీ గత 2 నెలల కాలంలో ఇవి 1,000 మందికి పైగా జర్నలిస్టులను ఉద్యోగాల నుంచి తొలగించాయి. హిందూస్థాన్ టైమ్స్ తన స్టాఫ్‌లో 150 మందిని అంటే 27 శాతం మందిని తొలగించగా, తమిళనాడులోని వికటన్ అనే పత్రిక 175 మంది సిబ్బందిని తొలగించింది. రెండు పత్రికలకు సంబంధించిన 300 మందికిపైగా జర్నలిస్టులు రోడ్డున పడ్డారు. ఈ విధమైన తొలగింపులకు వారు ఏదో ఒక విధంగా పాల్పడుతూనే ఉంటారని మనం అర్థ చేసుకోవాలి. ఎటువంటి పెద్ద విపత్తులొచ్చినా, ఎటువంటి వాతావరణ మార్పులొచ్చినా వారు ఉద్యోగాల తొలగింపునకు పాల్పడతారు. 2008లో వాల్ స్ట్రీట్ సంక్షోభం తరువాత 2009 ఎన్నికలకు కొద్దిగా ముందుగా 1,000 మంది జర్నలిస్టులను తొలగించారు. నోట్లరద్దు తరువాత ఒక వార్తా పత్రిక తన ఆరు ఎడిషన్లను మూసివేసింది. ఆ విధంగా సిబ్బందిని తొలగించింది. ఇవి పూర్తిగా లాభాల కోసమే పని చేస్తున్నాయి కాబట్టి ఇటువంటి విపత్తులనన్నిటినీ సాకుగా తీసుకొని తొలగింపులకు పాల్పడుతున్నాయి. చిన్న సంస్థలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఈ విధంగా చేస్తే మనం అర్థం చేసుకోవచ్చు. కానీ ప్రతి సంవత్సరం పలు సాకులతో జర్నలిస్టుల ఉద్యోగాలు పోతున్నాయి. ప్రస్తుతం ప్రచురణ సంస్థలూ, విద్యా సంస్థలూ కలగలిశాయి. మీడియా, పెద్ద వ్యాపారస్తులూ వారికి సంబంధించిన భాగస్వాములూ ఆన్‌లైన్ విద్యా మార్కెట్లను అందుకునే పోటీలో అన్నారు. మీడియాకు ఇప్పుడు అదే పెద్ద పనిగా ఉంది. పెద్దపెద్ద మీడియా సంస్థలు, ఇప్పుడు యూనివర్సిటీలను నడుపుతున్నాయి. ఇప్పుడు అన్ని ప్రయివేటు యూనివర్సిటీలూ అదే చేయబోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో వున్న లక్షలాది పిల్లలకు ఇవి అందుబాటులో లేకుండా పోతాయి. వారికి స్మార్ట్ ఫోన్లు ఉండవు. కాబట్టి వర్చువల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేసినా వాటిని వారు అందుకోలేరు. ఇప్పుడు విద్యలో, ఆరోగ్యంలో, మీడియాలో, మన భావాలను వ్యక్తపరచడంలో అన్నింటిలో అసమానతలు తీవ్రంగా పెరగడంతో పాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనేది గత ఎమర్జెన్సీ రోజుల కంటే తీవ్రంగా దెబ్బతింటున్నది. ప్రస్తుతం ఏ చట్టసభలూ జరగడం లేదు. పార్లమెంటు సమావేశాలూ జరగడం లేదు. ఆన్‌లైన్ మీటింగ్‌లు తప్పితే ఏవీ జరగడం లేదు. క్యాబినెట్ పరిస్థితి కానీ, క్యాబినెట్ సమావేశం పరిస్థితి గానీ హాస్యాస్పదంగా మారాయి. ఎందుకంటే దేశ


epaper.prajasakti.com

ప్రజలకు ఇద్దరు మనుషుల గురించి మాత్రమే తెలుసు. ఒకరు నరేంద్రమోడీ ఇంకొకరు అమిత్ షా. మిగిలిన క్యాబినెట్ మంత్రులెవరూ మాట్లాడటం గానీ పత్రికా సమావేశాలు జరపడంగానీ చేయరు. ఈ రోజు వారు ఏదో ప్రయత్నం చేస్తున్నారు. నిర్మలా సీతారామన్ తన కోసం రాసి ఉంచిన స్క్రిప్ట్‌ను చదువుతారు. అందులోని చాలా విషయాలు ఆమెకు అర్థం కావు.

మన ప్రజాస్వామ్యం ఒక్క వ్యక్తికే పరిమితమైంది. ఆ వ్యక్తి కొన్ని వారాలకు ఒకసారి వచ్చి రియాలిటీషోలో చెప్పినట్టు దేశ ప్రజలు ఏమి చేయాలో చెప్తుంటారు. మోడీ చేసిన 5 ఉపన్యాసాలలో మొదటి 4 ఉపన్యాసాలలో ఆయన వలస కార్మికుల గురించి గానీ, కార్మికుల గురించి గానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అనేక విమర్శల తరువాత (వారు విమర్శలను ఎలాగూ పట్టించుకోరు) ఆయన 5వ ఉపన్యాసంలో ఒక్కసారి మాత్రం వలస కార్మికుల పదం వాడారు. ఒక్కసారి మాత్రమే. బీజేపీని కూడా మర్చిపోయి మనం ఒక్క వ్యక్తిని మాత్రమే చూస్తున్నాం. దీనినే చిన్న ప్రభుత్వం, పెద్ద పాలన అంటారేమో. 130 కోట్లమంది జనాభాను ఉద్దేశించి ఒక్క వ్యక్తి మాత్రమే ఉపన్యసిస్తూ ప్రజలు ఏమి చేయాలి, ఏమి చేయవద్దు అని చెప్తూ గిన్నెలూ, పళ్ళాలూ మోగించండి, దీపాలు వెలిగించండీ, పూలను చల్లండి. కానీ వలస కార్మికుల గురించి గానీ, మరెవరి గురించి గానీ ఆలోచించకండి అని చెప్తున్నాడు. కానీ మనం ముందు ముందు చేయాల్సింది చాలావుంది. కార్మికుల పరిస్థితి ఇప్పటికే దిగజారింది. ముందుముందు ఇంకా తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముంది. గుజరాత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మొట్టమొదటిగా అక్కడ యూనియన్ల ఏర్పాటుపై నిషేధం విధించాలని ముఖ్యమంత్రిని కోరింది. తరువాత 5 రాష్ట్రాల లో పనిగంటలను 8 నుంచి 12కు పెంచారు. ఇది గత వందేండ్లుగా వున్న కార్మిక చట్టాలను, ప్రమాణాలను తుంగలో తొక్కడమే.

మూడు రాష్ట్రాలలో కార్మిక చట్టాలను రద్దు చేశారు. కొన్ని రాష్ట్రాలు మూడు సంవత్సరాల పాటు లేక 1,000 రోజుల పాటు రద్దు చేశాయి. ప్రస్తుతం ఆన్‌లైన్ విద్య ద్వారా టీచర్ల యూనియన్లను, ఇతర యూనియన్లను దెబ్బతీస్తున్నారు. ఇది వారి ధ్యేయం, వారి ఎజెండా. ఇప్పుడు మనమేం చేయాలి అనేది మన ముందున్న ప్రశ్న. భవిష్యత్‌లో మన పోరాటాలూ, ఆందోళనలూ మన హక్కుల కోసం, న్యాయం కోసం చేసేవిగా ఉండాలి. దీనికి మన దేశంలో

> **“మన ప్రజాస్వామ్యం ఒక్క వ్యక్తికే పరి మితమైంది. ఆ వ్యక్తి కొన్ని వారాలకు ఒకసారి వచ్చి రియాలిటీషోలో చెప్పినట్టు దేశ ప్రజలు ఏమి చేయాలో చెప్తుంటారు. మోడీ చేసిన 5 ఉపన్యాసాలలో మొదటి 4 ఉపన్యాసాలలో ఆయన వలస కార్మికుల గురించి గానీ, కార్మికుల గురించి గానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అనేక విమర్శల తరువాత (వారు విమర్శలను ఎలాగూ పట్టించుకోరు) ఆయన 5వ ఉపన్యాసంలో ఒక్కసారి మాత్రం వలస కార్మికుల పదం వాడారు.”**



**ఉపాధి, సామాజికంగా సమిష్టి కృషికి దోహదం చేస్తున్న కేరళలోని కుటుంబశ్రీ పథకంలో భాగస్వాములు అవుతున్న మహిళలు**

అనేక అద్భుత ఉదాహరణలున్నాయి. ఇప్పుడు నాకు కేరళ గురించి చెప్పే సమయం లేదు. కానీ అక్కడ వున్న కుటుంబ శ్రీ పథకం ద్వారా మనం అనేక విషయాలు నేర్చుకోవచ్చు. దీనిని మనం ఆహార భద్రతకు, ఆహార స్వావలంబనకు ఒక ఉత్తమమైన పథకంగా చెప్పుకోవచ్చు. కేరళలో ఆరోగ్యానికీ, ఆహారానికీ సంబంధించిన న్యాయపరమైన విధానాలున్నాయి. ఈ విధమైన న్యాయమైన విధానాల కోసం మన పోరాటాలు ఉండాలి. మన దేశాన్నీ మన సమాజాన్నీ నడిపిస్తూ, ప్రధాన స్రవంతిలో ముందు పీఠిన పనిచేస్తున్న వారి కోసం మన డిమాండ్లు ఉండాలి. మనం ఈ ముందు పీఠిన పనిచేస్తున్న కార్మికులపై పూలు కూడా చల్లాం. మన దేశంలో 50 లక్షల మంది పారిశుధ్య కార్మికులూ, 10 లక్షల మంది ఆరోగ్య కార్యకర్తలైన ఆషాలూ ఉన్నారు. వీరికి నెలకు రూ.4,000 వేతనం మాత్రమే అందుతోంది. అంగన్‌వాడీ వర్కర్లు ఉన్నారు. వీరందరినీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని మనం పోరాడాల్సి ఉంది. రెండవది మనం ఒక పెద్ద జాతీయ ఆరోగ్య వ్యవస్థ కోసం పోరాడాలి. అటువంటి వ్యవస్థలోకి ఈ మొత్తం ఆరోగ్య కార్యకర్తలనూ, పారిశుధ్య కార్మికులనూ, ఆషాలనూ, అంగన్‌వాడీలను తీసుకొచ్చి వీరందరినీ ఆరోగ్య కార్యకర్తలుగా గుర్తించే విధంగా పోరాడాలి. ఆ విధంగా ఆరోగ్య వ్యవస్థను కిందిస్థాయి వరకూ విస్తరించే విధంగా పోరాడాలి. ఆ విధంగా దేశ రాజ్యాంగానికి సంబంధించిన న్యాయపరమైన ప్రాథమిక హక్కులు అందరికీ అందుబాటులోకి తెచ్చే కృషి చేయాలి. అటువంటి సమాజం కోసం ప్రయత్నించాలి. మనం ఒక విధానం నుంచి తిరిగి అదే విధానంలోకి వెళ్ళే ప్రయత్నాల నుంచి బయటపడి అసలైన న్యాయం కోసం పోరాడాలి. ఒకసారి ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ గాల్ బ్రేతియన్ వృద్ధి గురించి చెప్పారు. ఆయన న్యాయంతో కూడిన అభివృద్ధి కావాలని చెప్పారు. మన రాజ్యాంగంలో చెప్పిన విధంగా సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం కావాలి. ఈ విధమైన దృక్పథంతో మనం పోరాటాలతో ముందుకు సాగాలి.

**(అనువాదం : కె. నాగలక్ష్మి)**



epaper.prajasakti.com

# ప్రజా సేవలో కమ్యూనిస్టులు

(2వ పేజీ తరువాయి)

ధాలు పెరిగాయి. వారి నమ్మకాన్ని, విశ్వాసాన్ని పొందగలిగింది అధికధరలతో , కరువుతో, ఆకలితో బాధపడే ప్రజలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూనే భూస్వాముల, వ్యాపారుల అక్రమాలను బహిర్గతం చేయడం, వారికి కొమ్ము కాచే పాలకుల దుర్మార్గాలను బట్టబయలు చేయడం తక్షణ కర్తవ్యంగా పార్టీ భావించింది. కరువు కాలమంతా బెంగాల్‌లో ఆకలి చావులు, ధరలు అత్యధికంగా ఉన్నప్పటికీ దేశమంతటా కూడా అదే పరిస్థితి ఉంది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకంగా ఈ సమస్యలు బయట పడేవి. సామాజిక, ఆర్థిక వ్యవస్థల సంక్షోభం దేశమంతటా సాక్షాత్కరిస్తూ ఉండేది. అభివృద్ధి కాముక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఆలోచనలున్న ప్రజలు బ్రిటిష్ వారి పాలన అంతం అయిన తరువాత భారతదేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థను మార్చడం ఒక్కటే సమస్యలకు పరిష్కారమని నమ్మారు. యుద్ధకాలంలో గాని, ఆ తరువాత గాని, కరువు సందర్భంగా అత్యవసర వస్తువుల ధరలు పెరగడం, కార్మికుల నిజ వేతనాలు తగ్గడం, ఇతర సమస్యలు, కార్మికులు, ఇతర మధ్య తరగతి ఉద్యోగులు సంఘటిత పోరాటాలు చేయడానికి దారి తీశాయి. యుద్ధకాలంలో ఏర్పడ్డ ఆహార కొరత 1945 నాటికి విపరీతంగా పెరిగిపోయింది. లార్డ్ వావెల్ అంచనా ప్రకారం 10 కోట్లమంది ప్రజలపై ఈ దుర్భిక్ష ప్రభావం పడింది.

యుద్ధం ముగిసిన వెంటనే పెద్ద ఎత్తున వెల్లువెత్తిన సమ్మెలు, ప్రజాపోరాటాలు, ప్రజలకు, పోలీసులకు, సైన్యానికి మధ్య ఘర్షణలకు దారి తీశాయి. 1945 ఆగస్టులో వారణాసిలో జరిగిన ఘర్షణలలో 17 మంది చనిపోయారు. 2,000 మంది ఖైదు చేయబడ్డారు. సెప్టెంబర్‌లో జరిగిన సమ్మె తరువాత బొంబాయిలో విప్లవ వాతావరణం ఏర్పడింది. అయితే మితవాద రాజకీయ నాయకులూ, పాలకులు వాటిని హిందు, ముస్లింల మధ్య ఏర్పడ్డ ఘర్షణగా చూపడంలో కొంతవరకు సఫలీకృతులయ్యారు. తదనంతర కాలంలో ఏర్పడ్డ ఘర్షణలలో కూడా డజన్లకొద్దీ ప్రజలు చంపబడ్డారు. వందలాది మంది గాయాల పాలయ్యారు.

ఇంతకు ముందు ఉవ్వెత్తున లేచిన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొన్న ప్రజలు, ఇప్పుడు అందుకు భిన్నంగా కార్మికులు, కష్టజీవులు, వామపక్ష శక్తుల విప్లవ దృక్పథానికి ప్రభావితులై, సంఘటిత పోరాటాలలో పాల్గొంటున్నారు. యుద్ధకాలంలో క్విట్ ఇండియా పోరాటంలో కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా ప్రజలలోకి వెళ్లి ప్రజాపార్టీగా రూపొందిన కమ్యూనిస్టు పార్టీ, క్విట్ ఇండియా పోరాటానికి నిర్మాణాత్మకమైన నాయకత్వాన్ని సమకూర్చిన సోషలిస్టులు, ఇతర వామపక్షవాదులూ కలిసి యుద్ధానంతరం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు జరిపిన తిరుగుబాట్లలో ప్రముఖ పాత్ర పోషించారు. పెరుగుతున్న కమ్యూనిస్టుల ప్రభావాన్ని నిలువరించడానికి నెహ్రూ, ఇతర నాయకులు పెద్ద ఎత్తున కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని మొదలు పెట్టారు. సోషలిస్టుల మద్దతుతో, ప్రజాసంఘాలను చీల్చడం ద్వారా వారు కమ్యూనిస్టులకు ఇబ్బందులు తెచ్చి పెట్టారు. కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రజలలో చెప్పుకోదగ్గ స్థాయిలో ఆ నాడున్న సామ్రాజ్యవాద వ్యతిరేక సెంటిమెంటుకి తిరిగి కమ్యూనిస్టులు ఎదురీదవలసి వచ్చింది. ఆనాటి సోషలిస్టుల లోను, ఇతర వామపక్షవాదులలోను ఎక్కువ మంది కాంగ్రెస్‌లో ఉన్న మితవాదుల ప్రభావంలో ఉండి కమ్యూనిస్టులను 'ఒంటరిపాటు' చేసే ప్రయత్నాలకు తోడ్పడ్డారు. కమ్యూనిస్టులు క్విట్ ఇండియా ఉద్యమానికి వెన్నుపోటు పొడిచారని ప్రచారం చేశారు. మరోవైపు వీరు కమ్యూనిస్టులు చేస్తున్న సమ్మెలకు, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రదర్శనలకు సహకరిస్తూ, ఆ వుద్యమా లకు బలాన్ని, పోరాటమటిమను సమకూర్చారు.

రెండో ప్రపంచయుద్ధం, క్విట్ ఇండియా వుద్యమం ముగిసే నాటికి తనకంటూ సొంత కార్మికవర్గ దృక్పథం, కార్యాచరణ ఉండి దేశ వ్యాప్తంగా అనేక ప్రజాసంఘాలు తన ప్రభావంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ రాజకీయ నాయత్వాన్ని సవాలు చేసింది.

కేరళ, ఆంధ్రప్రదేశ్, బెంగాల్‌లలోని అనేక ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీకి విస్తృతంగా ప్రజల మద్దతు ఉండేది. భవిష్యత్తులో కాంగ్రెస్‌ని రాజకీయంగా ఎదుర్కొగల స్థితికి కమ్యూనిస్టు పార్టీ ఎదిగింది. ప్రజలలోని అనేక తరగతులలో– కార్మికులు, రైతులు, విద్యార్థులలో– పెరుగుతున్న కమ్యూనిస్టుల ప్రభావం, కమ్యూనిస్టు పార్టీ భవిష్యత్తులో తమకి పక్కలో బల్లెంగా తయారయే అవకాశాలున్నాయనే ఆందోళనను కాంగ్రెస్‌లో కలిగించింది. ఈ పరిణామాల రాజకీయ పూర్వరంగాన్ని కూడా మనం గుర్తించాలి.

రెండో ప్రపంచ యుద్ధకాలంలో **సోవియట్** యూనియన్ నిర్వహించిన చారిత్రాత్మక పాత్ర సోషలిస్టు సిద్ధాంత వ్యాప్తికి ఎంతగానో తోడ్పడింది. క్విట్ ఇండియా ఉద్యమంలోకి వచ్చిన యువకులలో చాలామంది కమ్యూనిజం పట్ల సానుభూతితో ఉండేవారు. కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ చురుకుగా ప్రజలలో పనిచేస్తున్నందు వలన అభివృద్ధి కాముక భావాలున్న యువకులకు కాంగ్రెస్ నాయకత్వ విధానాలు నచ్చేవి కావు

**కమ్యూనిస్టులు, జాతుల సమస్య**

హిందూ ముస్లిం మతోన్మాదులు భారత దేశాన్ని రెండు జాతుల కలయికగా – ప్రజల మతం ప్రాతిపదికన (హిందువులు, ముస్లింలు) విభజించబడిన రెండు జాతులు – భావించేవారు. అందువలననే సావర్కర్, జిన్నాలకు రెండు దేశాల సిద్ధాంతాన్ని అంగీకరించడంలో ఏ సమస్యా కనిపించలేదు. 1942లో కాంగ్రెస్ 'క్విట్ ఇండియా' నినాదాన్ని ఇవ్వగానే ముస్లింలీగ్ 'భారతదేశాన్ని విభజించి వెళ్ళమని' పిలుపునిచ్చింది. మరోవైపు ఆర్ ఎస్ ఎస్, హిందు మహాసభలు భారతదేశం హిందువులకు మాత్రమే చెందినదని, ఇతర మతాల వారు ఈ దేశంలో ఉండాలనుకుంటే రెండో తరగతి పౌరులుగా ఉండాలని ప్రచారం చేశాయి. కమ్యూనిస్టులు భారతదేశ భవిష్యత్తును హిందు, ముస్లింలు అనే సంకుచిత పరిధికి పరిమితం చేయలేదు. భారతదేశంలో వివిధ మతాల వారు నివసిస్తున్నారనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని, భారత ప్రజలకు మతం కేవలం ఒక పార్శ్వం మాత్రమే అని భావించారు. భారతదేశంలో వివిధ భాషలు మాట్లాడే అనేక జాతుల ప్రజలు నివసిస్తున్నారని, ప్రతి జాతికి వారి వారి సామాజిక, సాంస్కృతిక జీవనం ఉంటుందని, ఒక్కొక్క జాతి వివిధ మతాలుగా, కులాలుగా విభజింపబడి ఉంటుందనే ముఖ్యమైన వాస్తవాన్ని ప్రజల దృష్టికి తీసు కొచ్చారు. ఈ రాజకీయ వాస్తవాన్ని కమ్యూనిస్టు పార్టీ ఎత్తి చూపింది. భాషా ప్రాతిపదిక జాతుల విభజనను సంపూర్ణంగా అమలుచేయాలని కమ్యూనిస్టులు కోరారు. ఈ విషయంలో లెనిన్ ప్రతిపాదించిన జాతుల సిద్ధాంతాన్ని కమ్యూనిస్టులు మార్గదర్శకంగా తీసుకున్నారు. లెనిన్ స్టాలిన్‌లు సూచించిన విధంగా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న సందర్భంలో జాతుల భాష, సంస్కృతులు ఏకీకరణ చెందుతాయి. ఆర్థిక, రాజకీయ అస్తిత్వం కూడా అభివృద్ధి చెందుతుంది. భారతదేశంలో బూర్జువా ప్రజాస్వామ్య వాదుల నాయకత్వంలోని జాతీయోద్యమంలో భాగంగా భాష ప్రాతిపదికన ప్రాంతీయ విభజనలు జరిగే ధోరణి, ఇందుకు కాంగ్రెస్ నుండి లభిస్తున్న ప్రోత్సాహం అంతా ఈ



epaper.prajasakti.com

చారిత్రక వాస్తవ వ్యక్తీకరణలో భాగమేనని కమ్యూనిస్టులు భావించారు.

భారతదేశం భిన్న భాషల, సంస్కృతుల సమాహారం అని, భవిష్యత్తులో అన్ని జాతుల అభివృద్ధికి పరిపూర్ణ అవకాశాలు ఉండేలా అధికార యంత్రాంగాన్ని రూపొందించుకుంటేనే భారతదేశ స్వాతంత్ర్య భావన సంపూర్ణంగా, స్పష్టంగా ఉంటుందని కమ్యూనిస్టులు సూచించారు. భారత ప్రజలు వివిధ జాతులకు సంబంధించినవారు. ప్రతిజాతిలోనూ వివిధ మతాలకు చెందినవారున్నారు. చారిత్రిక కారణాల వలన రాజకీయంగా కలిసి ఉన్నారు. బ్రిటిష్ పాలన వారిని కృత్రిమంగా కలిపింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన జాతీయోద్యమం భారత ప్రజలను ఒక దేశంగా కలిపింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏర్పడ్డ ఈ జాతీయ ఐక్యత భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత కూడా కొనసాగితే భారత ప్రజల అభివృద్ధికి దోహదపడుతుంది. స్వాతంత్ర్యం పొందిన తరువాత దేశ పునర్నిర్మాణంలో సరికొత్త ప్రజాతంత్ర దేశంగా భారతదేశం అభివృద్ధి చెందాలంటే దేశంలోని అన్ని జాతులు కలిసి కట్టుగా ఉండాలి.

ఒక వైపు జిన్నా ప్రతిపాదించిన రెండు దేశాల సిద్ధాంతం, మరో వైపు ముస్లిమేతరుల ఒకే దేశ సిద్ధాంతం మధ్య ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో కమ్యూనిస్టులు భారతదేశ రాజకీయ భవిష్యత్తును పై విధంగా విశ్లేషించారు. జరుగుతున్న ఘర్షణలకు ఇదే పరిష్కార మార్గమని తమ అభిప్రాయాన్ని తెలియచేశారు. అందువలనే కమ్యూనిస్టులు పాకిస్థాన్ డిమాండ్‌ను సమర్థిస్తున్నట్టు ప్రజలు భావించారు. వాస్తవానికి కమ్యూనిస్టులు భావించిన రాజకీయ నిర్మాణానికి, పాకిస్థాన్ రూపకల్పనకు మౌలికంగా భేదం ఉంది. వారు భారతదేశాన్ని 'హిందూ భారతదేశంగా', 'ముస్లిం భారతదేశంగా' చూడ నిరాకరించారు. ముస్లింలీగ్ కోరుకున్నట్టు భారతదేశం రెండుగా విభజించబడినప్పటికీ, రెండు దేశాలలోనూ అనేక క్లిష్టమైన జాతుల సమస్యలు ఉత్పన్నమవుతాయని కమ్యూనిస్టులు సూచించారు. అయితే దానర్థం కమ్యూనిస్టు పార్టీ పాకిస్థాన్ విధానం యెడల ఏ తప్పులు చేయలేదని కాదు. 1945లో వాయువ్య భారత దేశంలోని ముస్లిం జాతులను గుర్తించాలనే ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం జరిగింది. ఈ తప్పుడు అవగాహనను తరువాత కాలంలో సరిదిద్దుకున్నారు. మతం ప్రాతిపదికన దేశాన్ని విభజించడం అనే లీగ్ తప్పుడు వైఖరిని నిర్ద్వంద్వంగా బట్టబయలుచేసే ప్రయత్నంగాని, శక్తివంతంగా తిప్పికొట్టే ప్రయత్నం గాని పార్టీ చేయలేదు. ఫలితంగా లీగ్ పాకిస్థాన్ కోసం చేస్తున్న డిమాండ్‌కు, భారతదేశం తదనంతర కాలంలో విభజించబడడానికి కమ్యూనిస్టు పార్టీ కారణమని ప్రత్యర్థులు ఆరోపణలు చేశారు. పార్టీ వైఖరిలో మరో తీవ్రమైన బలహీనత కూడా ఉంది. గాంధీ తన ఆలోచనలకు అనుగుణంగా చర్చలకు వెళ్లేందుకు సిద్దపడినప్పుడు గాని, గాంధీ జిన్నాల మధ్య జరిగే చర్చలకు రాజగోపాలాచారి మౌలిక భూమికను ఏర్పాటు చేసినప్పుడుగాని, జిన్నా చాకచక్యంగా ఆ సంభాషణలను ఉపయోగించుకొని బ్రిటిష్ పాలకులతో బేరసారాలు ఆడేటప్పుడు, ఆ తరువాత వరుసగా జరిగిన సంఘటనల సందర్భంలో గాని రాజకీయ నాయకులు తమ, తమ వర్గ ప్రయోజనాలు కాపాడుకునేందుకే ప్రాధాన్యతనిస్తున్నారన్న వాస్తవాన్ని పార్టీ ప్రజలకు ఎప్పటికప్పుడు బహిరంగపరచడంలో పూర్తిగా విఫలమయింది. రాజకీయ నాయకుల డిమాండ్ల పర్యవసానాలు పూర్తిగా అర్థం చేసుకోకుండా వారు రాజీలు పడుతూ చేసుకుంటున్న ఒప్పందాలను సమర్థించింది. రాజగోపాలాచారి, ఇతర జాతీయనాయకుల లాగానే గాంధీ, జిన్నా చర్చలే సమస్యకు పరిష్కారం అన్నట్టు ప్రచారం చేసింది. తన పత్రికలలో వ్యాసాలు వ్రాసింది. దేశం కలిసి ఉండాలనుకుంటున్న, రాజీలు పడకూడదనుకుంటున్న, స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొన్న కార్యకర్తల నైతిక బలాన్ని పెంచే విధంగా కృషి చేయలేదు. కాంగ్రెస్, లీగ్‌ల నాయకత్వం బ్రిటీష్ వారితో రాజకీయ బేరసారాలు జరుపుతున్నప్పుడు ఆ రోజుల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాలను గురించి ప్రజలను హెచ్చరించడంలో పార్టీ విఫలమ యింది. అయినప్పటికీ భారతదేశం బహుళ జాతుల సమాఖ్య అని, ప్రతిజాతి అభివృద్ధి చెందే అవకాశాలున్న పరిస్థితులలోనే ఐక్యత సాధించడం సాధ్యమవుతుందని భారతదేశ ప్రజలలో రాజకీయ ప్రచారం చేయడంలో పార్టీ అత్యంత విలువైన పాత్ర పోషించింది. ఈ కాలంలో చేసిన ఉద్యమాల వల్లనే తరువాతి కాలంలో సంస్థానాలను, ప్రాంతాలను భాషా ప్రాతిపదికన విభజించడానికి 'ఐక్య కేరళ', 'విశాలాంధ్ర', 'సంయుక్త మహారాష్ట్ర', 'మహా గుజరాత్' వంటి శక్తివంతమైన ఉద్యమాలను పార్టీ నిర్మించగలిగింది.

1944-45 నుండి కమ్యూనిస్టులు భారత దేశ జాతుల సమస్యను సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, ప్రజాస్వామ్యం కోసం జరిగే పోరాటంగానూ పరిశీలించటానికి ప్రయత్నించారు. దీని ఫలితంగా మూడు ఏకాంశ పత్రాలు -భవాని సేన్ వ్రాసిన నూతన బంగ్లా, పుచ్చలపల్లి సుందరయ్య వ్రాసిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం, ఈ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ వ్రాసిన ఒనేకల్ కోటి మళయాళికళ్ (కోటి 25 లక్షల మంది మళయాళీల సమస్య)- మూడు జాతుల సమస్యలను మార్క్సిస్టు దృక్పథంలో చారిత్రక, సమకాలీన పరిస్థితులకు అన్వయించి పరిశీలించడం జరిగింది. ఆ కాలంలో జరిగిన సైద్ధాంతిక క్రియాశీల కార్యక్రమాలు ఆ తరువాతి కాలంలో జరిగిన అనేక ఉద్యమాలకు పునాదులు వేశాయి. బెంగాల్‌లో జరిగిన తెభాగా ఉద్యమం, ఆంధ్రాలో జరిగిన తెలంగాణా పోరాటం, కేరళలో జరిగిన పున్నప్రా వాయిలార్ పోరాటం అందుకు ఉదాహరణలు. రాజకీయ బేరసారాలు జరిపే గాంధీ, నెహ్రూ కూటమితో ఏ మాత్రం రాజీపడలేని సుభాష్ చంద్రబోస్ మద్దతుదారులకు, సోషలిస్టులకు మధ్య ఉన్న మౌలికమైన వైరుధ్యాలు త్వరలోనే బయట పడ్డాయి. ఆ గ్రూపులలో ఏ ఒక్కదానితో చేతులు కలపకుండా స్వతంత్రంగా ప్రజల, కార్మికవర్గ ప్రయోజనాలు కాపాడుతూ, నిజమైన ప్రజాస్వామ్య పతాకాన్ని ఉన్నతంగా ఎగురవేస్తూ, కమ్యూనిస్టు పార్టీ తన స్వతంత్రతని కాపాడుకున్నది. ఎగిసిపడుతున్న ప్రజా ఉద్యమాలలో కమ్యూనిస్టులు మమేకం కాగలిగారు.

1945 చివరిలో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రభంజనంలో భాగంగా రెండు అతి ముఖ్యమైన సంఘటనలు, ఐ ఎన్ ఏ విచారణ, ప్రభుత్వం భారతదేశ సైనికులను ఇండోనేషియా, ఇండో చైనా, ఇతర దక్షిణ, ఆగ్నేయాసియా దేశాలకు పంపడానికి నిర్ణయించడం జరిగాయి. ఈ చర్యలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, సోషలిస్టులు పెద్ద పెద్ద ప్రదర్శనలు నిర్వహించారు. కాంగ్రెస్, లీగ్ సభ్యులుకూడా ఈ కార్యక్రమాలలో భాగస్వాములయ్యారు. ఐ ఎన్ ఏ నాయకులను విడుదల చేయాలని కలకత్తా, బొంబాయి. మధుర, ఢిల్లీ, మీరట్, పెషావర్ వంటి అనేక పట్టణాలలో ప్రదర్శనలు జరిగాయి. అణచివేతను ఎదిరించి మరీ ప్రజలు ఈ ప్రదర్శనలలో పాల్గొన్నారు. కలకత్తాలో ఇవి మరింత ఉన్నత స్థాయిలో జరిగాయి. కార్మికులు చాలా రోజులు సమ్మెలు చేసి విద్యుత్ శక్తి, రవాణా, నీటి సరఫరా, మొదలైన సేవలను నిలిపివేశారు. ప్రజలు దక్షిణ కలకత్తాలో బారికేడ్లు పెట్టి మిలిటరీ వాహనాలకు నిప్పు పెట్టారు. బెంగాల్ గవర్నర్ మిలిటరీ సహాయంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిస్థితులలో మొట్ట మొదటిసారిగా పార్టీ తన సొంత కార్యక్రమంతో, డిమాండ్లతో విస్తృతంగా ఎన్నికలలో పాల్గొంది. అయితే ఎన్నికలలో కాంగ్రెస్, లీగ్ రెండే ప్రధానమైన పార్టీలుగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలు, నినాదాలు కాంగ్రెస్, లీగ్‌ల కు మించిన గుర్తింపును పొందలేదు. ప్రధానమైన పోటీ కాంగ్రెస్, లీగ్‌ల మధ్యే ఉంది. ఫలితంగా చురుకుగా ప్రజా ఉ



epaper.prajasakti.com

ద్యమాలను నిర్మించినా, రాజ్యాంగాన్ని రూపొందించడంలో ముఖ్య భూమికను పోషించే ప్రధానశక్తిగా కమ్యూనిస్టు పార్టీ ముందుకు రాలేదు.

**కమ్యూనిస్టులు**
**రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు**

ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఐ.ఎన్.ఏ) చుట్టూ ఆరోపణల ఉచ్చు బిగుస్తూ, విచారణ జరుగుతుండగా, జాతీయభావనలు పెరిగి, 1945-46 శీతాకాలానికి బ్రిటిష్ సామ్రాజ్యా నికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణలు హింసాత్మ కంగా మారాయి. ఈ ప్రజా నిరసనలు బ్రిటిష్ సైనిక దళాలలో పనిచేస్తున్న భారతదేశ సైనికులు, అధికారులను బాగా ప్రభావితం చేశాయి. అందు లో కొంతమంది ఉన్నతస్థాయి సాంకేతిక నిపుణులైనందువలన వారికీ, బ్రిటిష్ సైన్యంలో పనిచేసిన అంతకు ముందుతరం వారికీ తేడా ఉంది. పైగా రెండో ప్రపంచయుద్ధ కాలంలో వారు మిత్రపక్షాలతో, ముఖ్యంగా సోవియట్ యూనియన్ ఎర్రసేనతో కలిసి యుద్ధరంగంలో పాల్గొన్నారు. ఆ సైనికులతో కలిసి పనిచేయడం వలన ఫాసిజం వ్యతిరేకత, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సోషలిజం వంటి ఆలోచనలు వారిని ప్రభావితం చేశాయి.

జాతీయోద్యమం, ఐ.ఎన్.ఏ ప్రభావానికి లోనయిన కొంతమంది భారతదేశ నావికాదళ సైనికులు ఆజాద్ హింద్ అనే ఒక రహస్య సంఘాన్ని స్థాపించారు. ఈ సంఘం నావికా దళంలో తిరుగుబాటును రెచ్చగొట్టడంలో కీలకపాత్ర పోషించింది. రాయల్ ఇండియన్ నేవీ నావికులు సమ్మె చేస్తున్నప్పుడు ఈ తిరుగుబాటు జరిగింది.

ఫిబ్రవరి 18వ తేదీ ఎచ్.ఎం.ఐ.ఎస్ తల్వార్ దళంలో 1,100 మంది నావికులు సమ్మె చేశారు. వీరితో పాటు బొంబాయి భారత నావికాదళంలో పనిచేస్తున్న 5,000 మంది నావికులు తాము ఎదుర్కొంటున్న వివక్ష, నిరాదరణలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్న వారితో చేయి కలిపారు. నావికులు నౌకలపై ఎగురుతున్న యూనియన్ జాక్ జండాని దించి కాంగ్రెస్, ముస్లిం లీగ్, ఎర్ర జండాలను ఎగురవేశారు. ఆయుధాలు చేబూని వారి పైఅధికారులను ఖైదు చేసారు. ఆ తరువాతి రోజు కోట, బారక్‌లలోని నావికులు నగరంలో జరుగుతున్న సమ్మెలో చేరి కాంగ్రెస్, ముస్లింలీగ్, ఎర్రజండాలు ఎగురవేశారు. నావికులలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ఉన్నారు. అనేక ప్రాంతాలకు చెందినవారు, అనేక భాషలు మాట్లాడేవారున్నారు.

ప్రభుత్వంలో విధులు నిర్వహిస్తున్న భారతీయులందరు వివక్షకు గురవుతున్నారు. వారికి తక్కువ జీతాలు ఇస్తున్నారు. తినటానికి పనికిరాని భోజనం పెడుతున్నారు. అందువలన ఎన్నో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. సైన్యాన్ని వదిలి పారిపోతున్నారు. ఎచ్ ఎం ఐ ఎస్ తల్వార్‌లో బి.సి. దత్ అనే నావికుడు, 'క్విట్ ఇండియా', 'సామ్రాజ్యవాదం నశించాలి' అని రాసినందుకు ఖైదు చేయబడడాన్ని తీవ్రంగా నిరసించారు. మంచి ఆహారం, సరిపడా నిత్యావసర వస్తువులు ఇవ్వాలి. భారతీయ నావికులను దుర్భాషలాడినందుకు ఎచ్ ఎం ఐ ఎస్ తల్వార్ కమాండింగ్ అధికారిపై చర్య తీసుకోవాలి, అధికారుల దురాగతాలను అరికట్టాలి. సైనికులను వెంటనే వారి వారి స్వస్థలాలకు చేర్చాలి, వారికి పునరావాసం కల్పించాలి, గ్రాట్యుటీ ఇవ్వాలి, ఐ ఎన్ ఏ ఖైదీలతో సహా రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలి, ఇండోనేషియా నుంచి భారత సైనికులను వెంటనే స్వదేశానికి రప్పించాలి, భారత దేశవ్యాప్తంగా జరుగుతున్న పోలీసు కాల్పులపై నిష్పక్షపాత విచారణను ఆదేశించాలన్న వాటిని ప్రధాన డిమాండ్లుగా నావికులు ముందుకుతెచ్చారు.

బొంబాయితో పాటు కరాచీ నావికులు కూడా తిరుగుబాటు చేశారు. ఫిబ్రవరి 19న కరాచీకి వార్త చేరింది. వెంటనే తీరంలో ఉన్న మూడు నౌకలు, మరో నావ మెరుపు సమ్మెలో చేరాయి. భారతదేశ నావికులు సమ్మెను ఆపకపోతే నావలన్నిటిని పేల్చేస్తానని బ్రిటిష్ కమాండర్ అడ్మిరల్ గోడ్ ఫ్రెయ్ ఆఖరి హెచ్చరిక జారీ చేసిన వెంటనే ఈ రెండే కాక మద్రాస్, విశాఖపట్నం, కలకత్తా, కొచ్చిన్, జాంనగర్, అండమాన్స్, బహ్రెయిన్ , అడెన్‌లలోని నావికులు సమ్మెకు మద్దతు ప్రకటించారు. సముద్రంలో ఉన్న 78 నౌకలు, ఒడ్డునున్న 28 నౌకలలో పనిచేస్తున్న 20,000 మంది నావికులు ఈ పరిణామాల వలన ప్రభావితులయ్యారు. బొంబాయిలోని అంధేరి, మెరైన్ డ్రైవ్, సియోన్ ప్రాంతాలలో ఉన్న నావికులు, పూనా, కలకత్తా, జెస్సోర్, అంబాలలో ఉన్న యూనిట్లు కూడా ఈ ఆందోళనకు మద్దతు తెలిపాయి. జబల్పూరులో ఉన్న సిపాయిలు కూడా సమ్మెలో భాగస్వాములయ్యారు. కొలాబా కంటోన్మెంట్‌లో ఉన్న సైనికులు కూడా రాబోయే పరిణామాలను ఎదుర్కోవటానికి సన్నద్ధమయారు.

**కమ్యూనిస్టు పార్టీ పాత్ర**

నావికుల న్యాయమైన డిమాండ్లకు కమ్యూనిస్టు పార్టీ వెంటనే మద్దతు తెలిపింది. ఫిబ్రవరి 19న నావికుల సమ్మెకు మద్దతు నివ్వమని ప్రజలను కోరుతూ కరపత్రం వేశారు. ఫిబ్రవరి 22న జరగబోయే సార్వత్రిక సమ్మెలో ప్రజలను పాల్గొనమని తన పత్రిక ద్వారా పిలుపునిచ్చింది - దాని ఫలితంగానే రియర్ అడ్మిరల్ గోడ్ ఫ్రెయ్ నావికాదళాన్ని నిర్వహిస్తున్న భారతమాత ముద్దుబిడ్డలను నాశనం చేస్తానని రంకెలేశాడు. దేశవ్యాప్తంగా విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. నావికులకు మద్దతు తెలుపుతూ అధికారుల అణచివేతను ఖండిస్తూ హర్తాళ్లు, ప్రదర్శనలు నిర్వహించారు. దీనిని స్వతంత్ర పోరాటంలో భాగంగా భావించి దేశంలోని ప్రతివ్యక్తీ ఈ తిరుగుబాటుకు మద్దతు తెలిపారు.

దేశంలోని రాజకీయ పార్టీలన్నీ తమ తమ విభేదాలను పక్కన పెట్టి నావికుల డిమాండ్లకు మద్దతునివ్వాలని, వారికి అండగా ఉండాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన సమ్మె పిలుపుతో రెండు లక్షలమంది కార్మికులు రోడ్డెక్కారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు, హొటళ్ళ యజమానులు హర్తాళ్‌లో భాగస్వాములయ్యారు. పరిశ్రమలలో, రవాణా రంగంలో పనిచేసే కార్మికులు, విద్యార్థులు సమ్మెలో పాల్గొని దేశాన్ని స్థంభింపచేశారు. బొంబాయిలో కనివిని ఎరుగని రీతిలో సమ్మె, హర్తాళ్ జరిగాయి. ఇందుకు బదులుగా బ్రిటిష్ అధికారులు బ్రిటిష్ సాయుధ సైనికులతో నిండిన వాహనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఏ మాత్రం హెచ్చరికలు లేకుండా కక్షకట్టి ఎక్కువ మంది ప్రజలు గుమిగూడిన చోట్ల విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో అనేకమంది మహిళలు, పురుషులు మరణించారు. కమ్యూనిస్టు, పరేల్ మహిళా సంఘ్ నాయకురాలు అయిన కమల్ దొందే అటువంటి వారిలో ఒకరు. అధికారిక లెక్కల ప్రకారం ఫిబ్రవరి 21 -23 తేదీల మధ్య, అంటే మూడు రోజుల్లో 250 మందిని పొట్టన పెట్టుకున్నారు. 'తుపాకులు, ట్యాంకులు, బాంబులు భారతదేశాన్ని బెదిరించే రోజులకు కాలం చెల్లిందని', 'సామ్రాజ్యవాదులు పారిస్తున్న రక్తపుటేరులు దేశ ఐక్యతని పెంచి, హింసాత్మక పాలనకు చరమగీతం పాడతాయని' పార్టీ ప్రకటించింది. ప్రభుత్వ అణచివేతకు నిరసనగా అన్ని పార్టీలు, ప్రజలందరూ సంపూర్ణ హర్తాళ్‌లో పాల్గొనాలని, అన్ని దుకాణాలు, స్కూళ్ళు, కాలేజీలు, మిల్లులు మూసివేయాలని, అణచివేతను వెంటనే నిలిపివేసి చర్చలకు ఆహ్వానించాలని, సమ్మెలో పాల్గొన్న నావికుల న్యాయమైన కోర్కెలను అంగీకరించాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. బొంబాయి పౌరులు, కార్మికులు ఈ డిమాండ్లకు మద్దతు తెలిపారు. సంపూర్ణ హర్తాళ్‌ను పాటించి నావికుల ధైర్య సాహసాలకు తమ సంఘీభావాన్ని తెలియచేశారు.

ఈ సంఘటనలో గాయపడిన, మరణించిన వారికి సహాయాన్ని అందించడానికి 'పౌరులతో శాంతి, సహాయక కమిటీలు వేయాలని పార్టీ పిలుపునిచ్చింది. రాయల్


epaper.prajasakti.com

ఇండియన్ నేవీలో సమ్మె చేస్తున్నవేలాది మంది నావికులు ఆజాద్ హింద్‌లో ప్రముఖ పాత్ర నిర్వహిస్తు న్నందు వలన, వారి సమస్యలను పరిష్కరించేం దుకు కాంగ్రెస్ చొరవ తీసుకోవాలని పార్టీ పిలుపునిచ్చింది. వారి సమస్యలు న్యాయంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించాలని కోరింది. కేంద్ర అసెంబ్లీలో కూడా నావికుల డిమాండ్లను లేవనెత్తాలని, వారి సమస్యలు పరిష్కరించేటట్టు చూడాలని కాంగ్రెస్, లీగ్‌లను పార్టీ కోరింది. ఒక విచారణ కమిటీని వేయాలని, న్యాయ బద్ధమైన కోర్కెలతో సమ్మె చేస్తున్న నావికుల డిమాండ్లను పరిష్కరించడానికి చర్యలు తీసు కోవాలని పార్టీ డిమాండ్ చేసింది. నావికుల తిరుగుబాటు జరిగి ఉండకపోతే విచారణ కమిటీని వేసి ఉండేవారు కాదు. వివక్ష, హింస, దుర్భరమైన నావికుల వెతలు ఎన్నటికీ వెలుగు చూసేవి కావు. పార్టీ తీసుకున్న చర్యల వల్లనే రాయల్ ఇండియన్ నౌకాదళం, అందులోని నావికులను ధ్వంసం చేయలేదు. చర్చలు జరిపి ఒక అవగాహనకు కూడా వచ్చారు. సమ్మెకు నాయకత్వం వహించిన ముఖ్యులను వేధింపు లకు గురిచేయబోమని, ఖైదు చేయబోమని ఒప్పందంలో అంగీకరించిన అంశాలను ప్రభు త్వం ఉల్లంఘించినపుడు పార్టీ ఖండించింది.

**తిరుగుబాటు ఎందుకు విఫలమయింది?**


భారతజాతీయ సంఘటనలోనే కొన్ని బల హీనతలు ఉ న్నాయి. కాంగ్రెస్, ముస్లింలీగ్‌లలోని నాయకత్వం ప్రజాపోరాటాలు ఉవ్వెత్తున లేవడం చూసి భయపడింది. దేశవ్యాప్తంగా తిరుగుబాట్లు జరిగి, సైన్యం-వైమానిక, పదాతి దళాల-లోకి విస్తరిస్తాయేమోనని భయపడ్డారు. అధికారికంగానే ప్రజలందరూ పాల్గొన్న హర్తాళ్ళను, సమ్మెలను వారు వ్యతిరేకించారు. నావికుల తిరుగుబాటును 'అన్న పానీయాల' సమస్యగా చూశారు. దానిని జాతి వివక్షకు వ్యతిరేకంగా జరుగున్న పోరాటంగా, జాతీ యోద్యమ పోరాటంలో భాగంగా చూడ నిరాకరిం చారు. సామ్రాజ్యవాదుల తూటాలకు వందలాది మంది ప్రజలు బలవడాన్ని కాంగ్రెస్, లీగ్ రెండూ ఖండించలేదు. కానీ నిరాయుధులైన, తూటాలకు బలైన ప్రజలను తప్పుబట్టారు. నావికుల తిరుగుబాటు విషయంలో వారు తమని తాము చట్టాన్ని రక్షించేవారి స్థానంలో ఉన్నట్లుగా చూసుకున్నారు. 'నావికులలో క్రమశిక్షణ ఉండాలని కమాండర్ ఇన్ చీఫ్ సూచించిన దానితో వల్లభాయ్ పటేల్ ఏకీభవిం చారు. గాంధీజీ కూడా ఈ తిరుగుబాటును 'హిందూ ముస్లింల అపవిత్ర కలయిక'గా వర్ణించి, ఖండిస్తూ ప్రకటనను విడుదల చేశారు. రిన్‌ను లొంగిపోమని సలహా ఇచ్చారు. వల్లభాయ్ పటేల్, జిన్నాల సలహా మేరకే ఆఖరికి ఫిబ్రవరి 23వ తేదీన కేంద్ర నావికా సమ్మె కమిటీ 'మేము బ్రిటిష్ ప్రభుత్వానికి కాదు, భారత దేశానికి లొంగి పోతున్నామని' ప్రకటించింది. శక్తివంతమైన కాంగ్రెస్, లీగ్‌లను తమతో తీసుకెళ్లగల బలం లేకపోయినందుకు కమ్యూనిస్టు పార్టీ విచారం వ్యక్తం చేసింది- అందువలనే సమ్మె చేసిన నావి కులను రక్షించలేక పోయింది. సమ్మె చేస్తున్న నావికులు లొంగిపోకుండా ఆపలేక పోయింది.

వారిపై జరిగిన దమనకాండను ఆపలేకపోయింది. అయినప్పటికీ రాయల్ ఇండియన్ నావికుల తిరుగుబాటుకు 'తన సర్వశక్తులు ఒడ్డి అండగా నిలబడ్డానని, అలా అది పూర్తిగా ధ్వంసం కాకుండా నిలవరించానని' కమ్యూనిస్టు పార్టీ ఖచ్చితంగా చెప్పుకోగలదు.

**(అనువాదం: కె ఉషారాణి)**

# సింధు నాగరికత - పతనం

(11వ పేజీ తరువాయి)



**వస్త్రాలను ఉత్పత్తి చేసిన మొహింజెదరో కేంద్రం**

న్నాయి. చైనీస్ భాష 40,000 కు పైగా సంకేతాలతో ఉంది. ఇటువంటి సంకేతాలు సింధు లిపిలో 400 వరకు లభించాయి. ఇదే తరహా భాష ఆది ద్రావిడ జాతులలోనూ ఉండేది. ప్రజలు తమ జీవన గమనంలో ఎక్కడి కక్కడ తమతమ భాషలను అవసరాలకు తగినట్లు రూపొందించుకున్నారు. ఇది చరిత్ర చెప్తున్న వాస్తవం. కాని 'హిందూత్వ'వాదులు సంస్కృతం నుంచే అన్ని భాషలూ పుట్టాయంటూ నిరాధా రంగా ప్రచారం చేస్తున్నారు.

**మూడవది :** భారతదేశం వేదభూమి అని, అనాదిగా వేదాలు ఇక్కడ వర్థిల్లుతున్నాయని, దేముడే వేదాలు సృష్టించి మనకు ఇచ్చాడని చెప్తుం టారు. కాని వేదాలలోకెల్లా ప్రాచీనమైనది రుగ్వే దం. ఇది క్రీ.పూ. 1,700-1,500 మధ్య కాలం నాటిదని ఆధునిక చరిత్రకారులు నిర్ధారించారు.

రుగ్వేదంలోని భాష ఉత్తర సిరియా ప్రాంతంలో వాడే మిటాన్నీ భాషను ( ఇది అక్కడి ప్రాచీన భాష) ఎక్కువగా పోలి వుంది. ఆ ప్రాంతపు పాలకులు ఉపయోగించిన భాషనే రుగ్వేద భాష పోలి వుంది. ఆ కాలం క్రీ.పూ 2,000-800 మధ్య. అంతకన్నా ముందే రుగ్వేద భాష ఉండేదని అనుకోలేం.

రుగ్వేద భాషలోని పదాలు గాని, వ్యాకరణ నిర్మాణం గాని పురాతన ఇరాన్ గ్రంథం 'అవేస్థ' లోని భాషకు బాగా దగ్గరగా ఉన్నాయి. ఈ అవేస్థ క్రీ.పూ. 1,300-1,000 మధ్య కాలం నాటిదని పరిశోధకులు నిర్ధారించారు.

రుగ్వేదంలో గుర్రాలు, రథాల ప్రస్తావన తరచూ ఉంటుంది. ఇవి మన దేశంలో ప్రవేశిం చిందే క్రీ.పూ. 1,700 ప్రాంతంలో. రుగ్వేద ఆర్యులు భారత ఉపఖండంలోకి వచ్చే ముందు ప్రస్తుత ఆఫ్ఘన్ ప్రాంతం వరకు వారు వచ్చింది క్రీ.పూ. 1,700 ప్రాంతంలో.

ఈ ఆధారాలన్నింటిని బట్టి రుగ్వేదం క్రీ.పూ. 1,500 కంటే ముందు లేదని స్పష్టంగా చెప్పవచ్చు.

'హిందూత్వ' సిద్ధాంతం ప్రాచీనతను ఆకాశానికెత్తడం ద్వారా తనను తాను సమర్థించుకుంటుంది. తనదే ఆ ప్రాచీనత అంతా అని చెప్పుకోవాలన్నది దాని తాపత్రయం. కాని ఆర్యన్ ప్రాచీనత కన్నా ముందే భారత ఉపఖండంలో సింధు, ఆది ద్రావిడ జనావాసాలు, నాగరికతలు విలసిల్లాయన్నది చరిత్ర ధృవీకరిస్తున్న సత్యం.

**సింధు నాగరికత-కాలక్రమణ పట్టిక**

క్రీ.పూ

| | |
|---|---|
| 2600-2500 | సింధు నాగకరిత స్థాపన-విస్తరణ |
| 2500-2000 | సింధు నాగరికత ప్రధాన, పరిపక్వత చెందిన కాలం |
| 2350-2000 | సింధు-మెసపటేమియాల మధ్య వాణిజ్యం జరిగిన కాలం |
| 2000-1900 | సింధు నాగరికత పతనం |
| 1900-1700 | ఆఖరి సింధు నాగరికత అవశేషాలు దైమాబాద్. |

❋



epaper.prajasakti.com

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-07-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20



# విజయం కోసం ప్రజలను ఐక్యం చేయాలి

**మావో జెడాంగ్**



“రాజ్యం దిగజారిపోవటం, మానవుల కష్టాలు, సమాజం అంధకారంలో మునిగిపోవటం అతి తీవ్రమైన దశకు చేరుకున్నాయి. వీటిని సంస్కరించటానికి, మెరుగు చేయటానికి విద్య, పారిశ్రామికీకరణ, కష్టపడి కృషిచేయటం, నూతన ఆవిష్కరణలు, పనికిరాని దానిని నాశనం చేయటం, నూతనమైన వాటిని నిర్మించటం తదితరాలన్నీ సరైనవే. కాని వీటన్నింటికన్నా ప్రధానమైన విధానం ఒకటున్నది. సామాన్య ప్రజలను ఐక్యం చేయటమే ఆ విధానం. మనం చరిత్రను పరిశీలించినట్లైతే ఏ మాత్రం మినహాయింపు లేకుండా నిర్దిష్ట సంఖ్యలో ప్రజలను ఐక్యం చేయగలిగినపుడే వివిధ రకాలైన ఉద్యమాలు వచ్చాయి. సహజంగా పెద్దస్థాయిలో ఉద్యమాలు రావాలంటే పెద్దసంఖ్యలో ప్రజలను ఐక్యం చేయాలి. అత్యున్నతస్థాయిలో ఉద్యమాలు రావాలంటే అత్యున్నత స్థాయిలో ప్రజలను ఐక్యం చేయాలి. సంస్కరణలు, ప్రతిఘటనలు జరుగుతున్న కాలంలోనే అటువంటి ఐక్యత, ఉద్యమాలు వస్తాయి.

“విజయానికి, పరాజయానికి మధ్య సంఘటనలోని ఐక్యత, బలహీనతలు, అది ఎంచుకున్న సిద్ధాంతం కాలం తీరినదా, నూతనమైనదా, అది సత్యమైనదా, అసత్యమైనదా అన్న అంశాలు ఉంటాయి. (సమాజంలో శక్తివంతులైన ప్రభువర్గానికి, పెట్టుబడిదారీ వర్గానికి చెందినవారు, ఇతర బలమైన వర్గాలు ప్రజలపై అణచివేతను అతి తీవ్రమైన స్థాయికి తీసుకువెళ్ళాయి). ఫలితంగా సమాజంలో తిరోగమన ధోరణులు, ప్రజల కష్టాలు పెరగటం, రాజ్యం దిగజారిపోవటం ఒక కొసకు చేరుకుంటున్నాయి. అటువంటి పరిస్థితులలో పెద్దసంఖ్యలో ప్రజలను ఐక్యం చేయటం ద్వారా సంస్కరణలు, ప్రతిఘటన ఉద్యమాలు వచ్చాయి.

“ఫ్రాన్స్‌లో రాచరికాన్ని బలపరిచే శక్తుల కూటమికి వ్యతిరేకంగా సామాన్యప్రజలు భారీస్థాయిలో ఐక్యమై విజయం సాధించటంతో ‘సామాజిక, రాజకీయ సంస్కరణలను సాధించారు. అనేకదేశాలు ఫ్రెంచి ఉదాహరణను అనుసరించి, అన్ని విధాలైన రాజకీయ సంస్కరణలను సాధించాయి. గత సంవత్సరం అత్యంత బలంగా సంఘటితమై ఉన్న రష్యన్ రాచరికం, బూర్జువా వర్గాలకు వ్యతిరేకంగా అత్యంత సంఘటితంగా ఉన్న ప్రజలు చేసిన పోరాట విజయంతో సామాజిక, రాజకీయ సంస్కరణలు సాధించారు. రష్యన్ అనుభవాలను తీసుకొని ఆస్ట్రియా, హంగరి, చెకొస్లొవేకియా, జర్మని తదితర దేశాలలో పోరాటాలు చేసి అనేక విధాలైన సామాజిక, రాజకీయ సంస్కరణలు సాధించారు. ఈ విజయం సంపూర్ణం కాకపోయినప్పటికీ, అది ప్రపంచవ్యాపితంగా విస్తరిస్తుందని భావించవచ్చు. ఇతర దేశాలలో ఉన్న మన సోదరులు తమ ప్రయోజనాలను సాధించుకోవటం కోసం తరచుగా ఈ విధానాలను అనుసరిస్తున్నారని మనకు తెలుసు. మనం చైతన్యవంతులం కావాలి. వారనుసరిస్తున్న విధానాలను మనం కూడా అనుసరించాలి. మనం కూడా అత్యున్నత స్థాయిలో మన ప్రజలను సంఘటితం చేయాలి. మనం నిటారుగా నిలబడి చప్పట్లు కొట్టగానే మన శత్రువులు భయంతో వణికిపోతారు. ప్రాణభయంతో పారిపోతారు.

“తమ స్వప్రయోజనాలను సాధించుకోవటం కోసం తమతో ఉన్న ప్రజల ప్రయోజనాలకు హానిచేసే శక్తివంతులైన దోపిడీదారులకు వ్యతిరేకంగా అత్యున్నత స్థాయి ఐక్యత సాధనకు పునాదిగా అనేక చిన్న చిన్న సంఘాలను నిర్మించాలి. మన పరిస్థితులు, వృత్తులు విభిన్నంగా ఉండటం వలన మన మధ్య కొన్ని చిన్న, పెద్ద వ్యత్యాసాలు ఉంటాయి. కాబట్టి మనం ప్రజలందరినీ ఐక్యం చేసేక్రమంలో కూడా చిన్న, పెద్ద వ్యత్యాసాలు ఉంటాయి.

“మనం వ్యవసాయం చేసుకొంటుంటాం. మన ప్రయోజనాలను సాధించుకోవటానికి మనలాగే వ్యవసాయం చేసే ఇతరులతో ఐక్యం కావాలి. వ్యవసాయదారులమైన మన ప్రయోజనాలను మనమే రక్షించుకోవాలి. భూస్వాములు మనలను ఏ విధంగా చూస్తున్నారు? మనం చెల్లించే కౌలు, పన్నులు తక్కువగా ఉన్నాయా లేక ఎక్కువగా ఉన్నాయా? మన ఇళ్ళు సంతృప్తికరంగా ఉన్నాయా? మన కడుపులు నిండుతున్నాయా? మనకు సరిపోనూ భూమి ఉందా? సాగు చేయటానికి భూములు లేనివారు గ్రామాలలో లేరా? ఈ ప్రశ్నలన్నింటికీ మనం నిరంతరం సమాధానాలను అన్వేషించాలి.

“మనం కార్మికులం. మన ప్రయోజనాలను సాధించుకోవటం కోసం మనలాగే వివిధరకాలైన పనులు చేస్తున్న కార్మికులతో కలవాలి. వేతనాలు, పనిగంటలు, డివిడెండ్లు, మనకు రావలసిన ప్రయోజనాలను సమానంగా పంచుకోవటం తదితర సమస్యలకు పరిష్కారాలను వెతకటంలో మనం ఎప్పటికీ విఫలం కాకూడదు.

“మనం ఇప్పటికే 20వ శతాబ్దంలో జీవిస్తున్న విద్యార్థులం. అయినప్పటికీ కాలం చెల్లిన సాంప్రదాయాలు, విధానాలను అనుసరించాలని వారు మనపై వత్తిడి తెస్తున్నారు. మనదేశం ధ్వంసం అయ్యే పరిస్థితులలో ఉన్నప్పటికీ మన దేశాన్ని మనం ప్రేమించకుండా వారు మనలను నిరోధిస్తున్నారు. మనం ఐక్యతను కోరుకొంటున్నాం. మన మహిళలు మరింతగా కష్టాలలో కూరుకుపోతారు. మన ఐక్యతను ముందుకుతీసుకుపోవాలని మనం కోరుకుంటున్నాం”.

***(1917లో మావో జెడాంగ్ చేసిన “గ్రేట్ యూనియన్ ఆఫ్ ది మాసెస్” ప్రసంగంలోని కొన్ని భాగాలు).***

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.2. Published on July 1, 2020



epaper.prajasakti.com